www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 4-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 35

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి రా. 8.39 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 10.07 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: ఉ.5.58-7.26; దుర్ముహూర్తం: ఉ.5.51-7.32; అమృతఘడియలు: మ.2.46-4.14; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.32

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అక్షయ తృతీయ వేడుకలు
3rd May to 10th May 2024
ది చెన్నయ్ షాపింగ్ మాల్
916 గోల్డ్ • డైమండ్స్ • సిల్వర్ ఆర్టికల్స్



అరబిందో ఫార్మాకు జీఎస్‌టీ నోటీసు

హైదరాబాద్: తప్పుడు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ క్లెయిమ్ అభియోగంపై అరబిందో ఫార్మాకు జీఎస్‌టీ అధికారుల నుంచి వడ్డీ, పెనాల్టీ సహా రూ.13 కోట్ల డిమాండ్ నోటీసు అందింది. హైదరాబాద్‌లోని పంజాగుట్ట డివిజన్ డిప్యూటీ కమిషనర్ (ఎస్‌టీ) ఎస్‌టీయూ-1 నుంచి ఈ పన్ను నోటీసు అందినట్టు అరబిందో ఫార్మా రెగ్యులేటరీ సంస్థలకు పంపిన ప్రకటనలో తెలిపింది.

రూ.6,54,50,645 ఐటీసీ రివర్సల్‌తో పాటు వడ్డీగా రూ.5,92,20,900, పెనాల్టీగా రూ.65,51,354 చెల్లించాలని ఆ నోటీసులో ఆదేశించినట్టు పేర్కొంది. దీనిపై అప్పిలేట్ యంత్రాంగం ముందు అప్పీల్ చేయనున్నట్టు కూడా తెలియచేసింది. తమ ఆర్థిక వ్యవహారాలపై గాని, కంపెనీ కార్యకలాపాలపై గాని దీని ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

7 అదానీ కంపెనీలకు సెబీ షోకాజ్ నోటీసులు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లోని 7 లిస్టెడ్ కంపెనీలకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. లిస్టింగ్ నిబంధనలను పాటించకపోవడంతో పాటు రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్ నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జనవరి-మార్చి త్రైమాసికంలో సెబీ ఈ నోటీసులు జారీ చేసిందని అదానీ గ్రూప్ కంపెనీలు విడివిడిగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించాయి. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం, 2023-24 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాలతో పాటు ఈ విషయాన్ని తెలిపాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ సహా అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ విల్మర్ ఈ జాబితాలో ఉన్నాయి. అయితే, తామెలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, సెబీ నోటీసులతో ఎలాంటి ప్రభావం ఉండబోదంటూ అన్ని కంపెనీలూ ఒకే తీరుగా స్పందించాయి. కానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మర్ మినహా మిగతా నాలుగు కంపెనీల ఆడిటర్లు మాత్రం సెబీ దర్యాప్తు ఫలితం భవిష్యత్‌లో కంపెనీలపై ఆర్థికంగా ప్రభావం చూపించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కాగా, సెబీ నుంచి తమకెలాంటి నోటీసులందలేదని అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ సిమెంట్ కంపెనీలైన ఏసీసీ, అంబుజా సిమెంట్ స్పష్టం చేశాయి.

గ్రూప్ మీడియా సంస్థ ఎన్‌డీటీవీ మాత్రం ఈ విషయంపై ఏ విధంగానూ స్పందించలేదు. కాగా, హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమిత కమిటీ క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ అదానీ గ్రూప్‌తో పాటు బీజేపీ చేసిన తప్పుడు దావాను సెబీ షోకాజ్ నోటీసులు తేటతెల్లం చేశాయని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతోపాటు అనుచిత పద్ధతుల్లో గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ 2023 జనవరి 24న ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీతో పాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతో పాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ దర్యాప్తులో భాగంగానే అదానీ కంపెనీలకు సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

ఈ నోటీసులపై కంపెనీలిచ్చే వివరణ ఆధారంగా సెబీ వాటిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలా..? వద్దా..? అనే విషయంపై ఓ నిర్ణయానికి రానుంది. సాధారణంగా ఈ ఉల్లంఘనల తీవ్రత ఆధారంగా జరిమానా విధింపు లేదా సంస్థ యాజమాన్యాన్ని క్యాపిటల్ మార్కెట్ నుంచి కొంత కాలం పాటు నిషేధించే అవకాశాలుంటాయి.

రూ.2.25 లక్షల కోట్లు ఆవిరి

- భారీగా తరిగిన మార్కెట్ సంపద
- సెన్సెక్స్ 733 పాయింట్లు పతనం
- 74,000 దిగువ స్థాయికి సూచీ
- 22,500 కిందికి జారిన నిఫ్టీ-50

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో భారీ నష్టాలను చవిచూశాయి. చాలా కంపెనీల షేర్లు చాలా అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో మదుపరులు పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. శుక్రవారం ఆరంభ ట్రేడింగ్‌లో 484 పాయింట్ల వరకు పెరిగి 75,000 ఎగువ స్థాయికి చేరిన సెన్సెక్స్.. కొద్ది సేపటికే నష్టాల్లోకి మళ్లింది. క్రమంగా నష్టాలు పెరుగుతూ వచ్చాయి. ఒక దశలో సూచీ 1,147 పాయింట్ల మేర క్షీణించి 73,467.73 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివర్లో కాస్త కోలుకుని 732.96 పాయింట్ల నష్టంతో 73,878.15 వద్ద ముగిసింది. నిఫ్టీ విషయానికొస్తే, ప్రారంభ ట్రేడింగ్‌లో 146.5 పాయింట్ల వృద్ధితో 22,794.70 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసిన సూచీ.. చివరికి 172.35 పాయింట్ల నష్టంతో 22,475.85 వద్ద క్లోజైంది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2.25 లక్షల కోట్లు పతనమై రూ.406.24 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నేలచూపులు చూశాయి

మరింత తగ్గిన ఫారెక్స్ నిల్వలు: వరుసగా మూడో వారమూ విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు క్షీణించాయి. గతనెల 26తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు మరో 241.2 కోట్ల డాలర్లు తగ్గి 63,792.2 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలో నిల్వలు 228 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. కాగా, ఏప్రిల్ 5తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 64,856.2 కోట్ల డాలర్లకు పెరిగాయి.

సిగ్నిటీలో మరో 26% కొనుగోలుకు కోఫోర్జ్ ఓపెన్ ఆఫర్

సిగ్నిటీ టెక్నాలజీస్ పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి 26 శాతం వాటా కొనుగోలుకు కోఫోర్జ్ శుక్రవారం ఓపెన్ ఆఫర్‌ను ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల కంపెనీ సిగ్నిటీ టెక్నాలజీస్ ప్రమోటర్లు, ఎంపిక చేసిన వాటాదారుల నుంచి 54 శాతం వరకు వాటా కొనుగోలు చేస్తున్నట్లు, ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు గురువారం ప్రకటించిన కోఫోర్జ్.. సెబీ నిబంధనల ప్రకారంగా ఈ ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. ఓపెన్ ఆఫర్‌లోనూ ఒక్కో షేరుకు రూ.1,415 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపింది. ఆఫర్‌లో భాగంగా 26 శాతం వాటాకు సమానమైన 71.62 లక్షల షేర్ల కొనుగోలుకు కోఫోర్జ్ రూ.1,013 కోట్లు వెచ్చించనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	87,200 ▲
ముంబై	71,191 ▼	65,211 ▼	79,989 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	450
వరంగల్	447	గోదావరి	450
చిత్తూరు	523	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ.60	

మార్కెట్లోకి బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 400

- ఇప్పటి వరకు 1.8 కోట్ల పల్సర్ బైక్స్ విక్రయం
- కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్



ధర రూ.1.85 లక్షలు

పుణె: ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో మార్కెట్లోకి సరికొత్త పల్సర్ ఎన్ఎస్ 400జీ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైక్ ధర రూ.1,85,000 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). శుక్రవారం పుణెలో జరిగిన కార్యక్రమంలో బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఈ బైక్‌ను లాంఛనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్సర్ ఎన్ఎస్ 400తో స్పోర్ట్స్ బైక్ విభాగంలో కంపెనీ స్థానం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త బైక్‌ను రూ.5,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చని, అయితే ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. 373 సీసీ ఇంజన్, 6 స్పీడ్ గేర్‌బాక్స్, బ్లూటూత్ కనెక్టివిటీతో కలర్ ఎల్‌సీడీ స్పీడోమీటర్, నాలుగు రకాల రైడ్ మోడ్స్ ఈ బైక్ ప్రత్యేకతలు. కాగా ఇప్పటి వరకు 1.8 కోట్ల పల్సర్ బైక్స్‌ను విక్రయించినట్లు రాజీవ్ బజాజ్ తెలిపారు. స్పోర్ట్స్, కమ్యూటర్ బైక్స్, త్రిచక్ర వాహనాల మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునేందుకు ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. 125 సీసీ బైక్స్ విభాగంలో కంపెనీకి ఇప్పటికే 32 శాతం మార్కెట్ వాటా ఉందని, దీన్ని మరింతగా పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాజీవ్ బజాజ్ చెప్పారు.

జూన్‌లో సీఎన్‌జీ మోటార్‌సైకిల్: కాగా ఈ ఏడాది జూన్ 18న ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్‌ను ఆవిష్కరించనున్నట్లు రాజీవ్ బజాజ్ వెల్లడించారు. పెట్రోల్ ధరలు భారీగా పెరిగిపోయిన పరిస్థితుల్లో వాహనదారులకు ఊరటనిచ్చే ఉద్దేశంతో ఈ బైక్‌ను రూపకల్పన చేసినట్లు తెలిపారు.

పన్నుల మోతతోనే అధిక ధరలు: దేశీయంగా వాహన పరిశ్రమపై ఉన్న అతి నియంత్రణలతోనే వాహన ధరలు గణనీయంగా పెరిగిపోయాయని రాజీవ్ బజాజ్ వ్యాఖ్యానించారు. బ్రెజిల్ వంటి దేశాల్లో మోటార్‌సైకిల్స్‌పై పన్నులు 8-14 శాతం శ్రేణిలో ఉండగా భారత్‌లో మాత్రం జీఎస్‌టీ ఏకంగా 28 శాతం ఉందని ఆయన తెలిపారు. దీంతో వాహనాల ధరలను తగ్గించే పరిస్థితి ఉండటం లేదన్నారు. ప్రభుత్వం జీఎస్‌టీని 12-18 శాతానికి తగ్గిస్తే వినియోగదారులతో పాటు ఆటోమొబైల్ పరిశ్రమకు మేలు చేకూరుతుందని రాజీవ్ అన్నారు.

సెలెక్ట్ మొబైల్స్ 6వ వార్షికోత్సవ ఆఫర్లు



హైదరాబాద్: సెలెక్ట్ మొబైల్స్ 6వ వార్షికోత్సవ ఆఫర్లను ప్రకటించింది. ఈ నెల 3 నుంచి జూన్ 4 వరకు ఈ వార్షికోత్సవ మెగా సేల్ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని సెలెక్ట్ సీఎండీ వై గురు వెల్లడించారు. వార్షికోత్సవ ఆఫర్లలో భాగంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై ఉచిత బహుమతులతో పాటు సరికొత్త స్మార్ట్‌ఫోన్స్‌పై ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌కు కూడా ఈ ఆఫర్లను అందిస్తున్నట్లు గురు తెలిపారు. మొబైల్ కొనుగోలుపై స్మార్ట్ టీవీ, కూలర్, ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మెషిన్ లాంటి బహుమతులను ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్లపై 60 శాతం వరకు డిస్కౌంట్, ఎస్‌బీఐ కార్డ్‌పై 7.5 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్, బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.4,000 వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌ను వినియోగదారులకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక ఆఫర్లు అన్ని సెలెక్ట్ మొబైల్స్ స్టోర్లలో అందుబాటులో ఉంటాయని గురు తెలిపారు.

ఫీనిక్స్ నుంచి కార్యాలయ స్థలం కొనుగోలు : క్లింట్

హైదరాబాద్: ఫీనిక్స్ గ్రూప్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్మిస్తున్న 25 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు క్యాపిటాల్యాండ్ ఇండియా ట్రస్ట్ (క్లింట్) ప్రకటించింది. ఈ ప్రదేశాన్ని నిర్మాణం పూర్తయిన అనంతరం తాము కొనుగోలు చేయనున్నట్టు తెలిపింది. ఈ ఒప్పందం కింద ఫీనిక్స్ గ్రూప్ అధిక వడ్డీకి తీసుకున్న రుణం రీఫైనాన్స్ కోసం క్లింట్ రూ.215 కోట్లు అందిస్తుంది. ఆ తర్వాత కూడా భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ ముందస్తు కొనుగోలు హైదరాబాద్‌లో తమ స్థానాన్ని పటిష్ఠం చేస్తుందని క్యాపిటాల్యాండ్ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సంజీవ్ దాస్ గుప్తా తెలిపారు. కాగా అవాన్సే హైదరాబాద్, సైబర్‌పెరల్, ఇంటర్నేషనల్ టెక్ పార్క్ హైదరాబాద్ ఇప్పటికే క్లింట్ పోర్టుఫోలియోలో ఉన్నాయి.

యాపిల్ ఇండియా ఆదాయంలో కొత్త రికార్డు

భారత్‌లో యాపిల్ మార్చి త్రైమాసికాదాయంలో కొత్త రికార్డు నమోదు చేసింది. స్థూలంగా ఆదాయంలో 4% క్షీణత ఏర్పడినప్పటికీ భారత్‌లో బలమైన రెండంకెల వృద్ధిరేటును సాధించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ 908 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఇది 4% తక్కువ. త్రైమాసికంలో ఐఫోన్ అమ్మకాలు 10.4%తగ్గి 459 కోట్ల డాలర్లకే పరిమితం అయ్యాయి.



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	129	గోదావరి	137
వరంగల్	129	విజయవాడ	137
కరీంనగర్	129	గుంటూరు	137
మహబూబ్‌నగర్	129	ఒంగోలు	137
కర్నూలు	129	చిత్తూరు	132
విశాఖపట్నం	129		

అన్నీ అనుకున్నట్టు జరగవుగా!



ముంబై కెప్టెన్సీపై రోహిత్

ముంబై: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కి ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ తాజా సీజన్‌లో హార్దిక్ నేతృత్వంలో ఆడుతున్నాడు. అయితే జట్టు కెప్టెన్సీ మార్పు అభిమానులకు ఏమాత్రం రుచించని విషయం తెలిసిందే. అటు ఈ పరిణామంపై రోహిత్ తొలిసారి స్పందించాడు. 'ఇదంతా జీవితంలో భాగంగా అనుకోవాలి. అన్నీ మనం అనుకున్నట్టు జరగవు. గతంలో కూడా నేను చాలామంది కెప్టెన్ల ఆధ్వర్యంలో ఆడాను. ఇప్పుడు కొత్తగా వచ్చిన మార్పేమీ లేదు' అని రోహిత్ తేల్చాడు.

జ్యోతికి క్రీడాశాఖ చేయూత



న్యూఢిల్లీ: తెలుగు స్ప్రింటర్ యర్రాజి జ్యోతికి కేంద్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలోని ఎంఓసీ (మిషన్ ఒలింపిక్ సెల్) చేయూతనిచ్చింది. జ్యోతితో పాటు లాంగ్ జంపర్ శైలీ సింగ్, పలువురు షట్లర్లు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్లకు కూడా నిధులు మంజూరు చేసింది. శుక్రవారం జరిగిన మిషన్ ఒలింపిక్స్ సెల్ సమావేశంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే క్రమంలో పలు పోటీల్లో పాల్గొనాల్సిన జ్యోతి, శైలి పెట్టిన అర్జీలకు ఆమోదం లభించింది. జ్యోతి యూరప్‌లో ఆరు అంతర్జాతీయ పోటీల్లో తలపడాల్సి ఉంది. ఇందుకయ్యే ఖర్చులను భరించేందుకు ఎంఓసీ ముందుకొచ్చింది. ఇక, టార్గెట్ ఒలింపిక్స్ పోడియం (టాప్స్) స్కీమ్ కోర్ గ్రూప్‌లోకి కొత్తగా షట్లర్లు అశ్వినీ పొన్నప్ప, తనీషా, షూటర్ మహేశ్వరీ చౌహాన్, రోవర్ బాల్‌రాజ్ పన్వర్‌ను తీసుకున్నారు.

ఫైనల్స్‌లో మనోళ్లు ఏడుగురు

ఆసియా బాక్సింగ్

అస్తానా (కజకిస్థాన్): ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో ఏడుగురు భారత బాక్సర్లు ఫైనల్స్ చేరి సంచలనం సృష్టించారు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇప్పటివరకు 22 పతకాలు ఖాయమయ్యాయి. ఇందులో 12 పతకాలు మహిళా బాక్సర్లకు దక్కనున్నాయి. శుక్రవారం జరిగిన 48 కిలోల విభాగంలో బ్రిజేష్ 5-0తో తాలైబక్ ఇయాసూర్ (మంగోలియా)పై, 60 కి. కేటగిరీలో సాగర్, 75 కి. కేటగిరీలో రాహుల్, 92 కి. విభాగంలో ఆర్యన్ విజయం సాధించారు. వీరితో పాటు యశ్వర్ధన్ సింగ్ (63.5 కి.), ప్రియాన్షు (71 కి.), ఫైనల్స్‌లో ప్రవేశించారు. కాగా సుమిత్ (67 కి.), సాహిల్ (80 కి.) కాంస్య పతకాలు సాధించారు.

కోల్‌కతా కమాల్

ముంబై అవకాశాలు దాదాపు గల్లంతు

- అదరగొట్టిన బౌలర్లు
- పేసర్ స్టార్క్‌కు నాలుగు వికెట్లు
- రాణించిన వెంకటేశ్ అయ్యర్



స్టార్క్ (4/33)

వెంకటేశ్ అయ్యర్ (70)

ముంబై: ఒకటి కాదు.. రెండు కాదు.. 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వాంఖడే మైదానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయం రుచి చూసింది. ఓ దశలో 57/5 స్కోరుతో ఇబ్బంది పడినా, వెంకటేశ్ అయ్యర్ (52 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) కీలక ఇన్నింగ్స్‌తో కేకేఆర్ కోలుకుంది. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని కాపాడే క్రమంలో బౌలర్లు ఆరంభం నుంచే ముంబై బ్యాటర్లను కట్టడి చేశారు. పేసర్ స్టార్క్ (4/33) స్థాయికి తగ్గ బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 24 రన్స్‌తో నెగ్గిన కేకేఆర్ 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అటు ముంబైకిది వరుసగా నాలుగో ఓటమి. కేవలం 6 పాయింట్లతో ఉన్న ఈ జట్టు ఇక ముందుకెళ్లడం అసాధ్యమే. ముందుగా కోల్‌కతా 19.5 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. మనీశ్ పాండే (31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 42) సహకరించాడు. బుమ్రా, తుషారలకు మూడేసి వికెట్లు, హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.5 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటైంది. సూర్యకుమార్ (56) ఒక్కడే రాణించాడు. స్పిన్నర్లు నరైన్, వరుణ్.. పేసర్ రస్సెల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వెంకటేశ్ నిలిచాడు.

బౌలర్ల హవా: ఓ మాదిరి ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ కూడా తడబడుతూనే సాగింది. స్పిన్నర్లు నరైన్, వరుణ్‌ల ధాటికి పవర్‌ప్లేలోనే ఇషాన్ (13), నమన్ (11), రోహిత్ (11)ల వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత మధ్య ఓవర్లలో రస్సెల్.. ఆఖర్లో స్టార్క్ కీలక వికెట్లతో దెబ్బతీశారు. ఓవైపు సూర్యకుమార్ నిలిచినా.. మరో ఎండ్‌లో అతడికి సహకరించేవారు కరువయ్యారు. మధ్య ఓవర్లలో తిలక్ (4), నేహల్ వధేరా (6), హార్దిక్ (1)ల వికెట్లు కోల్పోవడంతో 71/6 స్కోరుతో ముంబై ఓటమి దిశగా పయనించింది. కానీ 14వ ఓవర్‌లో సూర్య చెలరేగి 4,6,4,4తో 20 రన్స్ సాధించడంతో పాటు 30 బంతుల్లో ఫిఫ్టీ కూడా పూర్తి చేశాడు. చివరి 30 బంతుల్లో 51 రన్స్ అవసరమైన వేళ మ్యాచ్ ముంబై వైపు తిరిగింది. కానీ 16వ ఓవర్‌లో సూర్యను రస్సెల్ అవుట్ చేయడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది. ఇక 19వ ఓవర్‌లో టిమ్ డేవిడ్ (24), చావ్లా (0), కొట్జీ (8)లను స్టార్క్ పెవిలియన్‌కు చేర్చి 7 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న వెంకటేశ్-మనీశ్ పాండే: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఆరంభం పేలవంగా ఉన్నా.. ఇన్నింగ్స్‌ను గౌరవప్రదంగానే ముగించింది. దీనికి వెంకటేశ్ అయ్యర్-మనీశ్ పాండే అందించిన భాగస్వామ్యమే కారణం. కానీ డెత్ ఓవర్లలో తిరిగి పుంజుకున్న ముంబై బౌలర్లు కేకేఆర్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. పేసర్ తుషార తొలి మూడు ఓవర్లలోనే మూడు వికెట్లు తీసి కేకేఆర్ వెన్నువిరిచాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సాల్ట్ (5)ను తొలి ఓవర్‌లోనే అవుట్ చేయగా.. తన మరో ఓవర్‌లో రఘువంశీ (13), కెప్టెన్ శ్రేయాస్ (6)ల పనిబట్టాడు. ఇంకో ఓపెనర్ నరైన్ (8)ను హార్దిక్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. రింకూ సింగ్ (9) కూడా నిరాశపరిచి చావ్లాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఈ దెబ్బకు 57/5 స్కోరుతో కేకేఆర్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో వెంకటేశ్, ఇంపాక్ట్ ప్లేయర్ మనీశ్ పాండే మధ్య ఓవర్లలో అండగా నిలిచారు. వికెట్ కాపాడుకునేందుకు ఆరంభంలో నెమ్మదిగానే ఆడినా.. పదో ఓవర్‌లో పాండే ఫోర్‌తో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. ఇక 12వ ఓవర్‌లో వెంకటేశ్ 4,6తో 15 రన్స్ అందించగా, స్కోరు కూడా వంద పరుగులు దాటింది. అటు బుమ్రా ఓవర్‌లో పాండే 4,6తో ఆకట్టుకున్నాడు. 36 బంతుల్లో వెంకటేశ్ హాఫ్‌సెంచరీ పూర్తయ్యింది. అంతా సజావుగా సాగుతున్న వేళ చివర్లో జట్టు ఒక్కసారిగా తడబడింది. 17వ ఓవర్‌లో హార్దిక్ 20 పరుగులిచ్చుకున్నా ముంబైకి కావాల్సిన బ్రేక్ ఇచ్చాడు. పాండే వికెట్ తీయడంతో ఆరో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో సమన్వయలోపంతో రస్సెల్ (7) రనౌట్ కావడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. తర్వాతి ఓవర్‌లోనే రమణ్‌దీప్ (2), స్టార్క్ (0)లను బుమ్రా పెవిలియన్‌కు చేర్చాడు. ఆఖరి ఓవర్‌లో వెంకటేశ్‌ను కూడా బుమ్రా బౌల్డ్ చేయడంతో మరో బంతి ఉండగానే కేకేఆర్ ఇన్నింగ్స్ ముగిసింది.

2 ఐపీఎల్‌లో 2 వేల రన్స్, 100+ వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా రస్సెల్. గతంలో జడేజా ఈ ఫీట్ సాధించాడు.

ఐపీఎల్‌లో ఎక్కువ వికెట్లు (184) తీసిన రెండో బౌలర్‌గా పీయూష్ చావ్లా. చాహల్ (200) ముందున్నాడు.

4 ఐపీఎల్ మ్యాచ్‌లో ఇరుజట్లు ఆలౌటవడం ఇది నాలుగోసారి.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	10	8	2	0	16	0.622
కోల్‌కతా	10	7	3	0	14	1.098
లఖ్‌నవూ	10	6	4	0	12	0.094
హైదరాబాద్	10	6	4	0	12	0.072
చెన్నై	10	5	5	0	10	0.627
ఢిల్లీ	11	5	6	0	10	-0.442
పంజాబ్	10	4	6	0	8	-0.062
గుజరాత్	10	4	6	0	8	-1.113
ముంబై	11	3	8	0	6	-0.356
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) తిలక్ (బి) తుషార 5, నరైన్ (బి) హార్దిక్ 8, రఘువంశీ (సి) సూర్యకుమార్ (బి) తుషార 13, శ్రేయాస్ (సి) డేవిడ్ (బి) తుషార 6, వెంకటేశ్ (బి) బుమ్రా 70, రింకూ (సి అండ్ బి) చావ్లా 9, మనీష్ పాండే (సి/సబ్) బ్రెవిస్ (బి) హార్దిక్ 42, రస్సెల్ (రనౌట్) 7, రమణ్‌దీప్ (సి) కొట్జీ (బి) బుమ్రా 2, స్టార్క్ (బి) బుమ్రా 0, వైభవ్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.5 ఓవర్లలో 169 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-7, 2-22, 3-28, 4-43, 5-57, 6-140, 7-153, 8-155, 9-155, 10-169; **బౌలింగ్:** తుషార 4-0-42-3, బుమ్రా 3.5-0-18-3, కొట్జీ 2-0-24-0, హార్దిక్ 4-0-44-2, నమన్ ధిర్ 3-0-25-0, పీయూష్ 3-0-15-1.

ముంబై: ఇషాన్ (బి) స్టార్క్ 13, రోహిత్ (సి) మనీష్ (బి) నరైన్ 11, నమన్ ధిర్ (బి) వరుణ్ 11, సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) రస్సెల్ 56, తిలక్ (సి) నరైన్ (బి) వరుణ్ 4, వధేరా (బి) నరైన్ 6, హార్దిక్ (సి) మనీష్ (బి) రస్సెల్ 1, టిమ్ డేవిడ్ (సి) శ్రేయాస్ (బి) స్టార్క్ 24, కొట్జీ (బి) స్టార్క్ 8, పీయూష్ (సి) నరైన్ (బి) స్టార్క్ 0, బుమ్రా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 18.5 ఓవర్లలో 145 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-16, 2-38, 3-46, 4-61, 5-70, 6-71, 7-120, 8-144, 9-144, 10-145; **బౌలింగ్:** వైభవ్ 3-0-35-0, స్టార్క్ 3.5-0-33-4, వరుణ్ చక్రవర్తి 4-0-22-2, నరైన్ 4-0-22-2, రస్సెల్ 4-0-30-2.

ఒకే వేదికలో ఆరు మ్యాచ్‌లు

భారత్-దక్షిణాఫ్రికా మహిళల సిరీస్

బెంగళూరు: దక్షిణాఫ్రికాతో భారత మహిళల జట్టు పూర్తిస్థాయి సిరీస్‌లో తలపడనుంది. జూన్, జూలై నెలల్లో జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్లు ఓ టెస్ట్, మూడేసి వన్డే, టీ20 మ్యాచ్‌లు ఆడతాయి. ఈ ఏడు మ్యాచ్‌ల్లో ఆరు బెంగళూరులోనే జరుగుతాయి. జూన్ 16 నుంచి జరిగే వన్డే సిరీస్‌కు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. అదే నెల 28 నుంచి చెన్నైలో టెస్ట్ మ్యాచ్ జరగనుంది. అనంతరం జూలై 5, 7, 9 తేదీల్లో బెంగళూరులోనే టీ20లు నిర్వహించనున్నారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — రాత్రి 7.30 గం. — వేదిక: బెంగళూరు

బెంగళూరు X గుజరాత్

భారత్ వెనక్కి ఆసీస్ ముందుకి..

టెస్టు ర్యాంకింగ్స్ — టీ20, వన్డేల్లో నెం.1 పదిలం

దుబాయ్: ఐసీసీ పురుషుల తాజా టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్, వన్డే, టీ20 ఫార్మాట్లలో తన అగ్రస్థానాన్ని మరోసారి నిలబెట్టుకోగా, టెస్టుల్లో మాత్రం భారత్‌ను వెనక్కినెట్టి, ఆస్ట్రేలియా టాప్ ర్యాంక్‌ను చేజిక్కించుకుంది. శుక్రవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత్ టీ20ల్లో 264 పాయింట్లతో, వన్డేలో 122 పాయింట్లతో టాప్‌లో నిలవగా, టెస్టుల్లో 120 పాయింట్లతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. టెస్టుల్లో ఆస్ట్రేలియా 124 పాయింట్లతో తిరిగి ప్రథమ స్థానానికి ఎగబాకగా, ఇంగ్లండ్ 105 పాయింట్లతో మూడో స్థానంలో నిలకడగా కొనసాగుతోంది. వన్డేలో భారత్ తర్వాత ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్, న్యూజిలాండ్ తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. టీ20లో భారత్ తర్వాతి స్థానంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ ఉన్నాయి.

పొవెల్‌కే పగ్గాలు

విండీస్ వరల్డ్‌కప్ జట్టు



పోర్టాఫ్ స్పెయిన్: టీ20 ప్రపంచ కప్‌కోసం ప్రకటించిన వెస్టిండీస్ జట్టులో పలువురు ఐపీఎల్ స్టార్లకు చోటు కల్పించారు. ప్రస్తుత కెప్టెన్ రోవ్‌మన్ పొవెల్‌కే సారథ్య బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో సంచలన పేసర్ షమార్ జోసెఫ్‌కు తొలిసారి టీ20 జట్టులో స్థానం దక్కింది. అల్జారి జోసెఫ్ వైస్-కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆండ్రీ రస్సెల్, రూథర్ ఫోర్డ్, నికోలస్ పూరన్, హెట్‌మయెర్, హోప్, రొమారియో షెఫర్డ్ తదితర స్టార్లు చోటు దక్కించుకున్నారు.

వరల్డ్‌కప్ మ్యాచ్ అఫీషియల్స్‌గా శ్రీనాథ్, నితిన్ మీనన్

దుబాయ్: వచ్చే నెల వెస్టిండీస్, యూఎస్ఏలో జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో మ్యాచ్ అఫీషియల్స్‌గా భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరిలో రెఫరీ జవగళ్ శ్రీనాథ్, అంపైర్లు నితిన్ మీనన్, జయరామ్ మదనగోపాల్ ఉన్నారు. ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొనే 26 మంది మ్యాచ్ అధికారుల జాబితాను ఐసీసీ శుక్రవారం వెల్లడించింది. ఇందులో ఆరుగురు రెఫరీలు, 20 మంది అంపైర్లున్నారు.

ప్రజ్వల్ బాధితురాలి కిడ్నాప్!

ఆమె కుమారుడి ఫిర్యాదుతో రేవణ్ణ, ప్రజ్వల్‌పై కిడ్నాప్ కేసు నమోదు

సిఐడీని ఆశ్రయించిన మరో బాధితురాలు

గన్‌తో బెదిరించి.. లైంగికదాడి చేసినట్లు ఫిర్యాదు

రేవణ్ణ భార్య భవానీకి సిట్ నోటీసులు

రేవణ్ణ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా 2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 4-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 35 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nalgonda | Nizamabad and Bengaluru | వరంగల్

రోహిత్ కేసులో నిందితులకు క్లీన్‌చిట్

అతడు దళితుడు కాదని పోలీసుల నివేదిక.. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదు

తన కులధ్రువీకరణ పత్రం సరైనది కాదని తెలిసిపోతుందని ఆత్మహత్య చేసుకొని ఉంటాడు

హైకోర్టుకు ఇచ్చిన క్లోజర్ రిపోర్టులో వెల్లడి.. భగ్గుమన్న విద్యార్థులు.. హెచ్‌సీయూలో నిరసన

నాటి వీసీ అప్పారావు, ఎన్.రామచంద్రరావు, ఏబీవీపీ నేతల పిటిషన్లపై ముగిసిన విచారణ

పోలీసుల నిర్ణయంతో విభేదించినవారు ట్రయల్ కోర్టులో సవాల్ చేసుకోవచ్చన్న జడ్జి

పునర్విచారణకు అనుమతి కోరుతూ త్వరలో కోర్టులో పిటిషన్ వేస్తాం: డీజీపీ రవి గుప్తా



రోహిత్ వేముల 12

గవర్నర్ లైంగికంగా వేధించారు!

బెంగాల్ గవర్నర్ బోస్‌పై రాజ్‌భవన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగిని ఫిర్యాదు

తీవ్రంగా ఖండిస్తూ రాజ్‌భవన్ ట్వీట్.. నాపై మరో కుట్రకూ తెరలేపారు

తదుపరి బుల్లెట్ల కోసం ఎదురుచూస్తున్నా.. దయచేసి కాల్చండి: గవర్నర్ బోస్

ఆర్థిక మంత్రి చంద్రిమ, పోలీసులకు రాజ్‌భవన్‌లోకి ప్రవేశంపై నిషేధం

ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్ 2

అమిత్ షా ఫేక్ వీడియో కేసులో నిందితులపై కఠిన చర్యలు వద్దు

ఢిల్లీ పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 12కు వాయిదా

నిందితులకు బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

మొఘల్‌పురా పీఎస్‌లో అమిత్‌షా సహా నలుగురిపై కేసు 12

పిల్లలతో ప్రచారంపై ఈసీకి కాంగ్రెస్‌నేత నిరంజన్ ఫిర్యాదుతో



జగిత్యాల జిల్లా రాజారాంపల్లి సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ; సభకు వచ్చిన జనం

సెమీస్‌లో బిల్లారంగాల్ని ఓడించాం.. ఫైనల్స్‌లో

మోదీ, షాలను ఓడిస్తాం

తెలంగాణ ఏర్పాటును ప్రధాని పార్లమెంటు సాక్షిగా అవమానించారు

ఇప్పుడు తెలంగాణలో ఓట్లు ఎలా అడుగుతారు?

గుజరాతీలే మనుషులా.. మనం కాదా?

గుజరాత్‌కు అనేక ప్రాజెక్టులు, భారీ నిధులు

తెలంగాణకు ఏవీ ఇవ్వరు.. పైగా రద్దు చేస్తారు

బీజేపీ నేతలు నోరు తెరిస్తే అబద్ధాలే

బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల రద్దుకు వేసినట్లే

బీజేపీతో బీఆర్ఎస్ మిలాఖత్.. రాజ్యాంగాన్ని

మార్చే విషయంలో వారిది ఒకటే విధానం

ట్విటర్ టిల్లూ కేటీఆర్ మోదీని ఎందుకు ప్రశ్నించరు

1, 2 సీట్లొస్తే మోదీకి అమ్ముదామని కేసీఆర్ యత్నం

మా ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉంటుంది

జగిత్యాల, సిరిసిల్ల కాంగ్రెస్ సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి

పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరులో జరిగిన సెమీఫైనల్స్‌లో బిల్లా, రంగాలను ఓడించామని.. ప్రస్తుతం జరుగుతున్న ఫైనల్స్‌లో మోదీ, అమిత్ షాలను ఓడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సెమీఫైనల్స్‌లో బీఆర్ఎస్‌ను బొంద పెట్టాం, లోక్‌సభ ఎన్నికల ఫైనల్స్‌లో బీజేపీని ఓడిద్దాం అంటూ కాంగ్రెస్ కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. బిల్లారంగాలంటే ఎవరో కాదు హరీశ్ రావు, కేటీఆర్ అని, బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి అని ఎద్దేవా చేశారు. మోదీ, అమిత్‌షాలను మనువాద సిద్ధాంతం ఆవహించిందని, దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తిందని హెచ్చరించారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల జిల్లా రాజారాంపల్లిలో, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలకు సీఎం హాజరై ప్రసంగించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో గుజరాత్ రాష్ట్రానికి బుల్లెట్ ట్రెయిన్ తీసుకువెళ్లారు. సబర్మతి రివర్ ఫ్రంట్ చేపట్టారు. గేట్ సిటీ నిర్మించారు. లక్షల కోట్ల నిధులను తరలించుకుపోయారు. తెలంగాణకు మాత్రం నిధులు

మిగతా 10వ పేజీలో...

ఎన్నో రాష్ట్రాలుండగా మధ్యప్రదేశ్‌కే ఎందుకు?

ఓటుకు నోటు కేసు బదిలీ పిటిషన్‌పై సుప్రీం ప్రశ్న

న్యాయవాదుల తీరుపై ధర్మాసనం అసహనం

క్షమాపణలు చెప్పిన లాయర్లు.. విచారణ జూలైకి

రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ

అమేఠీ బరిలో కిషోరీలాల్ శర్మ.. చివరి రోజున నామినేషన్

ఎన్నికలకు ముందే ఓటమిని కాంగ్రెస్ అంగీకరించింది: స్మృతి

పారిపో.. రాహుల్ పారిపో.. అమేఠీ నుంచి వయనాడ్‌కు..

అక్కడనుంచి రాయ్‌బరేలీకి.. కాంగ్రెస్ ఓటమికిదే నిదర్శనం

ఈసారి కాంగ్రెస్‌కు హాఫ్ సెంచరీ కూడా కష్టమే: మోదీ 2

గాడిద గుడ్డు పాలనే

తెలంగాణలో రేవంత్ సర్కారు చేస్తున్నది అదే.. ఎక్కడికెళ్లినా గాడిద గుడ్డుతో ప్రచారం

హామీల అమలుకు బదులు ప్రజలకు అదే ఇస్తున్నారు.. 5 నెలల్లోనే కాంగ్రెస్ మార్కు అవినీతి

రాష్ట్రంలో మార్పు అంటే ఇదేనా?: కిషన్ రెడ్డి.. రిజర్వేషన్లపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం: లక్ష్మణ్



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 'గాడిద గుడ్డు' పాలన సాగుతోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఇంతకు ముందు కేసీఆర్ హామీలిచ్చి మసిపూసి మారేడుకాయ చేసేవారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి హామీల అమలు బదులు గాడిదగుడ్డు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ ఎక్కడకు వెళ్లినా చెయ్యి గుర్తు బదులు గాడిద గుడ్డును తలపై పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్.. చెయ్యి గుర్తు నుంచి గాడిద గుడ్డు గుర్తుకు మారినట్లుందని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే కాంగ్రెస్ అవినీతి మార్కును

మిగతా 12వ పేజీలో...

బీఆర్ఎస్‌కు ఒక్కటీ రాదు



రాష్ట్రంలో బీజేపీకి 11-12 ఎంపీ స్థానాలు

రంజిత్‌రెడ్డి నాకు అసలు పోటీయే కాదు

అపరిమిత అధికారంతో కేసీఆర్ పిచ్చిపనులు

ఆయన చేసిన అప్పులను రేవంత్ తీరుస్తున్నారు

ఆగస్టు 15లోపు రుణమాఫీ.. గోడమీద 'రేపు' లాంటిదే

మేడిగడ్డ ప్రయోజనకరమైన ప్రాజెక్టేమీ కాదు

మూసీ సుందరీకరణకు అంత ఖర్చు అనవసరం 11

మోదీ ఇచ్చిన రూ.9 వేల కోట్లతోనే రాష్ట్రం నడుస్తోంది

రాజకీయాల్లో రేవంత్ నాకంటే ప్రొఫెషనల్

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బిగ్ డిబేట్‌లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

1 నకిలీ పత్రాలతో మోసం

23.78 కోట్ల జీఎస్టీ రిఫండ్!

జీఎస్టీ రిఫండ్‌లో అక్రమాలపై అసిస్టెంట్ కమిషనర్ ఫిర్యాదు

అధికారులకు లంచాలు ఇచ్చినట్లు ఉన్నతాధికారులకు నిందితుడి ఫిర్యాదు 12

దర్యాప్తుతో బయటపడ్డ ఇంటిదొంగల ప్రమేయం

అసిస్టెంట్ కమిషనర్‌తోపాటు మరో ముగ్గురు సీటీవోల అరెస్ట్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదు

మళ్లీ ఎలక్షన్ జరపాలి

హైకోర్టు ఆదేశం 10

ప్రత్యర్థి సంతకం ఫోర్జరీ చేసి పోటీ నుంచి తప్పించారని కేసు

అప్పీలుకు వీలుగా తీర్పు అమలు నాలుగు వారాల పాటు వాయిదా

సుప్రీంను ఆశ్రయించే యత్నాలు



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రోడ్ షోలో మాట్లాడుతున్న కేసీఆర్

తొండి చేసేటోళ్లే

ఒట్లు పెట్టుకుంటరు!

రుణమాఫీపై ఏ ఊరికి పోతే ఆ దేవుడిపై రేవంత్ ఒట్లు పెట్టుకోవడం ఏమిటి?

పనిచేసేటోళ్లు ఎవరైనా ఒట్లు పెడతారా?

1,32,000 మందికి మేం దళితబంధు నిధులు జమచేస్తే ఈ సర్కారు లాక్కుంది

సింగరేణి సంస్థను ఊడగొడతారు జాగ్రత్త

నా బస్సు యాత్రతో ప్రత్యర్థి నేతల్లో వణుకు

అందుకే కుమ్మక్కై నిలువరించేందుకు కుట్ర

కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే: కేసీఆర్

గోదావరిఖనిలో బీఆర్ఎస్ అధినేత రోడ్ షో

పెద్దపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడి మీద ఒట్టు పెడుతున్నారని.. పనిచేసేవారెవరైనా దేవుళ్ల మీద ఒట్లు పెడతారా? అని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తొండి చేసేటోళ్లే ఒట్లు పెట్టుకుంటారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కరెంటు కోతలు లేవని.. తాము గోదావరిని

మిగతా 12వ పేజీలో...

రేవంత్‌ను సిద్దిపేటకు నేనే ఆహ్వానిస్తా

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే సన్మానిస్తా

బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్‌ఫిక్సింగ్ 10

చెరో 8 ఎంపీ సీట్లు పంచుకున్నారు: హరీశ్

ఐటీఐఆర్ పునఃప్రారంభం

ఏపీలోని ఆ ఐదు గ్రామాలు రాష్ట్రంలోకి

విభజన హామీల అమలు 11

పారిశ్రామిక కారిడార్లు, విద్యా సంస్థల ఏర్పాటు.. మేడారం జాతరకు జాతీయహోదా

లోక్‌సభ ఎన్నికలకు 23 అంశాలతో తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో

రాష్ట్రాభివృద్ధికే ఈ మేనిఫెస్టో: శ్రీధర్‌బాబు






అబ్ కీ బార్?

దివ్యాంగులకు ప్రాతినిధ్యమేదీ?

న్యూఢిల్లీ, మే 3 :దేశంలో 2.68 కోట్ల మంది దివ్యాంగులున్నారు. కానీ వారికి లోక్‌సభలో ప్రాతినిధ్యమే లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో వారు 2.28% మంది ఉన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో దివ్యాంగులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వ్యవస్థ వైఫల్యమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది వారి హక్కులు, భాగస్వామ్యాన్ని నిరాకరించడమేనని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికలపై ఏ విధమైన ప్రభావమూ చూపలేని వర్గంగానే దివ్యాంగులను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అసమానతను సమాజం కల్పించిన వైకల్యంగా భావించాలని ప్రొఫెసర్ అనితా షై పేర్కొన్నారు.

గవర్నర్ లైంగికంగా వేధించారు!

- బెంగాల్ గవర్నర్‌పై రాజ్‌భవన్ ఉద్యోగిని ఫిర్యాదు
- నాపై మరో భయంకర కుట్ర: గవర్నర్ ఆనందబోస్



కోల్‌కతా, మే 3: తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనందబోస్ తీవ్రంగా స్పందించారు. "మీ తదుపరి గ్రెనేడ్, దాచిపెట్టిన బుల్లెట్ల గురించి ఎదురుచూస్తున్నా. దయచేసి కాల్చండి" అని ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. గవర్నర్ బోస్ తనను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని గురువారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగం విషయంలో ప్రయోజనాలు చేకూర్చుతానన్న నెపంతో గవర్నర్ తనను వేధించారని అందులో ఆరోపించారు. ఈ ఘటనపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. "సందేశ్‌ఖాలీలో మహిళా హక్కుల గురించి మాట్లాడిన వ్యక్తే ఇప్పుడు ఇలాంటి అవమానకరమైన చర్యకు పాల్పడ్డారు. గవర్నర్ పదవికి అప్రతిష్ఠ తెచ్చారు" అంటూ విమర్శలు గుప్పించింది. ప్రధాని మోదీ కోల్‌కతాలోని రాజ్‌భవన్ సందర్శనకు కొద్ది గంటల ముందు ఆమె గవర్నర్‌పై ఆరోపణలు చేయడం గమనార్హం. అయితే.. వీటిని తీవ్రంగా ఖండిస్తూ రాజ్‌భవన్ వెంటనే వరుస ట్వీట్లు చేసింది. ఈ అంశంపై శుక్రవారం గవర్నర్ బోస్ ఒక ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. "ప్రియమైన రాజ్‌భవన్ ఉద్యోగులారా.. రాజకీయ శక్తుల ప్రేరణతో నాపై చేస్తున్న నిరాధార ఆరోపణలను స్వాగతిస్తున్నా. ఇలాంటివి ఇంకా ఉంటాయన్న విషయం నాకర్థమైంది. కానీ, ఒక్కటి మాత్రం చెప్పదల్చుకున్నా. ఇలాంటి తెలివితక్కువ డ్రామాలు ఎన్ని చేసినా.. అవినీతిని, హింసను అరికట్టే విషయంలో నన్నెవరూ అడ్డుకోలేరు" అని బోస్ పేర్కొన్నారు. "నా దగ్గర ఓ ముఖ్యమైన సమాచారం ఉంది. రాజ్‌భవన్‌లో స్నేహితులు మరో భయంకరమైన కుట్రకు తెరలేపారు. దానికి ఎవరు బాధ్యులనేది కూడా నాకు తెలుసు" అని చెప్పారు. మరోవైపు బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్యకు కోల్‌కతా, డార్జిలింగ్, బారక్‌పోర్‌లలోని రాజ్‌భవన్ ప్రాంగణాల్లోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ రాజ్‌భవన్ ఆదేశాలు జారీచేసింది. మహిళా ఉద్యోగిని గవర్నర్‌పై లైంగిక వేధింపులపై ఆరోపణలు చేయడాన్ని మంత్రి విలేకరులతో ప్రస్తావించారు. దీంతో 'పరువునష్టం కలిగేలా, రాజ్యాంగ వ్యతిరేక మీడియా ప్రకటనలు చేశారు' అని పేర్కొంటూ ఆమెకు రాజ్‌భవన్‌లోకి అనుమతి నిరాకరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఆదేశాలతో అనధికారికంగా విచారణలు జరుపుతున్నందున పోలీసులకు కూడా రాజ్‌భవన్‌లోకి ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రజ్వల్‌పై ఫిర్యాదు చేసిన బాధితురాలి కిడ్నాప్!

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో కీలకమైన పనిమనిషి, పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ కిడ్నాప్‌కు గురయ్యారు. ఆమె కుమారుడు మైసూరు జిల్లా కేఆర్ నగర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రజ్వల్‌తోపాటు ఆయన తండ్రి, ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణపై గురువారం రాత్రి కిడ్నాప్ కేసు నమోదు చేశారు. తన తల్లి ఏప్రిల్ 29వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని బాధితురాలి కుమారుడు(20) పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015 నుంచి ఆరేళ్లపాటు హొళెనరసీపురలోని రేవణ్ణ ఇంట్లో తన తల్లి పనిచేశారని, మూడేళ్ల కిందట పని మానేసి వచ్చారని, ఇక్కడే కూలి పనులు చేసుకుంటున్నారని వివరించారు. ఏప్రిల్ 29వ తేదీ రాత్రి 9 గంటలకు రేవణ్ణ అనుచరుడు సతీశ్‌బాబణ్ణ తమ ఇంటికి వచ్చి 'మీ తల్లిపై కేసు నమోదైంది. రేవణ్ణ పిలుస్తున్నారు' అని చెప్పి ఆమెను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి తన తల్లి కనిపించడం లేదని వాపోయారు. మరోవైపు, ప్రజ్వల్ తల్లి భవాని రేవణ్ణకు సిట్ నోటీసులిచ్చింది. ఈ కేసులో రేవణ్ణ బెయిల్ పిటిషన్‌పై విచారణ శనివారానికి వాయిదా పడింది. కాగా, తాజాగా నమోదు చేసిన కిడ్నాప్ కేసు ఇంకా సిట్ దాకా చేరలేదు. ప్రజ్వల్‌పై శుక్రవారం మరో కేసు నమోదైంది. తనను గన్‌తో బెదిరించి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని 44 ఏళ్ల మహిళ సీఐడీ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజ్వల్‌పై మరో కేసు నమోదు చేశారు.

పేరు ఒకేలా ఉన్నంత మాత్రాన పోటీ చేయొద్దనలేం

న్యూఢిల్లీ, మే 3: రాజకీయ నాయకుడి పేరు కలిగి ఉన్నంత మాత్రాన ఎన్నికల్లో పోటీ చేయకూడదంటూ ఏ వ్యక్తినీ నిలువరించలేమని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పేరును ఆధారం చేసుకొని ఎన్నికల్లో పోటీ చేసే హక్కును దూరం చేయలేమని పేర్కొంది. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి పేరును పోలిన అభ్యర్థులు కేవలం నామమాత్రంగా పోటీలో ఉంటున్నారని ఇలాంటి వారిని నిలువరించాలని కోరుతూ సాబు స్టీఫెన్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఇది ఓటర్లలో గందరగోళం సృష్టించడానికి ప్రత్యర్థులు అవలంబించే పాత ట్రిక్ అని ఆరోపించారు. ఇలాంటి ఎత్తుగడల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, నామ మాత్ర అభ్యర్థులను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "ఎవరైనా తల్లిదండ్రులు పిల్లలకు రాజకీయ నాయకుని పేరు పెడితే ఆ పిల్లలకు ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉండదా?" అని ప్రశ్నించింది.

కార్గో ఓడలో బందీలను విడుదల చేసిన ఇరాన్

న్యూఢిల్లీ, మే 3: రివల్యూషనరీ గార్డ్స్ గత నెల 13న స్వాధీనం చేసుకున్న కార్గో షిప్‌లోని మొత్తం 25 మంది సిబ్బందిని విడుదల చేసినట్టు శుక్రవారం ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సిబ్బందిలో మొత్తం 17 మంది భారతీయులు ఉన్నారు. పోర్చుగీస్ జెండాతో వెళ్తున్న ఎంఎస్‌సీ ఏరిస్ కార్గోషిప్‌ను హర్మూజ్ జలసంధి వద్ద రివల్యూషనరీ గార్డులు అదుపులోకి తీసుకున్నారు. ఇది ఇజ్రాయెల్ నౌక అని, సముద్రయాన చట్టాలను ఉల్లంఘించిందని పేర్కొంటూ స్వాధీనం చేసుకున్నారు.

రాయ్‌బరేలీ నుంచి రాహుల్

అమేఠీ బరిలో స్థానిక సీనియర్ నేత, గాంధీ కుటుంబ విధేయుడు కిషోరీలాల్ శర్మ

- చివరి రోజున నామినేషన్ దాఖలు
- అమేఠీలో ఎన్నికలకు ముందే ఓటమిని కాంగ్రెస్ అంగీకరించింది
- కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ విమర్శ



రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): యూపీలోని రాయ్‌బరేలీ, అమేఠీ సీట్లపై కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు కాంగ్రెస్ పార్టీ తెరదించింది. రాయ్‌బరేలీ నుంచి ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని బరిలో దింపింది. అమేఠీ నుంచి అనూహ్యంగా గాంధీ కుటుంబానికి చెందిన వారిని కాకుండా, ఆ కుటుంబానికి విధేయుడిగా ఉన్న స్థానిక సీనియర్ నేత కిషోరీలాల్ శర్మను అభ్యర్థిగా ప్రకటించింది. నామినేషన్లకు శుక్రవారం చివరిరోజు కావటంతో రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన తల్లి సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా కూడా రాహుల్ వెంట ఉన్నారు. అంతకుముందు వేలాది మంది కార్యకర్తలు రాయ్‌బరేలీలో రాహుల్‌కు స్వాగతం పలికారు. అమేఠీలో కిషోరీలాల్ శర్మ నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రియాంకగాంధీ మాట్లాడుతూ.. శర్మను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ప్రచారం చేస్తానన్నారు. అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు మే 20న పోలింగ్ జరగనుంది.

ప్రియాంకను ఒప్పించేందుకు విఫల యత్నం

గత ఐదు ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి సోనియా గాంధీ విజయం సాధించారు. ఈసారి సోనియా రాజ్యసభకు వెళ్లటంతో ప్రియాంకా గాంధీని రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయించాలన్న డిమాండ్ కాంగ్రెస్ శ్రేణుల నుంచి వచ్చింది. కానీ, పోటీకి ప్రియాంక అంగీకరించలేదని సమాచారం. ప్రియాంకను ఒప్పించటానికి రాహుల్‌గాంధీ కూడా ప్రయత్నించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్‌తోపాటు రాయ్‌బరేలీలో కూడా గెలిస్తే వయనాడ్ స్థానాన్ని వదులుకోలేనని.. కాబట్టి, రాయ్‌బరేలీ నుంచి పోటీ చేయాలని రాహుల్ చెప్పినప్పటికీ ప్రియాంక అంగీకరించలేదని పేర్కొన్నాయి. యూపీ నుంచి గాంధీ కుటుంబ సభ్యుల్లో ఎవరూ పోటీ చేయకపోతే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని, అమేఠీ కంటే రాయ్‌బరేలీ సురక్షితమైనదని పార్టీ నేతలు భావించడంతో రాహుల్ అక్కడి నుంచి పోటీకి అంగీకరించినట్లు తెలిపాయి. రాహుల్ నామినేషన్ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ.. పార్టీ నాయకత్వం విస్తృతంగా చర్చించిన మీదటే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మోదీ అబద్ధాలను దీటుగా ఎదుర్కోవటానికి వీలుగా ప్రియాంక దేశవ్యాప్తంగా ప్రచారంలో నిమగ్నమయ్యారని, అందుకే ఆమెను రాయ్‌బరేలీలో బరిలో దింపి ఆ నియోజకవర్గానికే పరిమితం చేయలేదన్నారు. తర్వాత ఏదైనా ఉప ఎన్నికలో ప్రియాంక పోటీ చేసి పార్లమెంటుకు వెళ్తారని జైరాం తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయంపై అమేఠీ ఎంపీ, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ స్పందిస్తూ.. ఎన్నికలు జరగకముందే కాంగ్రెస్ పార్టీ అక్కడ ఓటమిని అంగీకరించినట్లని వ్యాఖ్యానించారు.

రాహుల్ ఆస్తులు రూ.20 కోట్లు

రాయ్‌బరేలీ నామినేషన్ పత్రాల్లో రాహుల్ తనకు రూ.20 కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు. వీటిలో రూ.9.5 కోట్లు చరాస్తులు కాగా, రూ.11 కోట్లు స్థిరాస్తులు. గత ఆర్థిక సంవత్సరంలో తన ఆదాయం రూ.1.02 కోట్లు అని తెలిపారు.

50 ఏళ్ల అనుబంధం

రాయ్‌బరేలీకి తొలుత ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్‌గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఆయన తదనంతరం 1967, 1971లలో ఇందిర పోటీ చేసి గెలిచారు. ఎమర్జెన్సీ తర్వాత 1977లో జరిగిన ఎన్నికల్లో రాజ్‌నారాయణ్ చేతిలో ఇందిర ఓడిపోయారు. మళ్లీ 1980లో జరిగిన ఎన్నికల్లో ఇందిర విజయం సాధించారు. 1996, 1998లో బీజేపీ నేత అశోక్ సింగ్ ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 1999 ఎన్నికల్లో గాంధీ కుటుంబ విధేయుడు కెప్టెన్ సతీష్ శర్మ గెలిచారు. సోనియా గాంధీ రాజకీయ రంగప్రవేశం తర్వాత 2004, 2006, 2009, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు. రాయబరేలీని కాంగ్రెస్ కంచుకోటగా పరిగణిస్తారు.



కిషోరీలాల్ శర్మ

అమేఠీలో 1998 తర్వాత తొలిసారిగా 'ఇతరులకు'

యూపీలోని అమేఠీని గాంధీ కుటుంబానికి పెట్టని కోటగా భావిస్తారు. 1980లో ఇందిర తనయుడు సంజయ్ గాంధీ, 1981, 1984, 1989, 1991 ఎన్నికల్లో మరో తనయుడు రాజీవ్ గాంధీ ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. రాజీవ్ మరణానంతరం 1991, 1996లలో జరిగిన ఎన్నికల్లో రాజీవ్ సన్నిహిత మిత్రుడు సతీష్‌శర్మ గెలుపొందారు. 1998 ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. 1999లో సోనియా గాంధీ ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004 నుంచి ఆమె రాయ్‌బరేలీకి మారగా, 2004, 2009, 2014 ఎన్నికల్లో రాహుల్ పోటీ చేసి విజయం సాధించారు. 2019లో రాహుల్‌పై బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ 55 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు.

రాహుల్ పారిపో..



కోల్‌కతా, మే 3 : కేరళలోని వయనాడ్ సీటు ఓడిపోతుండటంవల్లనే, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ యూపీలోని రాయ్‌బరేలీకి తరలిపోయారని ప్రధాని మోదీ అన్నారు. 'పారిపో రాహుల్ పారిపో...భయపడొద్దు' అంటూ ఎద్దేవాచేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లు కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా కష్టమేనని ఆయన వ్యాఖ్యానించారు. పశ్చిమబెంగాల్‌లోని బర్ధమాన్-దుర్గాపూర్, కృష్ణనగర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం బీజేపీ అభ్యర్థుల తరఫున మోదీ ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఆమేఠీలో 2019లో ఓటమి తర్వాత 'యువరాజు' వయనాడ్‌కు మారారు. ఈ ఎన్నికల్లో అక్కడ ఓడిపోతారని ఆయనకు తెలుసు. అలాగని అమేఠీలో పోటీచేసి గెలిచే ధైర్యం లేదు. అందువల్ల ఆయన రాయ్‌బరేలీకి తరలిపోయారు. కాంగ్రెస్ నాయకుల్లోని ఓటమి భయానికిదే నిదర్శనం" అని మోదీ విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలపై ఆయన విరుచుకుపడ్డారు. సీఎం మమతబెనర్జీ ఏలుబడిలో హిందువులు బెంగాల్‌లో రెండో తరగతి పౌరులుగా జీవించాల్సి వస్తోందని మోదీ ఆరోపించారు. అవినీతి పాలన, రాజకీయ బుజ్జగింపులతో ప్రజాస్వామ్యాన్ని తృణమూల్ సమాధి చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల నుంచి రిజర్వేషన్లను లాగేసుకుని 'జిహాద్ ఓటు బ్యాంకు'కు కట్టబెడుతుందని మరోసారి ధ్వజమెత్తారు. ఇండియా కూటమి 'ఓటు జిహాద్'కు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. కాగా, రాయ్‌బరేలీలో రాహుల్ అక్కడి బీజేపీ అభ్యర్థి చేతిలో భారీ తేడాతో ఓడిపోవడం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు.

కేజ్రీవాల్‌కు 'బెయిల్' పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ అంశాన్ని పరిశీలిస్తామని సుప్రీం కోర్టు తెలిపింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు విచారించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ దాఖలు చేసిన కేసు విచారణకు సమయం పట్టే అవకాశం ఉందని, కానీ ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పిటిషన్ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ధర్మాసనానికి స్పష్టం చేశారు. దీంతో.. ఇరువురి వాదనలు విన్న తర్వాత బెయిల్ ఇవ్వాలా? లేదా? అనేది ధర్మాసనం నిర్ణయిస్తుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఈ నెల 7న ఇరు వాదనలు వింటామని చెప్పారు.

సోరెన్‌కు హైకోర్టులో నిరాశ

రాంచీ, మే 3: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌కు శుక్రవారం హైకోర్టులో నిరాశ ఎదురయింది. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ తనపై పెట్టిన కేసును కొట్టివేయాలంటూ ఆయన చేసిన వినతిని తిరస్కరించింది. ఏడు గంటల పాటు విచారించిన అనంతరం ఈడీ ఆయనను జనవరి 31న అరెస్టు చేసింది. ఈ కేసును కొట్టివేయాలంటూ తాను చేసిన వినతిపై హైకోర్టు తీర్పు ఇవ్వడం లేదంటూ ఆయన గత నెలలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం గమనార్హం. తాజాగా హైకోర్టు నిర్ణయాన్ని వెలువరిస్తూ కేసు కొట్టివేతకు నిరాకరించింది.

'గృహ హింస' సెక్షన్లలో మార్పులు

శాసనవ్యవస్థకు సుప్రీం కోర్టు సూచన

న్యూఢిల్లీ, మే 3: భారత శిక్షా స్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 498 ఏ (గృహహింస) దుర్వినియోగం అవుతున్న తీరుపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసుల్లో యాంత్రికంగా వ్యవహరించవద్దని పోలీసులకు.. ఐపీసీ స్థానంలో కొత్తగా తీసుకొస్తున్న భారతీయ న్యాయసంహితలో గృహహింసకు సంబంధించిన సెక్షన్ 85, 86లో తగిన మార్పులు చేయాలని శాసనవ్యవస్థ (లెజిస్లేచర్)కు సూచించింది. అలాగే.. దృఢమైన దాంపత్య బంధానికి సహనమే పునాది అని, భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకోవాలని.. చిన్న చిన్న గిల్లికజ్జాలు వచ్చినా సర్దుకుపోవాలి తప్ప.. గోరంత విషయాలను కొండంతలుగా చేసి చూడొద్దని, కాపురాలను కూల్చుకోవద్దని సూచిస్తూ.. తమ ముందుకు వచ్చిన ఓ వరకట్న వేధింపుల కేసును కొట్టేసింది. హరియాణాకు చెందిన ఒక మహిళ.. తన భర్త తన పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్నట్టు పేర్కొంటూ, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై పోలీసులు గృహహింస సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై భర్త హైకోర్టును ఆశ్రయించాడు. తనపై దాఖలు చేసిన క్రిమినల్ కేసును కొట్టేయాల్సిందిగా అభ్యర్థించాడు. కానీ, పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. దీంతో అతడు సుప్రీంకు వెళ్లాడు. ఈ కేసులో భార్య తన భర్తపై చేసినవి బలహీనమైన ఆరోపణలని అర్థమవుతోందని.. తనపట్ల అతడి క్రూర ప్రవర్తనకు సంబంధించిన ఒక్క నిర్దిష్ట సంఘటనను కూడా ఆమె వెల్లడించలేదని పేర్కొంటూ.. భర్తపై ఆమె పెట్టిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

గోవాపై బీజేపీ, కాంగ్రెస్ ధీమా!

- ప్రధాని మోదీ కరిష్మాపైనే బీజేపీ ఆశలు
- ప్రభుత్వ వ్యతిరేకతే కూటమి ప్రచారాస్త్రం



పనాజీ, మే 3: మూడో విడతలో భాగంగా గోవాలోని రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఇక్కడ ప్రధాని మోదీ కరిష్మాతో గెలుపొందాలని బీజేపీ భావిస్తుండగా.. ఉపాధి కల్పన, అవినీతి రహిత పాలన అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ తన ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంది. ఉత్తర, దక్షిణ గోవా ఎంపీ స్థానాలకు ఈ నెల 7న ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తర గోవా నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఐదుసార్లు ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్.. కాంగ్రెస్ అభ్యర్థి రమాకాంత్ ఖలాప్‌తో పోటీపడుతున్నారు. ఇక దక్షిణ గోవాలో బీజేపీ మహిళా అభ్యర్థి, వ్యాపారవేత్త పల్లవి డెంపో, కాంగ్రెస్ అభ్యర్థి విరియాతో ఫెర్నాండెజ్‌తో తలపడనున్నారు. ఈ ఎన్నికలపై బీజేపీ గోవా అధికార ప్రతినిధి యతీశ్ నాయక్ మాట్లాడుతూ.. 'ప్రజలు స్థిరత్వం కోరుకుంటున్నారు. వారికి కిచిడీ (బహుళ పార్టీల) ప్రభుత్వం అక్కర్లేదు' అని అన్నారు. ప్రధాని మోదీ దేశానికి బలమైన నాయకత్వాన్ని అందించారని, ప్రపంచ నాయకుడిగా ఎదిగారని అన్నారు. బీజేపీ పాలనలో జనం అభివృద్ధిని చూశారని నాయక్ అన్నారు. గోవాలోని రెండు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకుంటుందని, దేశవ్యాప్తంగా 400 ఎంపీ స్థానాల మార్కుని దాటుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుత అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇండియా కూటమిలో భాగమైన గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) ప్రధాన కార్యదర్శి దుర్గాదాస్ కామత్ అన్నారు. 'రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది.. అలాగే మైనింగ్ సమస్యను పరిష్కరించడంలోనూ, గోవా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది' అని కామత్ విమర్శించారు. ఈ ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనూకలంగా మలచుకోవాల్సిన బాధ్యత ఇండియా కూటమిపై ఉందన్నారు. ఈ నెల 7న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కూటమి అభ్యర్థుల ప్రచారానికి విశేష స్పందన లభిస్తోందన్నారు.

ఆస్ట్రాజెనెకా, సీరమ్‌పై కేసు వేస్తాం

- టీకా మరణాలకు కారణమైనవారిపై న్యాయపోరాటం చేస్తాం
- కొవిషీల్డ్ టీకా కారణంగా కుమార్తెను కోల్పోయిన ఓ తండ్రి ఆవేదన



వేణుగోపాలన్, కారుణ్య(ఫైల్)

న్యూఢిల్లీ, మే 3: కొవిషీల్డ్ టీకా వేయించుకున్న కొంతకాలానికే తన కుమార్తెను పోగొట్టుకున్న ఓ తండ్రి.. ఆ టీకాతో దుష్ప్రభావాలున్నాయంటూ ఆస్ట్రాజెనెకా అంగీకరించిన నేపథ్యంలో ఆ కంపెనీపైన, సీరమ్ సంస్థపైన కోర్టులో కేసు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన పేరు వేణుగోపాలన్ గోవిందన్. ఆయన కుమార్తె కారుణ్య వేణుగోపాల్ డేటా సైన్స్ విద్యార్థి. 2021 జూన్‌లో ఆమె కొవిషీల్డ్ టీకా తీసుకుంది. టీకా తీసుకున్న ఎనిమిది రోజులకు ఆమె అనారోగ్యం బారిన పడింది. దాదాపు నెలరోజుల తర్వాత 2021 జూలైలో ఆమె మరణించింది. చనిపోయేనాటికి ఆమె వయసు కేవలం 20 ఏళ్లు. టీకా తీసుకోకముందు కారుణ్యకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని, పూర్తి ఆరోగ్యంతో ఉండేదని.. కేవలం వ్యాక్సిన్ కారణంగా ఆమెను కోల్పోయామని వేణుగోపాలన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమార్తె మరణించినప్పటి నుంచీ ఆయన టీకా దుష్ప్రభావాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అలాగే.. న్యాయపోరాటం కూడా చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన టీకా కార్యక్రమాల విభాగం కారుణ్య మరణంపై విచారణ జరిపి 2021 నవంబరులో ఒక నివేదిక ఇచ్చింది. దాంట్లో ఆమె కారుణ్య మరణాన్ని 'బీ1' కేటగిరీలో చేర్చింది. అంటే.. ఆమె మరణానికి టీకానే కారణమనడానికి తగిన ఆధారాలు లేవని అర్థం. దీంతో గోవిందన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తె మరణానికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. ఈ కేసు విచారణలో భాగంగా 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం.. కొవిడ్ టీకా కారణంగా సంభవించే మరణాలకు పరిహారం ఇచ్చే బాధ్యత తమది కాదని సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పింది.

అందరం కలిసి పోరాడతాం

తాజాగా.. ఈ టీకా దుష్ప్రభావాలపై ఆస్ట్రాజెనెకా ప్రకటన నేపథ్యంలో కారుణ్య తల్లిదండ్రులు మళ్లీ కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. దీనిపై గోవిందన్ 'ఎకనమిక్ టైమ్స్' వార్తాసంస్థకు ఒక వ్యాసం రాశారు. కొవిషీల్డ్ టీకాను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చిన రెండునెలల్లోపే.. అంటే, 2021 మార్చిలోనే యూరప్‌లోని 15 దేశాలు ఈ టీకా వల్ల కలిగే దుష్ప్రభావాలను గుర్తించి.. ప్రజలకు ఇవ్వడం నిలిపివేశాయని, అత్యవసరమైన సందర్భాల్లో నిర్దిష్ట వయసు ఉన్నవారికి మాత్రమే వేశాయని అందులో గుర్తుచేశారు. అప్పుడే ఆస్ట్రాజెనెకా, సీరమ్ సంస్థలు కొవిషీల్డ్ తయారీ, సరఫరాను నిలిపివేసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఎంతో మంది ప్రాణాలను కోల్పోయాక తీరిగ్గా ఇప్పుడు ఆస్ట్రాజెనెకా సంస్థ తమ టీకా దుష్ప్రభావాల గురించి ఒప్పుకోవడం వల్ల ఉపయోగం ఏముందని ఆవేదన వెలిబుచ్చారు. న్యాయం కోసం.. ప్రజారోగ్యం పేరిట ఇలాంటి దారుణాలు మళ్లీ చేయకుండా ఉండడం కోసం.. ఎంతోమంది మరణాలకు కారణమైనవారందరిపైనా తాజాగా కేసులు వేస్తామని హెచ్చరించారు. తమలాగానే ఈ టీకా కారణంగా పిల్లలను కోల్పోయిన కుటుంబాలు మరో ఏడు ఉన్నాయని.. తామందరం కలిసి ఈ పోరాటం సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. గోవిందన్ పేర్కొన్న ఎనిమిది మంది మృతుల్లో.. హైదరాబాద్‌కు చెందిన రితైకా శ్రీ ఓంత్రీ (18) అనే యువతి కూడా ఉంది. 2021 మే నెలలో ఆమె కొవిషీల్డ్ మొదటి డోసు తీసుకుంది. తర్వాత ఐదురోజులకు ఆమెకు తీవ్ర జ్వరం వచ్చింది. ఎమ్మారై స్కానింగ్ చేయించగా.. ఆమె మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు తేలింది. వైద్యులు ఆమెను కాపాడలేకపోయారు. 2021లో గోవిందన్‌తో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించినవారిలో రితైకా తల్లి రచనా గంగు కూడా ఉన్నారు.

ప్రాణం తీసిన 'నాటకం'

- రాక్షస పాత్రధారుడి గొంతు కోసిన కాళీమాత పాత్రధారి.. నిందితుడు 14 ఏళ్ల బాలుడు

కాన్పూర్, మే 3: ఓ నాటకంలో కాళీమాత పాత్రలో నటించిన ఓ బాలుడు(14), రాక్షసుడి పాత్రలో నటించిన మరో బాలుడి(11) గొంతును కత్తితో కోశాడు. దీంతో 11 ఏళ్ల బాలుడు ప్రాణాలను కోల్పోయాడు. ఈ విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. బంభియాన్‌పూర్ గ్రామానికి చెందిన సుభాశ్ సైనీ నివాసంలో బుధవారం 'భగవత్ కథ' నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో కొంతమంది పిల్లలు వివిధ పాత్రలను పోషించారు. ఈ క్రమంలోనే కాళీమాత పాత్రలో నటించిన బాలుడు, రాక్షస పాత్రలో నటించిన మరో బాలుడి మెడను కత్తితో కోశాడు. తీవ్ర గాయమైన సదరు బాలుణ్ని(11) స్థానిక ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. నిందితుడైన 14 ఏళ్ల బాలుణ్ని అదుపులోకి తీసుకున్నారు. అతణ్ని జువెనైల్ కోర్టులో హాజరు పరిచి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీసీపీ తెలిపారు. కాగా కాళీమాత వేషం వేసిన బాలుడు త్రిశూలంతో నటించాల్సి ఉండగా.. ఆ సమయంలో అది దొరక్కపోవడంతో పదునైన కత్తిని తీసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు.

వివాహిత ఇంటికి ప్రియుడి బాంబ్

ఆమె భర్త, కుమార్తె మృతి.. గుజరాత్‌లో ఘటన

వడాలి, మే 3: ఓ వివాహిత ఇంటికి ఆమె ప్రియుడు పార్శిల్ బాంబు పంపడంతో అది పేలి ఆమె భర్త, పెద్ద కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు కూతుళ్లు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దారుణ ఘటన గుజరాత్‌లోని వడాలిలో జరిగింది. వడాలికి చెందిన జీతూభాయ్(32) రోజువారీ కూలి. అతనికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతని భార్యకు జయంతి భాయ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో గురువారం ఓ ఆటో డ్రైవర్ జీతూభాయ్ ఇంటికి ఓ పార్శిల్ తీసుకొచ్చి ఇచ్చాడు. దాన్ని జీతూభాయ్ తెరిచి చూడగా అందులో ఓ టేప్ రికార్డర్ ఉంది. దాన్ని ఆన్ చేయగానే పేలడంతో జీతూభాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని ముగ్గురు కుమార్తెలకు గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా పెద్ద కుమార్తె భూమిక (12) దారిలోనే మృతి చెందిందని, మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. ఆటో డ్రైవర్ వాంగ్మూలం ఆధారంగా జయంతిభాయ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. ప్రమాద సమయంలో జీతూభాయ్ భార్య ఇంట్లో లేకపోవడంతో ఈ ఘటనలో ఆమె హస్తం ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ఆకాశంలో డేగ కన్ను..



తొలి స్వదేశీ బాంబర్ యూఏవీ ఆవిష్కరణ

బెంగళూరు: భారత్‌కు చెందిన రక్షణ, ఏరోస్పేస్ కంపెనీ ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ సంస్థ కీలక మైలురాయిని సాధించింది. భారత్‌లో తొలిసారిగా రూపొందించిన స్వదేశీ బాంబర్ మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్-200బీని బెంగళూరు వేదికగా శుక్రవారం ఆవిష్కరించింది. 'భారతదేశ డేగ కన్ను'గా భావిస్తున్న ఈ మానవ రహిత యుద్ధవిమానం 100 కిలోల పేలోడ్ సామర్థ్యం కలిగినది. ఇది ఆప్టికల్ సర్వేలెన్స్ పేలోడ్లతోపాటు వైమానిక ఆయుధాలను కూడా మోసుకెళ్లగలదని ఫ్లయింగ్ వెడ్జ్ డిఫెన్స్ సంస్థ తెలిపింది. ఈ యూఏవీ గరిష్ఠ వేగం గంటకు 370 కిలోమీటర్లు. ఒకసారి గాల్లోకి ఎగిరితే 12-20 గంటల వరకు ప్రయాణించగలదు.

లోకం తీరు



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




ABN ఆంధ్రజ్యోతి BIG DEBATE

బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి Click here

ఆంధ్రజ్యోతి

కూపన్ నింపండి లక్షలు గెలవండి


ఎవరు గెలిచినా మీదే గెలుపు

రాష్ట్ర స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : ....ఫోన్ నెం. ....

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

మొత్తం సీట్లు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పూర్తి వివరాల కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్నికలు - 2024



లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి Click here

ఎన్నికలు - 2024



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి Click here

ఆ చిరుత చిక్కె.. మరో చిరుతొచ్చె!


శంషాబాద్‌లో బోనులో చిక్కిన చిరుత

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 'ఆపరేషన్ చిరుత' సక్సెస్
- మేక కోసం బోనులోకి.. వారం రోజుల ఉత్కంఠకు తెర
- మెదక్ జిల్లా చేగుంట పరిసరాల్లో మరో చిరుత సంచారం

శంషాబాద్ రూరల్, హైదరాబాద్, చేగుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): గోడ దూకొచ్చి.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలోని పచ్చిక ప్రాంతంలో తచ్చాడుతూ ఏడురోజులుగా అటవీ శాఖ, జీఎంఆర్ అధికారులను కనుకులేకుండా చేసిన చిరుత బోనుకు చిక్కింది. ఏప్రిల్ 27న రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మునిసిపల్ పరిధిలోని గొల్లపల్లి మీదుగా ఓ చిరుత పులి వచ్చి ఎయిర్‌పోర్టు గోడదూకి లోపలికి వచ్చింది. ఆ మృగం రన్‌వే మీదకు వెళ్లగా సైరన్ మోగడంతో అప్రమత్తమైన జీఎంఆర్ అధికారులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ సిబ్బంది ఎయిర్‌పోర్టు పరిసరాల్లో మేక పిల్లలను ఎరగా ఓ ఐదు బోన్లు, 25 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం చిరుత.. మేక పిల్లను చూసి ఓ బోనులోకి వెళ్తునట్టే వెళ్లి పక్కకు వెళ్లిపోయింది. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున రన్‌వేకు 2కి.మీ దూరంలోని ఓ బోనుకు చిక్కింది. దానికి మత్తు మందు ఇచ్చిన సిబ్బంది నెహ్రూ జూపార్కుకు తరలించారు. దాన్ని నల్లమల అడవుల్లో విడిచిపెడతామని చెప్పారు. చిరుత వయసు మూడేళ్లు అని.. ఆరోగ్యంగా ఉందని చెప్పారు. కాగా, మెదక్ జిల్లా చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో మరో చిరుత సంచారం స్థానికులను కలవరపరుస్తోంది. అక్కడి సీసీ కెమెరాల్లో చిరుత సంచారాన్ని అటవీ సిబ్బంది గుర్తించినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి నాగరాణి వెల్లడించారు. ఇబ్రహీంపూర్ రుక్మాపూర్, పులిమామిడి, బోనాల, గోవిందాపూర్, రాంపూర్, కన్యరం, చిట్టోజిపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆస్తి కోసం అమానుషం

- గొలుసులతో కట్టేసి భర్త నిర్బంధం


నిర్బంధంలో ఉన్న నర్సింహ

ఘట్‌కేసర్ రూరల్, మే 3: ఆస్తి కోసం ఓ భర్తపై కట్టుకున్న భార్య, కన్న పిల్లలే అమానుషానికి పాల్పడ్డారు. గొలుసులతో కట్టేసి, తాళం వేసి, ఇంట్లో నిర్బంధించి దాడి చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘట్‌కేసర్ మునిసిపల్ పరిధిలోని బుడగజంగాల కాలనీకి చెందిన పత్తి నర్సింహ(50)కు భార్య భారతమ్మ, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సెంట్రింగ్ పని చేస్తూ రెండు ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఒక ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టి, భార్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేశాడు. మరో ప్లాట్‌ను అమ్మాలని ఇంట్లో వాళ్లు ఇబ్బందులు పెడుతుండటంతో ఇల్లు వదిలి పారిపోయాడు. మూడు రోజుల క్రితం భార్య, కుమారులు కలిసి ఆయన్ను పట్టుకొచ్చి, గొలుసులతో కట్టి, తాళం వేసి ఇంట్లో నిర్బంధించారు. తిండి, మలమూత్ర విసర్జనకు కూడా బయటకు తీసుకురాలేదు. వెంటనే ప్లాట్ అమ్మాలని దాడి చేస్తూ నరకయాతనకు గురిచేస్తున్నారు. స్థానికులు సమాచారం అందించగా అతడి ఇంటికి వెళ్లిన ఎస్‌ఐ శ్రీకాంత్.. నర్సింహను బంధించిన గది తెరవాలని భారతమ్మకు చెప్పడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగింది. చివరికి గది తాళం తీయగా నర్సింహను గొలుసులతో కట్టి, తాళం వేసి ఉండటాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. అతడు జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పి విలపించాడు. అనంతరం పోలీసులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

ఎస్‌బీఐకి రూ. 27 కోట్ల కుచ్చుటోపీ

- ప్రైవేటు ఫైనాన్షియర్లకు రూ. 60 కోట్ల టోకరా

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు, ప్రైవేటు ఫైనాన్షియర్ల నుంచి రూ. కోట్ల అప్పులు తీసుకుని పదేళ్లుగా పరారీలో ఉన్న దంపతుల్ని సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన ఆంజనేయులు, రీట దంపతులు ఆదర్శ్ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఆదర్శ్ మొబైల్స్) పేరుతో ఓ సంస్థను స్థాపించారు. పలు కమ్యూనికేషన్ పరికరాలు, సెల్‌ఫోన్లను దిగుమతి చేసుకుని విక్రయించేవారు. వ్యాపార అభివృద్ధికి బాలానగర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ. 27 కోట్ల రుణం తీసుకున్నారు. రుణం చెల్లించకపోవడం, దంపతులిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లడంతో బ్యాంకు అధికారులు బాలానగర్ పోలీసులకు 2013లో ఫిర్యాదు చేశారు. కేసు సీఐడీకి బదిలీ అయింది. సీఐడీ కేసు దర్యాప్తులో ఆంజనేయులు, రీట దంపతులపై హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 4, సైబరాబాద్‌లో మరో కేసు ఉన్నట్లు తేలింది. ప్రైవేటు ఫైనాన్సర్లు, పెట్టుబడిదారుల నుంచి సుమారు రూ. 60 కోట్లు మోసం చేసినట్లు తేలింది. సీఐడీ చీఫ్ షికాగోయల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పి. శ్రీధర్ నేతృత్వంలో బృందం రంగంలోకి దిగి బెంగళూరులో తలదాచుకున్న దంపతుల్ని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కోర్టులో నేరుగా హాజరు పరచండి

- రౌస్ అవెన్యూ కోర్టులో కవిత పిటిషన్

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రౌస్ అవెన్యూ కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. తనను విచారణకు వర్చువల్‌గా హాజరుపరచవద్దని, కోరులో నేరుగా హాజరు పరచాలని శుక్రవారం న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు ఆమె తరఫు న్యాయవాది మోహిత్ రావు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీతో కవిత జ్యుడీషియల్ కస్టడీ ముగియనుంది. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండు కేసుల్లోనూ బెయిల్ పిటిషన్లపై ఈ నెల 6న రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు వెల్లడించనుంది. అదే రోజు కవిత పిటిషన్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కవిత రిమాండ్ ముగిసిన ప్రతిసారి రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపరిచారు. గత నెల 23న మాత్రం తిహాడ్ జైలు నుంచి వర్చువల్‌గా హాజరుపరిచారు.

వ్యక్తి ప్రాణం తీసిన విద్యుద్దీప స్తంభం!

- చేయి తగిలి విద్యుదాఘాతంతో మృతి
- కృష్ణానగర్‌లో ఘటన



బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): విధి ఎంత కర్కశమైనదో కదా! ఇంటర్వ్యూకు హాజరైన మరుసటి రోజే సెలెక్ట్ అయ్యావంటూ సంస్థ నుంచి ఫోన్‌రావడంతో ఆ శుభవార్తను భార్యతో ఫోన్లో పంచుకున్న కొద్దిసేపటికే ఆ భర్తను విధి నిర్దాక్షిణ్యంగా కాటేసింది. రోడ్డు పక్కన విద్యుద్దీప స్తంభానికి ఆయన చేయి తగిలి విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. యూసుఫ్‌గూడలోని కృష్ణానగర్‌లో ఈ ఘటన జరిగింది. రెండేళ్ల క్రితం తాను మనసుపడి పెళ్లి చేసుకున్న భర్త ఇక లేడనే వార్తను ఆ భార్య జీర్ణించుకోలేక.. ఆస్పత్రి నుంచి పరుగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి "నా భర్త ఆస్పత్రిలో అచేతనంగా పడి ఉన్నాడు. డాక్టర్లతో ఆక్సిజన్ పెట్టించండి ప్లీజ్.. బతుకుతాడు"అంటూ ప్రాధేయపడటం పోలీసులను, అక్కడి వారిని గుండెలు పిండేసేలా చేసింది. మృతుడి పేరు తుమ్మ భావనా రుషి (35) హార్డ్‌వేర్ ఇంజనీర్. ఆయన స్వస్థలం పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామం. 2012లో హైదరాబాద్‌కొచ్చి ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న సుజాతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి ఈ దంపతులు వెంకటగిరిలో నివాసం ఉంటున్నారు. తాను పెద్ద కంపెనీలో చేరితే సొంతింటి కల నెరవేర్చుకోవచ్చుననే ఉద్దేశంతో రుషి పలు సంస్థల్లో దరఖాస్తు చేసుకుంటున్నాడు. ఈనెల 2న ఓ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరవగా, శుక్రవారం తాను సెలెక్ట్ అయినట్లు ఆయనకు తెలిసింది. భార్యకు ఈ విషయం చెప్పి.. కొత్తగా చేరనున్న కంపెనీలో కొన్ని పత్రాలు ఇచ్చేందుకు సర్టిఫికెట్లతో కృష్ణానగర్‌లోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా మెట్రో పిల్లర్ 1546 వద్ద రుషి చేయి ఓ విద్యుద్దీప స్తంభానికి తగిలి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఈ ఘటనకు బాధ్యులైన జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టరుపై 304 (ఏ) కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

నిప్పుల కొలిమి

రాష్ట్రంలో కొనసాగుతోన్న ఎండల తీవ్రత

- కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అత్యధికంగా 46.7 డిగ్రీలు
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అకాల వర్షం
- పిడుగుపాటుకు ఇద్దరి మరణం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


ఎండలు తగ్గాలంటూ ప్రార్థనలతో మిర్యాలగూడలో ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఎండ వేడిమికి తోడు, వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అత్యధికంగా 46.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. పెద్దపల్లి జిల్లా మంథని, జగిత్యాల జిల్లా నేరెళ్ల, ఖమ్మం జిల్లా పమ్మి, సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా హాజీపూర్, నల్లగొండ జిల్లా త్రిపురారంలో 46.6, కరీంనగర్ జిల్లా వీణవంకలో 46.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. వరంగల్ జిల్లాలో అత్యధికంగా 46.1, భద్రాచలంతోపాటు నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కిష్టంపల్లిలో 46.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సూరీడు 40 డిగ్రీల పైబడి నిప్పులు చెరిగాడు. ఇక, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ్‌పేట్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో శనివారం తీవ్రమైన వడగాడ్పులు వీచే ఆస్కారం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇక, ఎండల తీవ్రత తగ్గేందుకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ మిర్యాలగూడలోని క్రైస్తవులు పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. ఇక, పగలంతా ఎండలు మంటపెట్టగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీవర్షాల్లో పిడుగుపాటుకు గురై ఇద్దరు ప్రాణా లు కోల్పోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మం డలం పూసుగూడెం పంచాయతీ ఒడ్డు రామవరంలో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై రైతు బోడ శివారం(40), ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కందిమళ్లవారిబంజర్ గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు(32) చనిపోయారు.

'ఫ్రై'డే.. అట్టుడికిన ఏపీ

అమరావతి, విశాఖపట్నం, మే 3 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపానికి ఆంధ్రప్రదేశ్ అట్టుడికింది. ఈ వేసవిలోనే ఇప్పటి వరకు అత్యధికంగా శుక్రవారం నంద్యాల జిల్లా గోస్పాడు, బండి ఆత్మకూరులలో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 15 జిల్లాల్లో 44 డిగ్రీల కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా అర్ధవీడులో 47.3, కడప జిల్లా చిన్నచెప్పలిలో 47.2, నెల్లూరు జిల్లా వేపినాపి అక్కమాంబపురంలో 47.1, తిరుపతి జిల్లా పెద్ద కన్నాలిలో 46.9, కర్నూలు జిల్లా పంచలింగాలలో 46.8, చిత్తూరు జిల్లా తవణంపల్లె, పల్నాడు జిల్లా రావిపాడులో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రిజర్వాయర్లలో పడిపోతున్న నీటి మట్టాలు

న్యూఢిల్లీ, మే3: దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొందని.. ముఖ్యంగా దక్షిణాదిలోని జలాశయాల్లో నీటి మట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోతున్నాయని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పేర్కొంది. శుక్రవారం తాజా నివేదికను విడుదల చేసిన సీడబ్ల్యూసీ.. ఏపీ, తెలంగాణ సహా దక్షిణాది ప్రాంతం ఎక్కువ ప్రభావితమైనట్టు గుర్తించింది.

వడదెబ్బకు పది మంది మృత్యువాత

మండుతున్న ఎండలు, వడగాలుల వల్ల వడదెబ్బకు గురై రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పది మంది ప్రాణాలు కోల్పోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా అనంతరానికి చెందిన ఎల్లం నర్సిరెడ్డి(65), నల్లగొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన గుండ్లపల్లి వెంకన్న(55), వరంగల్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్(55), జనగామ జిల్లా తరిగొప్పలకు చెందిన దామెర సాయిలు(75) వడదెబ్బ వల్ల మరణించారు. అలాగే, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి గ్రామానికి చెందిన లింగంపల్లి మొగ్గవ్వ(59), పెద్దపల్లి జిల్లా జీలకుంట గ్రామానికి చెందిన గాండ్ల లింగయ్య(70), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహదేవపురానికి చెందిన పాయం లక్ష్మయ్య(65), అడవిరామవరానికి చెందిన సున్నం సమ్మక్క(50), ఇల్లెందుకు చెందిన కాటేపల్లి శ్రీనివాసరావు(49) కూడా వడదెబ్బ బారినపడి ప్రాణాలు కోల్పోయారు. అలాగే, ఖమ్మం నగరంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) వడదెబ్బకు ప్రాణాలకు కోల్పోయారు.

మిల్లర్‌పై పౌరసరఫరాల శాఖ కొరడా!

- రూ.6 కోట్ల విలువైన ధాన్యం, బియ్యం సీజ్
- స్థిరాస్తుల జప్తునకు అధికారుల చర్యలు
- సర్కారుకు రూ.14 కోట్లు బకాయిపడటంతో..

ములుగు, మే 3: ఓ బాయిల్డ్ రైస్‌మిల్లు యజమాని సర్కారుకు రూ.12 కోట్లు బకాయి పడ్డాడు.. నాలుగేళ్లుగా అదిగో ఇదిగో అంటూ దాటవేస్తున్నాడు. ఇక వడ్డీ రూ.2 కోట్లు కూడా కలుపుకొంటే మొత్తం రూ.14 కోట్లకు చేరింది. పలుమార్లు నోటీసులిచ్చి విసిగిపోయిన పౌర సరఫరాల శాఖ అధికారులు చివరకు అతడి స్థిరాస్తుల జప్తునకు ఉపక్రమించారు. ములుగు జిల్లా కేంద్రంలోని సాయిసహస్ర రైస్‌టెక్ బాయిల్డ్ మిల్లుకు 2019-20 సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన రూ.12 కోట్ల విలువైన ధాన్యాన్ని అప్పగించింది. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి సరఫరా చేయాల్సి ఉంది. కానీ, ఏళ్లు గడుస్తున్నా సదరు మిల్లు యజమాని బియ్యాన్ని ఇవ్వలేదు.. ఇటు ఆ మొత్తాన్ని కూడా చెల్లించలేదు. దీంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లా మేనేజర్ బానోతు రాంపతి ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం ఆ మిల్లులో తనిఖీలు జరిపారు. రూ.4.80 కోట్ల విలువైన ధాన్యం, రూ.కోటి 20 లక్షల విలువైన బియ్యాన్ని సీజ్ చేశారు. రూ.14 కోట్ల బకాయిలో ప్రస్తుతం రూ.6 కోట్ల విలువైన ధాన్యం, బియ్యం జప్తు కాగా.. మిగతా రూ.8 కోట్ల రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని రాంపతి తెలిపారు. మిల్లు యాజమాన్యానికి సంబంధించిన స్థిరాస్తులను జప్తు చేసేందుకు గాను రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి వివరాలను సేకరిస్తున్నామని వెల్లడించారు.

'కోడ్' ముగిశాక మెట్రో రెండో దశ డీపీఆర్

- ఈనెల 2 వరకు 54 కోట్ల మంది ప్రయాణాలు
- హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మెట్రో రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు ప్రారంభమైన 2017 నవంబర్ 28 నుంచి ఈనెల 2 వరకు 54 కోట్ల మంది ప్రయాణించారని, తద్వారా వివిధ వాహనాల్లో 14.05 కోట్ల లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను ఆదా చేశామని చెప్పారు. గత ఫిబ్రవరి 2 వరకు 50 కోట్ల మంది ప్రయాణికుల మైలురాయి చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఉత్సవాలు నిర్వహించారు. తరచుగా మెట్రోలో ప్రయాణించే వారికి ప్రోత్సాహకాలు అందించేందుకు ఆ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 'గ్రీన్ మైల్ రాయల్టీ క్లబ్'ను ఎన్వీఎస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అన్ని ప్రాంతాలను కలుపుతూ మెట్రోను నడపాలని సీఎం సూచించారని, ఆ మేరకు మెట్రోను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రెండో దశ డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పనులు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళి వరదరాజన్, మెట్రో, ఎల్ అండ్ టీ అధికారులు పాల్గొన్నారు.

వామనరావు దంపతుల హత్యపై సీబీఐ విచారణకు అభ్యంతరం లేదు

- సుప్రీంకోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం

న్యూఢిల్లీ, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణిల హత్య కేసుపై సీబీఐ విచారణ చేయడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. వామనరావు దంపతుల హత్యపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలంటూ గట్టు కిషన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సుందరేశ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును సీబీఐతో విచారణ జరిపించడం తమకు సమ్మతమేనని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. దాంతో ఈ కేసులో నిందితులను కూడా పార్టీలుగా చేర్చాలని ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది. మరికొన్ని పత్రాలు, సీడీలు కోర్టుకు సమర్పించడానికి పిటిషనర్‌కు అనుమతిచ్చింది. నిందితులంతా బెయిలుపై ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. నిందితుల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. సీబీఐ విచారణకు అభ్యంతరం లేదన్న తెలంగాణ ప్రభుత్వ వైఖరిని రికార్డుల్లోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్న ధర్మాసనం నిందితులకు నోటీసులకు జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కలవచర్లలో కారులో వెళ్తున్న లాయర్ వామనరావు, ఆయన సతీమణి నాగమణిలను కొందరు నడిరోడ్డుపై కిరాతకంగా హత్య చేశారు.

6 నుంచి డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ

- మూడు దశల్లో సీట్ల భర్తీ..
- జూలై 8 నుంచి తరగతులు
- 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల


దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న బుర్రా వెంకటేశం, చిత్రంలో లింబాద్రి తదితరులు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ సీట్ల భర్తీకి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్‌ను విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ వెంకటరమణ, వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. దోస్త్ షెడ్యూల్‌లో భాగంగా డిగ్రీ సీట్లను మూడు దశల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈనెల 6 నుంచి 25 వరకు తొలిదశ రిజిస్ట్రేషన్లను స్వీకరించనున్నారు. 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు.. జూన్ 3న తొలి దశ సీట్లను కేటాయించనున్నారు. అలాగే.. రెండోదశ సీట్లను జూన్ 18న కేటాయిస్తారు. మూడో దశ సీట్లను జూన్ 29న సీట్లను కేటాయించనున్నారు. ఇక జూలై 8వ తేదీ నుంచి డిగ్రీ తరగతులను ప్రారంభిస్తారు.

4 కొత్త కోర్సులు..

ఈ ఏడాది డిగ్రీలో నాలుగు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు లింబాద్రి తెలిపారు. ఇందు లో బీఏ స్పెషల్, బీకాం ఫైనాన్స్, బీఏ పబ్లిక్ పాలసీ అండ్ గవర్నెన్స్, బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ కోర్సులున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది దోస్త్ పరిధిలో మొత్తం 1,066 కాలేజీలున్నాయని, ఇందులో 4,49,449 సీట్లున్నాయని వివరించారు. కాగా, నిబంధనల కు విరుద్ధంగా వ్యవహరిస్తున్న 27 జూనియర్ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకున్నట్టు బుర్రా వెంకటేశం ప్రకటించారు. ఈ కాలేజీలపై రూ.లక్ష చొప్పున జరిమానా విధించినట్టు వెల్లడించారు.

దోస్త్ షెడ్యూల్ వివరాలు..

అంశం	తేదీ
తొలి దశ రిజిస్ట్రేషన్	06-05-2024 నుంచి 25వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	15-05-2024 నుంచి 27వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 3వ తేదీన
ఆన్‌లైన్ రిపోర్టింగ్	04-05-2024 నుంచి 10వరకు
రెండో దశ రిజిస్ట్రేషన్	04-06-2024 నుంచి 13వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	04-06-2024 నుంచి 14వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 18వ తేదీన
ఆన్‌లైన్ రిపోర్టింగ్	19-06-2024 నుంచి 24వరకు
మూడో దశ రిజిస్ట్రేషన్	19-06-2024 నుంచి 25వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	19-06-2024 నుంచి 26వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 29న
ఆన్‌లైన్ రిపోర్టింగ్	జూన్ 29 నుంచి జూలై 3 వరకు
తరగతుల ప్రారంభం	జూలై 7 నుంచి..

టెట్ పరీక్ష తేదీల ప్రకటన

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహణ తేదీలను విద్యాశాఖ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 27న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు ఇబ్బంది లేకుండా టెట్ పరీక్షల తేదీలను ఖరారు చేశారు. మే 20, 21, 22 తేదీల్లో పేపర్-2 గణితం, సైన్స్ పరీక్ష, మే 24, 28, 29 తేదీల్లో పేపర్-2 సాంఘిక శాస్త్రం పరీక్ష, మే 30, 31 తేదీల్లో పేపర్-1, జూన్ 1న పేపర్-2 గణితం, సైన్స్ (మైనర్ మీడి యం), జూన్ 2న పేపర్-1 పరీక్షలను నిర్వహించనున్నారు. కాగా, ఈనెల 20 నుంచి టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు అధికారులు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే.

విదేశాల్లో చదవాలనుకునే ఔత్సాహికుల కోసం

- ఈటీఎస్ టోఫెల్ ఇండియా చాంపియన్‌షిప్

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే భారతీయులకు తోడ్పడేందుకు ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) టోఫెల్ ఇండియా చాంపియన్‌షిప్‌ను ప్రారంభించింది. ఈ చాంపియన్‌షిప్ ద్వారా రూ. 15 లక్షల వరకూ నగదు బహుమతిని పొందవచ్చని ఈటీఎస్ పేర్కొంది. ఈ సందర్భంగా ఈటీఎస్ కంట్రీ మేనేజర్ ఇండియా సౌత్ ఆసియా, సచిన్ జైన్ మాట్లాడుతూ మొదటి రౌండ్‌లో 20 నిమిషాల క్విజ్ ఉంటుందని, రెండో రౌండ్‌లో పాల్గొనేవారు ఈ ఏడాది జూలై 31లోపు టోఫెల్ ఐబీటీ పరీక్షలో పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. డిగ్రీ ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థుల నుంచి ఉన్నత విద్యా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వారి వరకూ ఈ పోటీలో పాల్గొనవచ్చని చెప్పారు. టోఫెల్ ఇండియా చాంపియన్‌షిప్ కోసం నమోదు చేసుకునేందుకు https://www.etsindia.org/toeflindiachampionshipsocialని వెబ్‌సై

కనిష్ఠ వేతనం రూ.32వేలు ఉండాలి

రెండో పీఆర్సీ చైర్మన్‌కు టీజీవో సంఘం నివేదిక

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై పెట్టే ఖర్చును రెవెన్యూ వ్యయం పేరుతో అప్రాధాన్య ఖర్చుగా కాకుండా పెట్టుబడి వ్యయంగా పరిగణించాలి తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టీజీవో) సంఘం పేర్కొంది. ఉద్యోగుల కనిష్ఠ వేతనం రూ.32 వేలు, గరిష్ఠ వేతనం రూ.2,95,460 ఉండాలని, పే స్కేల్ నిర్ధారణకు ఆ పోస్టుకు సంబంధించిన కనీస వేతనం, 1-7-2023 నాటికి ఉన్న డీఏ, ఫిట్‌మెంట్‌ను కలిపి నిర్ధారించాలని సూచించింది. ఫిట్‌మెంట్ 40శాతం, వార్షిక ఇంక్రిమెంట్ రేటు 2.6-3 శాతం ఉండేలా చూడాలని కోరింది. ఈ మేరకు రెండో పీఆర్సీ చైర్మన్ ఎన్.శివశంకర్‌కు టీజీవో సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన నివేదికను శుక్రవారం అందించారు. కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి ఎ.సత్యానారాయణ తదితరులున్నారు.

వెబ్‌సైట్‌లో గ్రూపు-3 పోస్టుల రిజర్వేషన్ సమాచారం

గ్రూపు-3 పోస్టుల రిజర్వేషన్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారులు ప్రకటించారు. 1,388 గ్రూపు-3 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు దరఖాస్తుల ప్రక్రియ ముగియడంతో పాటు పరీక్షల తేదీలను కూడా ఇప్పటికే ప్రకటించారు. అయితే మహిళా రిజర్వేషన్ అమలు విషయంలో కోర్టు స్పష్టత ఇవ్వడంతో ఆ మేరకు పోస్టుల రిజర్వేషన్ల జాబితాను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు చెప్పారు.

6న ఈసెట్

ఈసెట్ పరీక్షను ఈనెల 6న నిర్వహించనున్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంటన్నర ముందుగానే పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈసెట్‌కు హైదరాబాద్‌లో 44, తెలంగాణ జిల్లాల్లో 48, ఏపీలో 7పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 24,272 మంది ఈ పరీక్ష రాయనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆరని అగ్ని!

మణిపూర్‌లో హింస చెలరేగి మే 3వ తేదీకి ఏడాది అయింది. సుదీర్ఘ కాలం సాగిన ఆ హింస కారణంగా అధికారిక లెక్కల ప్రకారం 227మంది మరణించారు, డెబ్బయ్‌వేలకుపైగా నిరాశ్రయులైనారు. మీతీలకూ, కుకీ–జో తెగలకు మధ్య రేగిన ఆ చిచ్చు ఇప్పటికీ రాష్ట్రాన్ని వదలకుండా ఉన్నది. ఎడతెరిపిలేని ఘర్షణలతో ఆయా తెగలవారు ప్రశాంతంగా ఉండగలిగే పరిస్థితులు పూర్తిగా మాయమైనాయి. వారంక్రితం కూడా రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఈ ఏడాది కాలంలో ప్రధానంగా వచ్చినమార్పు ఒకటే. మీతీల ఆధిపత్యం ఉన్న ఇంఫాల్ లోయలో కుకీ–జో తెగకు చెందిన ఒక్కరు కూడా ఉండటం లేదు. అలాగే, కుకీ–జో ఆధిపత్యం ఉన్న కొండప్రాంతాల్లో ఒక్క మీతీకూడా మిగల్లేదు. ప్రజల మధ్య అపనమ్మకాలు, అనుమానాలు తప్ప పలకరింపులు కూడా మాయమైపోయాయి. విభజన రేఖలు గీయడంలో రాష్ట్ర పాలకులు విజయం సాధించారు.

ఒక భయానక ఘటన జరిగింది కనుక మే 3, 2023చరిత్రపుటల్లోకి ఎక్కింది కానీ, మణిపూర్ హింసకు పునాదులు అంతకుముందే పడ్డాయి. అప్పటికే బీరేన్‌సింగ్ ప్రభుత్వం మీద కుకీ–జో తెగల్లో అవిశ్వాసం తీవ్రస్థాయిలో ఉంది. ఆ తెగలవారు మాదకద్రవ్యాల అక్రమరవాణాకు కారణమని, నల్లమందు, గసగసాలు ఇత్యాది పంటలు పండిస్తున్నారని, అత్యధికులు అక్రమంగా వలసవచ్చినవారే తప్ప స్థానికులు కారని ఏవేవో వాదనలతో బీరేన్‌సింగ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది, వేట ఆరంభించింది. వారు తరతరాలుగా సేద్యం చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకొని, గ్రామాలను ఖాళీచేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఈ తెగల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. భూములు కోల్పోతామన్న భయంలో ఈ తెగలున్న తరుణంలోనే, మీతీలను ఎస్టీలుగా గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని అక్కడి హైకోర్టు ఆదేశించింది. ఏకపక్షం, చట్టవ్యతిరేకం, పరిధుల అతిక్రమణ, అనవసరపు చొరవ ఇత్యాది తీవ్రపదజాలంతో సుప్రీంకోర్టు అనంతరకాలంలో ఈ ఆదేశాలను తీవ్రంగా తప్పుబట్టి, పక్కనబెట్టిన మాట అటుంచితే, మీతీలకు ఎస్టీ హోదా అన్న హైకోర్టు మాటలు పాతగాయాలను రేపి, ఆరనిమంటలు సృష్టించాయి. కొండప్రాంతాలకు చెందిన నాగా, కుకీ–జోల కంటే ఇంఫాల్‌లోయలో ఉండే మీతీలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెంది రాజకీయంగానూ ఆధిపత్య స్థానంలో ఉన్నారు. ఎక్కువమంది మంత్రులు, ముఖ్యమంత్రులు, చివరకు బీరేన్‌సింగ్ కూడా మీతీయే. కోర్టు ఆదేశాల వెనుక బీరేన్ కుట్ర ఉన్నదని, మీతీలకు ఆదివాసీ హోదా దక్కితే తమ భూములు వారి వశమైపోతాయని ఆదివాసులు భయపడ్డారు. కొండప్రాంతాల్లోని భూములకు రాజ్యాంగపరమైన ప్రత్యేక రక్షణలు ఉన్నందున, వాటిని వశం చేసుకోవడానికే ఆదివాసీయేతరులైన మీతీలు ఆదివాసీలుగా మారుతున్నారని ఈ తెగలు విశ్వసించాయి. మే 3న గిరిజన తెగలన్నీ కలసికట్టుగా అతిపెద్ద నిరసన సభ నిర్వహించడం, అది ముగియగానే మీతీలకూ, ఆదివాసీ తెగలకు మధ్య ఘర్షణలు రేగి, హింసాత్మక ఘటనలకు దారితీయడం తెలిసినవే.

హింసను అదుపుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని మొదట్లో అనుకున్నప్పటికీ, బీరేన్‌సింగ్ ప్రభుత్వం హింసను ప్రోత్సహించిందని ఆ తరువాత చాలా నివేదికలు ఆరోపించాయి. మీతీ యువకులకు పోలీసులే అండదండలు అందించారని, ఆయుధాగారాలు దోచుకొనేందుకు అనుమతించారని విమర్శలువచ్చాయి. రెండునెలలపాటు రాష్ట్రం తగలబడుతున్నా, తప్పుడు సమాచారంతో, వాదనలతో పాలకులు కాలాన్ని నెట్టుకుంటూ వచ్చారు, ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోగా నోరువిప్పకూడదని కూడా నిర్ణయించుకున్నారు. కానీ, మీతీయువకులు కొందరు ఇద్దరు కుకీమహిళలను నగ్నంగా ఊరేగించి, అనంతరం అత్యాచారం చేసిన ఘటనలకు సంబంధించిన వీడియో ఒకటి జులైలో బయటకు వచ్చి దేశాన్ని కుదిపేయడంతో, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని సంఘటనలతో కలిపి ప్రధాని ఈ దారుణాన్ని మాటమాత్రంగా ప్రస్తావించి వదిలేశారు. ఇంతజరిగినా బీజేపీ పెద్దలు ముఖ్యమంత్రిని మార్చకపోవడం విశేషం. సరైన సమయంలో, సరైన చర్యలతో తమ ప్రభుత్వం హింసను చక్కగా అదుపుచేసిందని ఇటీవలి ఎన్నికల ప్రచారం సందర్భంగా నరేంద్రమోదీ ప్రకటించారు. గత పక్షంరోజుల్లోనే కనీసం నాలుగు హింసాత్మక ఘటనలు జరిగిన విషయాన్ని అటుంచితే, మానసికంగా ఎప్పుడో విడిపోయిన మణిపూర్ ఇప్పుడు స్వయం పాలిత ప్రాంతాల డిమాండ్‌తో చీలిపోవడానికి సిద్ధంగా ఉంది.

బీజేపీ అబద్ధాలు... కాంగ్రెస్ సత్యాలు

గత ఐదేళ్ల నుంచీ రూపకల్పనలో ఉన్న ఉత్కృష్ట సంకల్ప పత్రమే 2024 లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ గాంధీ చరిత్రాత్మక పాదయాత్ర నిర్వహించారు. యాత్ర పొడుగునా ప్రజల చింతలు, కలతలు, ఆందోళనలను ఆయన తెలుసుకున్నారు. ప్రజలు ఎటువంటి పరిస్థితులలో నివసిస్తున్నారో ఆయన ప్రత్యక్షంగా చూశారు. వివిధ సమస్యలపై వారితో సంభాషించారు. సామాన్యుల ఆకాంక్షలు ఏమిటో తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌పూర్‌లో సమావేశమై దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటికి సంభావ్య పరిష్కారాల గురించి మూడు రోజుల పాటు విపులంగా సమాలోచనలు చేశారు. రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ వివిధ అంశాలపై అనుసరించవలసిన విధానాలను ఆమోదించింది. అవి సమగ్రమైనవి, విశ్వసనీయమైనవి. రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో బీజేపీని దీటుగా ఎదుర్కొనే లక్ష్యంతో ఆ విధానాలను రూపొందించారు. 'నవ్ సంకల్ప్ ఎకనామిక్ పాలసీ'ని ఉదయ్‌పూర్ సమావేశంలో రూపొందించగా రాయ్‌పూర్‌లో దానిని విస్తృతంగా చర్చించి ఆమోదించారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'ను ఏప్రిల్ 5న విడుదల చేశారు. 46 పేజీల ఆ మేనిఫెస్టోను 'జస్టిస్' (న్యాయం) అనే భావన ప్రాతిపదికన రూపొందించారు. దండలో దారం ఆ భావన, న్యాయ్ పత్రలోని అన్ని అంశాలకు ప్రాతిపదికగా ఉన్నది. దేశంలోని అత్యధిక ప్రజలకు నిరాకరిస్తున్న 'న్యాయ్'ను అందరికీ సమకూర్చేందుకు కాంగ్రెస్ సంకల్పించింది. 'జస్టిస్' అనే భావనలో సోషల్ జస్టిస్, జస్టిస్ ఫర్ యూత్, జస్టిస్ ఫర్ ఉమెన్, జస్టిస్ ఫర్ ఫార్మర్స్, జస్టిస్ ఫర్ వర్కర్స్ అనే భావాలన్నీ మిళితమై ఉన్నాయి. కోట్లాది ప్రజలు ఇప్పటికీ వివక్షకు గురవుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ (శీఘ్రం లేదా మందకొడి) అభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశాన్ని కోట్లాది ప్రజలకు ఇప్పటికీ నిరాకరిస్తున్నారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు అనేవి మాటలుగానే మిగిలిపోయాయి. 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అనే మాటల వెనుక ఉన్న కపటత్వాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టో ఎండగట్టింది. దేశ పాలకులు వల్లిస్తున్న ఆదర్శాలు డొల్లమాటలు మాత్రమేనని స్పష్టం చేసింది ప్రత్యామ్నాయ అభివృద్ధి దార్శనికతను ప్రజలకు నివేదించింది. కనుకనే కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 సార్వత్రిక ఎన్నికల హీరో అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రస్తుతించారు.

నరేంద్ర మోదీ, బీజేపీ తొలుత కాంగ్రెస్ మేనిఫెస్టోను నిర్లక్ష్యం చేయాలని నిర్ణయించుకున్నారు. మీడియా సైతం 'న్యాయ్ పత్ర'ను పూర్తిగా ఉపేక్షించింది. అయితే దేశ భాషలలోకి కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను అనువదించి రాష్ట్రాలలోని అభ్యర్థులు, ప్రచారకర్తలకు అందుబాటులో ఉంచడం జరిగింది. ఫలితంగా 'న్యాయ్ పత్ర' మారుమూల గ్రామాలలోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అందులోని అంశాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ హామీలను వారు విశ్వసించారు. కాంగ్రెస్ సందేశం అందరికీ చేరింది. దేశవ్యాప్తంగా ప్రజల మాటా మంతీ, పిచ్చా పాటీలో కాంగ్రెస్ న్యాయ్ పత్ర ఒక ప్రధాన భాగమయింది. విద్యాధికులతో పాటు నిరక్షరాస్యులు కూడా న్యాయ్ పత్రలోని అంశాలను చర్చించుకోసాగారు.

ఏప్రిల్ 5 తరువాత తొమ్మిది రోజులకు బీజేపీ తన ఎన్నికల ప్రణాళికను విడుదల చేసింది. ఎవరూ దానిని పట్టించుకోనేలేదు. 'మోదీకి గ్యారంటీ' పేరుతో ఉన్న ఆ మేనిఫెస్టోలోని గుణ విశేషాలను నరేంద్ర మోదీ సైతం మెచ్చుకోలేదు. ఏప్రిల్ 19న 102 నియోజకవర్గాలలో మొదటి దశ పోలింగ్ జరిగింది. గూఢచార నివేదికలు బీజేపీకి చేదు సత్యాలను నివేదించాయి. కాంగ్రెస్‌కు దాని మిత్రపక్షాలకు ఓటు వేసినవారు 'న్యాయ్ పత్ర'లోని హామీలకు వేశారన్న విషయం బీజేపీకి స్పష్టమయింది. కర్ణాటక, తెలంగాణలలో 'గ్యారంటీ'లకు ఓటు వేసినట్టుగానే లోక్‌సభ ఎన్నికలలో 'న్యాయ్ పత్ర'లోని హామీను విశ్వసించి కాంగ్రెస్‌కు, 'ఇండియా' కూటమికి ఓటు వేశారని స్పష్టమయింది. ఈ సత్యం నరేంద్ర మోదీకి కోపం తెప్పించింది. చిరాకు కలిగించింది. ఏప్రిల్ 21నే ఆయన ప్రచార సరళి మారిపోయింది. కొత్త ప్రచార సరళిపై భారతీయ జనతా పార్టీ తన నాయకులకు, కార్యకర్తలకు చేసిన నిర్దేశాలను చూసి నాజీ నాయకుడు గోబెల్స్ సైతం గర్వించి ఉండేవాడు ప్రచారమంతా అబద్ధాలు, మరిన్ని అబద్ధాలు, ఇంకా అబద్ధాలతో నిండిపోవాలని బీజేపీ నాయకులకు నిర్దేశించారు. సత్యం అబద్ధాన్ని ఖండిస్తే ఆ సత్యాన్ని పూర్తిగా ఉపేక్షించాలి.

గత 14 రోజులుగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ చెప్తున్న అబద్ధాలు ఏమిటో చూడండి :

అబద్ధం: కాంగ్రెస్ మేనిఫెస్టో అంతటా ముస్లిం లీగ్ ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. సత్యమేమిటి? '46 పేజీల కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఎక్కడా 'ముస్లిం' అనే పదం లేనే లేదు. మైనారిటీలను భాషాపరమైన, మతపరమైన మైనారిటీలుగా కాంగ్రెస్ మేనిఫెస్టో నిర్వచించింది. భాషాపరమైన, మతపరమైన మైనారిటీలకు మానవ హక్కులు, పౌర హక్కులను భారత రాజ్యాంగం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ ఆ హక్కులు పూర్తిగా సమర్థిస్తోంది మైనారిటీలకు ఆ హక్కులు సంపూర్ణంగా దక్కేందుకు కాంగ్రెస్ హామీ పడుతోంది'. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సంబంధించి అనేక ప్రస్తావనలు ఉన్నాయి. ఏ మత సమూహానికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేదు.

అబద్ధం: కాంగ్రెస్ అధికారానికి వస్తే షరియా చట్టాన్ని మళ్లీ తీసుకువస్తుంది. సత్యమేమిటి? కాంగ్రెస్ మేనిఫెస్టో ఇలా పేర్కొంది. 'మత చట్టాలను సంస్కరించడాన్ని మేము ప్రోత్సహిస్తాం. అటువంటి సంస్కరణలను, సంబంధిత మత సమూహపు సంపూర్ణ అంగీకారం, క్రియాశీల భాగస్వామ్యంతో మాత్రమే తీసుకురావాలి'.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పారు; కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'లోని సత్యాలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలు కావడానికి దోహదం చేశారు; ఈ వాద ప్రతివాదాలలో బీజేపీ మేనిఫెస్టో 'మోదీకి గ్యారంటీ'ని ప్రస్తావించనే లేదు... తద్వారా కాంగ్రెస్ మేనిఫెస్టోపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రశంసాపూర్వక వ్యాఖ్యను మోదీ సమర్థించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 లోక్‌సభ ఎన్నికల నిజమైన హీరో అని నరేంద్ర మోదీ ఒప్పుకున్నారు.

అబద్ధం: కాంగ్రెస్ మేనిఫెస్టో మార్క్సిస్ట్, మావోయిస్ట్ ఆర్థిక సిద్ధాంతాలను సమర్థిస్తుంది. సత్యమేమిటి? పది పేజీల 'ఆర్థిక వ్యవస్థ' భాగానికి రాసిన పరిచయంలో కాంగ్రెస్ ఇలా పేర్కొంది : 'కాంగ్రెస్ ఆర్థిక విధానం దేశ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యాన్ని ఇస్తోంది. 1991లో సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టి, శీఘ్రగతిన ఆర్థిక పురోగతికి కాంగ్రెస్ విశేషంగా దోహదం చేసింది. ఆ విధానాల కారణంగానే ఇతోధికంగా సంపద సృష్టి జరిగింది. మధ్యతరగతి వర్గం అభివృద్ధి చెందింది. లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టి జరిగింది, విద్యారంగం, ఆరోగ్య, భద్రత రంగాలలో పెను మార్పులు సంభవించాయి. ఎగుమతులు బాగా పెరిగాయి. కోట్లాది ప్రజలు పేదరికం నుంచి విముక్తమయ్యారు స్వేచ్ఛా విపణి వ్యవస్థకు మేము కట్టుబడి ఉన్నాము. ప్రైవేట్ రంగం ఆర్థికాభివృద్ధికి చోదక శక్తిగా ఉంటుంది. ప్రైవేట్ రంగానికి సంపూరకంగా ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధిపరుస్తాము'.

అబద్ధం: కాంగ్రెస్ అధికారానికి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు స్వస్తి చెబుతుంది. సత్యమేమిటి? కాంగ్రెస్ మేనిఫెస్టో ఇలా పేర్కొంది: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై పరిమితిని 50 శాతానికి మించి పెంచేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాలలో కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లను అన్ని కులాల వారికీ ఎటువంటి వివక్ష లేకుండా అమలుపరుస్తాము. కేంద్ర ప్రభుత్వంలో భర్తీకాకుండా మిగిలిపోయిన ఉద్యోగ ఖాళీలను అధికారానికి వచ్చిన ఏడాదిలోగా భర్తీ చేస్తాము'. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యున్నతికి కాంగ్రెస్ ఇంకా పలు హామీల నిచ్చింది.

అబద్ధం: కాంగ్రెస్ ప్రభుత్వం వారసత్వ సంపదపై పన్ను విధిస్తుంది. సత్యమేమిటి? పన్నుల విధానం, పన్నుల సంస్కరణలకు సంబంధించిన 12 అంశాలలో భాగంగా ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను తీసుకువస్తామని, వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్లను ఐదేళ్ల పాటు నిలకడగా ఉంచుతామని, సెస్‌లను 5 శాతానికి మించి పెంచమని, రెండో జీఎస్టీని రూపొందించి అమలుపరస్తామని, ఎంఎస్ఎంఈలు, కిరాణా వ్యాపారాలపై పన్నుల భారాన్ని తగ్గిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. న్యాయ్ పత్రలో ఎక్కడా వారసత్వ పన్ను గురించిన ఊసే లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాలు చెప్పారు; కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'లోని సత్యాలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలు కావడానికి దోహదం చేశారు; ఈ వాద ప్రతివాదాలలో బీజేపీ మేనిఫెస్టో 'మోదీకి గ్యారంటీ'ని ప్రస్తావించనే లేదు.. తద్వారా కాంగ్రెస్ మేనిఫెస్టోపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రశంసాపూర్వక వ్యాఖ్యను మోదీ సమర్థించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 2024 లోక్‌సభ ఎన్నికల నిజమైన హీరో అని నరేంద్ర మోదీ ఒప్పుకున్నారు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

హిందుత్వం బలపడితే భయమెందుకు?

ఈ సాధారణ ఎన్నికల్లో ఒక్క పార్టీ మినహా అన్ని రాజకీయ పార్టీలు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో హిందుత్వంపై తీవ్రస్థాయిలో విషం కక్కుతున్నాయి. ఇది ముమ్మాటికి సరికాదు. ఈ దేశ అస్తిత్వాన్ని, మెజారిటీ ప్రజల మనోభావాలను కాలరాసే విధంగా మాట్లాడటం, వ్యంగంగా చలోక్తులు విసరడం, హిందుత్వంపైనా అయోధ్య రామ మందిరంపైనా విమర్శలు గుప్పించడం దుర్మార్గం. ఓటు బ్యాంకు రాజకీయాలకు పెద్దపీట వేస్తూ, హిందువుల గుండెలపై గునపాలు దించే స్థాయిలో తీవ్ర పదజాలాన్ని ఉపయోగించడం ఏ మాత్రం భావ్యం కాదు. అసలు హిందుత్వం బలపడితే ఈ నేతలకు భయం ఎందుకు?

ఇటీవల భువనగిరి బహిరంగ సభలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ, అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ, ప్రసాదం వితరణ, శ్రీరామనవమి రోజు కాషాయ జెండాల అలంకరణ, దేవుడి ఊరేగింపులు, దేవుడి తీర్థప్రసాదాల పంపిణీపై హిందువుల మనోభావాలు గాయపరిచే విధంగా మాట్లాడారు. కాషాయ జెండాలు మన పొలాలకు నీరు తీసుకొస్తాయా, కడుపు నింపుతాయా? అని వ్యంగంగా విమర్శించారు. అదే సందర్భంలో ముస్లింలను ప్రసన్నం చేసుకునేందుకు నేను సెక్యులర్‌ను అంటూనే ఉర్దూలో మాట్లాడుతూ హిందుత్వంపై బురదజల్లారు. రంజాన్ సందర్భంగా తోఫా పంపిణీ చేశాను అని తనకు తాను కితాబిచ్చుకున్నారు. అంటే రంజాన్‌కు తోఫా ఇస్తే సెక్యులరిజం, శ్రీరామనవమి రోజు ప్రసాదం పంపిణీ చేస్తే మతోన్మాదమా? అంతకుముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతూ, 'జైశ్రీరామ్ నినాదాలు కడుపు నింపుతాయా, ఉద్యోగాలు ఇస్తాయా?' అంటూ హిందుత్వాన్ని, హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముడిని చులకన చేసే విధంగా మాట్లాడి హిందూ వ్యతిరేకతను ప్రదర్శించాడు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకో అడుగు ముందుకేసి భారత్‌ను హిందూ దేశంగా మారుస్తున్నారని, రాజ్యాంగాన్ని రద్దు చేసి, మనువాద ధర్మాన్ని తీసుకువస్తారని మాట్లాడటం ఏ మాత్రం క్షమార్హం కాదు. రేవంత్ రెడ్డి ఇటీవల ఖమ్మం సభలో మాట్లాడుతూ శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలను ప్రస్తావించడం, దేవుళ్ల పేరుతో ర్యాలీలు తీసి ఓట్లు దండుకుంటున్నారని విమర్శించడం రాజకీయ దిగజారుడుతనమే. తన పార్టీ గెలుపు కోసం, ముస్లింల మెప్పు కోసం హిందుత్వంపై విషం చిమ్మడం ఘోరం. ఈ దేశాన్ని హిందూ దేశంగా మారుస్తారని ముస్లింలను రెచ్చగొట్టి ఓట్లు పొందే దుర్మార్గపు మాటల వెనక వారి హిందూ ద్వేషం కనబడుతోంది. తమ పార్టీ అగ్ర నేతల (హిందూ విరోధుల) మెప్పు కోసం తాపత్రయపడుతూ మాట్లాడిన మాటలే ఇవి. ఇటలీ భావజాలం గల నేతలను ప్రసన్నం చేసుకునేందుకు రేవంత్ గారు హిందుత్వాన్ని పణంగా పెట్టడం ఏ మాత్రం తగదు. హిందుత్వాన్ని విమర్శిస్తే మరిన్ని మార్కులు పడతాయనే దురాలోచనలతో మాట్లాడటం హిందూ సమాజం హర్షించదు. మతం ఆధారంగా విడిచిపోయిన భారత భూభాగంలో నేడు హిందూ దేవాలయాలు ధ్వంసమయ్యాయి. హిందువుల ఆనవాళ్లు మాయమయ్యాయి. ప్రస్తుతం కశ్మీర్, బెంగాల్, కేరళ, అస్సాం తదితర ప్రాంతాల్లో హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. నేడు మిగిలి ఉన్న ఈ మాత్రం భారత్‌ను కూడా కబళించడమే కాంగ్రెస్ లక్ష్యమా? అని హిందూ సమాజం ప్రశ్నిస్తోంది.



ప్రపంచంలో ఒకే ఒక్క హిందూ దేశంగా ఉన్న భారత్‌ను కూడా కబళించాలనే కుట్రలకు నేడు బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్నాయి. ఈ పార్టీల నేతల ఆలోచన సరళి పరిశీలిస్తే– హిందుత్వం బలపడితే మన మనుగడ ప్రశ్నార్థకం అనే బెంగ బలంగా పట్టుకున్నట్టు ఉంది. అందుకే అవకాశం వచ్చిన ప్రతి సందర్భాన్నీ ఉపయోగించుకొని, హిందుత్వాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. సెక్యులరిజం అనే తేనె పూసిన కత్తిని అందుకు వాడుతున్నారు.

కమ్యూనిస్టుల విషయం వేరే చెప్పక్కర్లేదు. ఈ రాత్రికి రాత్రే హిందుత్వాన్ని అంతం చేయాలనేది వారి ప్రధాన లక్ష్యం. వీటికి తోడు మజ్లీస్ పార్టీ విషయం తెలిసిందే. పోలీసులు పక్కకు జరిగితే '15 నిమిషాల్లో హిందువులను అంతం చేస్తా'మని మజ్లీస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ప్రపంచానికి సుపరిచితమే.

అయితే ఈ నేతల ఆలోచన సరళి పరిశీలిస్తే– హిందుత్వం బలపడితే మన మనుగడ ప్రశ్నార్థకం అనే బెంగ బలంగా పట్టుకున్నట్టు ఉంది. అందుకే అవకాశం వచ్చిన ప్రతి సందర్భాన్నీ ఉపయోగించుకొని, హిందుత్వాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అందుకు బదులుగా సెక్యులర్ అనే తేనె పూసిన కత్తిని వాడుతున్నారు.

ఈ దేశంలో హిందుత్వాన్ని సమాధి చేయాలనుకునే నేతల మాటలను ఎన్నికల కమిషన్ సుమోటోగా స్వీకరించి, చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలి. మెజారిటీ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్న ఆయా పార్టీలు, నేతలపై చట్టపరమైన చర్యలకు వెనకాడకూడదు. హిందుత్వం బలపడితేనే భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ప్రపంచంలో ఒకే ఒక్క హిందూ దేశంగా ఉన్న భారత్‌ను కూడా కబళించాలనే కుట్రలకు నేడు బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్నాయి. ఈ చర్యలతో హిందుత్వాన్ని ప్రమాదంలోకి తోసేసేందుకు నేతల కుట్రలు ఫలిస్తే ఇక అంతే సంగతులు..! 'భారతదేశంలో హిందువులు కూడా ఉండేవారు' అని చరిత్రలో రాసుకోవాల్సిందే తప్ప చేసేదేముండదు.

ఇలాంటి ఓటు బ్యాంకు రాజకీయాల వల్లనే ఇప్పటికే పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ తదితర భూభాగాలను మతం ఆధారంగా భారతదేశం కోల్పోయిన విషయం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఇప్పుడు ఈ రాజకీయ కుట్రల కారణంగా మిగిలి ఉన్న భారత భూమిని కూడా హిందువులకు దూరం చేసే కుట్ర బలంగా సాగుతోంది. దీనిపై రాజకీయాలకు అతీతంగా అందరూ ఆలోచించాలి. హిందుత్వాన్ని, కాషాయ జెండాలను, హనుమాన్ జయంతిని, శ్రీరామనవమి వేడుకలను అప్రతిష్ఠపాలు చేస్తున్న నేతలకు బుద్ధి చెప్పాల్సిందే. లేదంటే హిందుత్వ మనుగడ ప్రశ్నార్థకమే!

ఓట్ల కోసం హిందూ ధర్మాన్ని పణంగా పెట్టడాన్ని విరమించుకోవాలని హిందూ సమాజం కోరుకుంటుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో హిందూ జనాభా నిష్పత్తి శాతం, నేడు రాజకీయ కారణాల కారణంగా ఉన్నటువంటి హిందూ జనాభా నిష్పత్తి శాతం గమనిస్తే హిందువుల సంఖ్య రోజురోజుకు ఎంత తగ్గుతూ పోతున్నదో బోధపడుతుంది. హిందూ సమాజంలో చాలామంది మతం మారినప్పటికీ హిందువులుగా రికార్డుల్లో చూపిస్తున్నారు. కానీ వాస్తవంగా హిందువుల జనాభా పరిగణిస్తే భయంకరమైన వాస్తవాలు బయటపడతాయి. ఉన్న కొద్దిపాటి హిందూ సమాజాన్ని కూడా కాలరాసే కుట్రలను కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టు, తదితర సెక్యులర్ పార్టీలుగా చెప్పుకునే అన్ని రాజకీయ పార్టీలు మానుకోవాలి.

ఐదు శతాబ్దాల నాటి మరకలను చెరిపి, ఇప్పుడిప్పుడే అయోధ్యలో రామ మందిరం నిర్మించుకున్నాం. ఆ రామ మందిరాన్ని చూసి ఓర్వలేకపోవడం, విమర్శలు గుప్పించడం వంటి దుర్మార్గపు పనులు చేయవద్దని హిందూ సమాజం అభ్యర్థిస్తోంది. ముస్లింల ఓట్లతో గద్దెనెక్కి హిందూ సమాజాన్ని అంతం చేయాలని చూడటం ఈ రాజకీయ నాయకులకు సరికాదని హిందూ సమాజం హెచ్చరిస్తుంది.

• పగుడాకుల బాలస్వామి
ప్రచార ప్రసార ప్రముఖ్, విశ్వహిందూ పరిషత్, తెలంగాణ

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి, దున్నేవానికి భూమి పంచినప్పుడు, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ప్రజలకు ప్రజాస్వామిక హక్కులు గ్యారంటీ చేసినప్పుడు, అమెరికా అగ్రరాజ్య ప్రభావం నుంచి బయటపడి, స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించినప్పుడు మాత్రమే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. అంటే భూమి, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం కోసం చేసే పోరాటం ద్వారా మాత్రమే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయి. ఈ లక్ష్యాలను సాధించడానికి భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (యుసిసిఆర్ఐ-ఎం.ఎల్) విప్లవ ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నది.

భారతదేశం 'క్వాడ్' నుంచి బయటకు రావాలి. ఇండో–పసిఫిక్ వ్యూహాన్ని తిరస్కరించాలి. అమెరికా అనుకూల విదేశాంగ విధానం నుంచి బయటపడి, మనదేశ నిజమైన జాతీయ ప్రయోజనాలకు, శాంతికి, అభివృద్ధికి తోడ్పడే స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించాలి. యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించాలి. అమెరికా వ్యూహానికి సేవచేసేది కాకుండా స్వతంత్ర ఆర్థిక విధానం అనుసరించాలి.

జాతీయ పరిశ్రమలకు, ప్రత్యేకించి తెలుగు జాతీయ పరిశ్రమలకు రక్షణ కల్పించాలి. కార్మికుల, మధ్యతరగతి వర్గాల పని పరిస్థితులను మెరుగుపరచాలి, వారి జీతాలను పెంచాలి. భూస్వామ్య విధానం రద్దు చేయాలి, దున్నేవానికి భూమిని పంచాలి. ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక విద్యా సంస్కృతులను అభివృద్ధి చేయాలి. ప్రత్యేకించి తెలుగు ప్రజల జాతీయ ఐక్యతను, తెలుగు సంస్కృతి, భాషల సర్వతోముఖాభివృద్ధి సాధించాలి. అన్ని నిర్బంధాలను రద్దు చేయాలి. జాతీయ, ప్రజాస్వామిక, విప్లవ శక్తులందరికీ సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని గ్యారంటీ చేయాలి.

ఈ నినాదాలతో తెలంగాణలో 11 లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో 4 లోక్‌సభ, 12 అసెంబ్లీ స్థానాల్లో యుసిసిఆర్ఐ (ఎం.ఎల్) పోటీ చేస్తూ పాలకవర్గాల ప్రజావ్యతిరేక, అభివృద్ధి నిరోధక విధానాలను ఎండగడుతుంది.

– జి. వినోద్, కార్యదర్శి, యుసిసిఆర్ఐ(ఎం.ఎల్)

ప్రత్యర్థికి విరాళం!

అవి 1955 మధ్యంతర ఎన్నికలు ఆంధ్రాలో జరిగే రోజులు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున జవ్వాది లక్ష్మయ్య, కమ్యూనిస్టు పార్టీ తరఫున వంక సత్యనారాయణ పోటీ చేస్తున్నారు. పోటీ హోరాహోరీగా సాగుతోంది. కమ్యూనిస్టు పార్టీ ఒక కారు సంపాదించి ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకోమని సత్యనారాయణకి పంపించింది. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు పెట్రోలుకు కూడా డబ్బులు లేని సత్యకాలం అది. సత్యనారాయణ తన ప్రత్యర్థి లక్ష్మయ్య దగ్గరకెళ్లి విషయం చెప్పి విరాళం అడిగారట. నాపై పోటీ చేస్తూ నన్ను విరాళం అడుగుతున్నావా? అంటే.. అది మా పార్టీ నిర్ణయం సార్ అన్నారట సత్యనారాయణ. నీకు డబ్బులుగా ఇస్తే అల్లరవుతుంది కానీ నాకు మార్టేరులో పెట్రోల్ బంకు ఉంది. అక్కడ వెయ్యి రూపాయల పెట్రోలు ఉచితంగా కొట్టమని చెప్తాను, వెళ్లండి అని చెప్పారట లక్ష్మయ్య. ఎలక్షన్ కాలానికంతా ఆ పెట్రోలు సరిపోయిందని వంకా తన ఆత్మకథ తొమ్మిదిపదుల్లో రాసుకున్నారు.

– చెరుకూరి సత్యనారాయణ

దోపిడీ గురువుల నీతి ప్రవచనాలు


తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట అక్రమ వసూళ్లు చేసి ఢిల్లీకి పెద్ద వాటాను నల్లధనం రూపంలో తరలిస్తున్నారని తెలంగాణలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. వెంటనే రేవంత్‌పై విచారణకు ఆదేశించాలని, ఈడీని, ఐటీని దించాలంటూ కేసీఆర్ ఆ వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడారు. మోదీ, కేసీఆర్ మిలాఖత్ కాకపోతే ఆయన వ్యాఖ్యానించిన వెంటనే ఈయన ఎందుకు సమర్థిస్తూ మాట్లాడతారు. ఏ ఆధారాలు లేకుండా ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఎలా మాట్లాడతారు? అవినీతికి వ్యతిరేకంగా గొంతెత్తుతున్న మోదీ, కేసీఆర్ సుద్దపూసల బండారం ఏమిటో ఒకసారి పరిశీలిద్దాం.

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ స్థాయి రాజకీయాలపై దృష్టిపెట్టిన కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లి ఎన్సీపీకి చెందిన మాజీ మున్సిపల్ ఛైర్మన్‌కు రూ.10కోట్లు ఇచ్చి బీఆర్ఎస్ కండువా కప్పారు. కేసీఆర్ వంటి అధమ స్థాయి నాయకుడిని ఇంతవరకు చూడలేదని శరద్‌పవార్ అన్నారు. మహారాష్ట్రలో పార్టీని విస్తరించడం కోసం అక్కడి నాయకులకు కేసీఆర్ భారీగా డబ్బు ముట్టజెప్పి తన పార్టీలో చేర్చుకున్నారని, అలాగే దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం కోసం ఒక విమానాన్ని కొనుగోలు చేశారని ప్రచారం జరిగింది. 2019 ఎన్నికల్లో జగన్‌కు భారీగా ఆర్థిక సహాయం అందించారని, అదేవిధంగా కుమారస్వామికి కూడా సహాయం అందించినట్లు వార్తలు వచ్చాయి. చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ పొత్తుపెట్టుకోకుండా ఉంటే ఆయనకు రూ.వెయ్యి కోట్లు ఇస్తానని ఆఫర్ చేసినట్లు కూడా వార్తలు చదివాం. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలలో కేసీఆర్ పెట్టిన ఖర్చును చూసి దేశం మొత్తం నివ్వెరపోయింది. ఈ రెండు నియోజకవర్గాల్లో దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు పెట్టినట్లు వార్తలొచ్చాయి. ఎంత అవినీతికి పాల్పడకపోతే ఒక్కో నియోజకవర్గంలో రూ.500 కోట్ల చొప్పున కేసీఆర్ ఖర్చు పెట్టారు? అలాగే తెలంగాణలోని ప్రతి జిల్లాలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి బీఆర్ఎస్ పార్టీకి అన్ని వసతులతో కార్యాలయాలను కేసీఆర్ నిర్మించారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న ఏ రాజకీయ పార్టీ కూడా ఈ విధంగా కార్యాలయాలను నిర్మించుకోలేదు.

డబ్బును వెదజల్లి ఇతర పార్టీ నాయకులను పార్టీలు ఫిరాయించేలా చేసుకుంటూ ధన రాజకీయం చేస్తున్న వ్యక్తి కేసీఆర్. 2024 ఎన్నికల్లో విపక్ష కూటమికి తనను ఛైర్మన్‌ను చేస్తే దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష పార్టీలకు అయ్యే ఎన్నికల ఖర్చు మొత్తాన్ని భరించేందుకు తాను సిద్ధమని కేసీఆర్ ఓ ప్రైవేట్ సమావేశంలో తన సహచరులతో చెప్పినట్లు ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ ఓ వీడియో ద్వారా ఏప్రిల్, 2023లో బయట పెట్టారు. 2014లో ఎన్నికల ఖర్చుల కోసం అప్పులు చేసిన కేసీఆర్.. తొమ్మిదేళ్ల గడిచేటప్పటికి దేశం మొత్తం ఎన్నికల ఖర్చు భరించే స్థాయికి చేరుకున్నారంటే ఎన్ని లక్షల కోట్లు అక్రమంగా గడించారో!

2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశం మొత్తం మీద రూ.60వేల కోట్లు ఖర్చయ్యాయని, దానిలో బీజేపీ 45 నుంచి 50శాతం వరకు వ్యయం చేసిందని, కాంగ్రెస్ కూటమి కేవలం 15 నుంచి 20శాతం మాత్రమే ఖర్చు చేసిందని, దేశంలో జరుగుతున్న ఎన్నికల ఖర్చును ఎప్పటికప్పుడు లెక్కకడుతున్న సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్–ఢిల్లీ) అధినేత ఎన్.భాస్కర్‌రావు తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం ఎన్నికల ఖర్చు రూ.1.35లక్షల కోట్లకు చేరుకుంటుందని ఈ సంస్థ తెలిపింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 45శాతం ఎన్నికల ఖర్చు చేసిందనుకుంటే.. ఇప్పుడు దేశం మొత్తం మీద ఎన్నికల ఖర్చు కేసీఆర్ భరిస్తానని చెబుతున్నారంటే.. రూ.60 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కేసీఆర్ ఎంత డబ్బు సంపాదించి ఉంటే.. దానిలోంచి ఇంత సొమ్ము ఖర్చు చేస్తారు? తెలంగాణను నిలువు దోపిడీ చేసి, అడుగడుగునా కుంభకోణాలకు పాల్పడకపోతే కేసీఆర్‌కు ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా పార్టీలకు వచ్చిన విరాళాలపై దర్యాప్తునకు కేసీఆర్, మోదీ సిద్ధమా? ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ మాట్లాడగానే ఈడీ, సీబీఐలతో దర్యాప్తు జరిపించాలని కేసీఆర్ కోరారు. దేశం మొత్తం ఎన్నికల ఖర్చు పెడతానని కేసీఆర్ చెప్పారు కదా! దీనిపై కూడా సీబీఐ దర్యాప్తుకు ఆయన సిద్ధమా? తాను బతికున్నంత కాలం ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వనని మోదీ అంటున్నారు. మరి దీనిపై వెంటనే కేసీఆర్ ఎందుకు స్పందించడంలేదు?



కేసీఆర్ కుటుంబం హైదరాబాద్ సిటీ చుట్టుపక్కల వేల ఎకరాల అత్యంత ఖరీదైన భూములను కబ్జా చేసి వేలాది కోట్లు ఆర్జించిందని, కేసీఆర్ కుటుంబం సంపాదించినంత డబ్బు చరిత్రలో మరెవరూ సంపాదించలేదని గత ఎన్నికలకు ముందు ప్రజలు కథలు కథలుగా చెప్పుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు 30 నుంచి 40వేల కోట్లు, మిషన్ భగీరథలో తక్కువలో తక్కువగా 10వేల కోట్లు సంపాదించారని ప్రజలు చెప్పుకున్నారు. బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోవటానికి ఈ అవినీతే ప్రధాన కారణం. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జిల్లాల నుంచి రాజధాని వరకు యథేచ్ఛగా వేల ఎకరాలు దోపిడీకి పాల్పడి, ఎన్నికల్లో వందల కోట్లు వెదజల్లారు. అయినా ప్రజల చేతిలో ఓటమి తప్పలేదు.

ఎన్నికల్లో ఖర్చుకోసం ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను మోదీ తీసుకొచ్చారు. ఈ బాండ్ల ద్వారా బీజేపీకి రూ.6986.5 కోట్లు నిధులు రాగా, కాంగ్రెస్‌కు రూ.1334 కోట్లు, బీఆర్ఎస్‌కు రూ.1332 కోట్లు విరాళాలుగా వచ్చాయి. జాతీయ స్థాయి కాంగ్రెస్ పార్టీతో సమానంగా బీఆర్ఎస్‌కు నిధులు అందాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి కంపెనీలను బెదిరించి బీజేపీ బాండ్లను కొనుగోలు చేయించింది. ఈడీ, సీబీఐ, ఐటీ శాఖల దర్యాప్తును ఎదుర్కొంటున్న 41 కంపెనీలు బీజేపీకి రూ.471 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో ఇచ్చాయి. ఈ సంస్థల్లో సోదాలు జరిగాక వచ్చిన విరాళాలు రూ.1698 కోట్లు. ఎన్నికల బాండ్ల రూపంలో కాకుండా, దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు 2013–23 మధ్యకాలంలో అందిన నిధులు రూ.7726 కోట్లు. దీనిలో సింహభాగం 64.7 శాతం బీజేపీకి అందాయని ఈసీని ఉటంకిస్తూ బిజినెస్ లైన్ వార్తా కథనం ప్రచురించింది. దీనిలో కాంగ్రెస్‌కు 10.7 శాతం మాత్రమే నిధులు అందాయి.

ఈ ఎలక్టోరల్ బాండ్లు అంతర్జాతీయ స్థాయి దోపిడీ రాకెట్ అని రాహుల్ చెప్పగా, ఈ బాండ్లతోనే బ్లాక్‌మనీ కట్టడి అవుతుందని మోదీ చెప్పారు. అయితే ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, అధికారంలో ఉన్న పార్టీలు దీనితో బెదిరింపులకు పాల్పడతాయని చెబుతూ ఈ పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది.

ఈ బాండ్ల ద్వారా పార్టీలకు వచ్చిన విరాళాలపై దర్యాప్తునకు కేసీఆర్, మోదీ సిద్ధమా? ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ మాట్లాడగానే ఈడీ, సీబీఐలతో దర్యాప్తు జరిపించాలని కేసీఆర్ కోరారు. దేశం మొత్తం ఎన్నికల ఖర్చు పెడతానని కేసీఆర్ చెప్పారు కదా! దీనిపై కూడా సీబీఐ దర్యాప్తునకు ఆయన సిద్ధమా? దేశంలో ఉన్న పోర్టులు, ఎయిర్‌పోర్టులన్నీ అదానీకి కట్టబెట్టడం వెనుక నిధులు దండుకునే వ్యూహం ఏమీ లేదా? కంపెనీలను బెదిరించి మోదీ–కేసీఆర్‌లు వేలకోట్లు దండుకొని కాంగ్రెస్‌పై ఆర్ఆర్ ట్యాక్స్ అంటూ మిత్రులిద్దరూ దాడికి దిగుతున్నారు.

తాను బతికున్నంత కాలం ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వనని మోదీ అంటున్నారు. మరి దీనిపై వెంటనే కేసీఆర్ ఎందుకు స్పందించడంలేదు? అంటే ఆయన కూడా మోదీ వ్యాఖ్యలకు మద్దతిస్తున్నట్లే కదా! గత వారం రోజులుగా ముస్లింలకు వ్యతిరేకంగా మోదీ దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ గెలిస్తే దేశ సంపదంతా ముస్లింలకు పంచి పెడుతుందని అంటున్నారు. మోదీపై కేసీఆర్ ఉత్తుత్తి విమర్శలు రకరకాలుగా చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వటం లేదని, పునర్విభజన చట్టంలో పొందుపర్చిన ఏ హామీలు నెరవేర్చడం లేదంటూ విమర్శలు చేశారు. కానీ, ముస్లింలకు వ్యతిరేకంగా మోదీ చేసిన విమర్శలను కేసీఆర్ ఎందుకు ఖండించటం లేదు? ఆయనే కాదు బీఆర్ఎస్ నాయకులెవరూ ఇంతవరకు దీనిపై స్పందించటం లేదంటే వారు కూడా మోదీ వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లే కదా!

■ అద్దంకి దయాకర్
ప్రధాన కార్యదర్శి, టీపీసీసీ

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 4 మే 2024

హామీలు గోరంత.. తిట్ల దండకం కొండంత..

లోక్‌సభ ఎన్నికల్లో హామీలు దారి తప్పుతున్నాయి. అభ్యర్థులు, ముఖ్యనేతల ప్రచారంలో ప్రత్యర్థిపై ఆరోపణలకే ప్రాధాన్యమిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. తాము గెలిస్తే ఏం చేస్తామో చెప్పటం కంటే గతంలో తన ప్రత్యర్థి చేసిన అక్రమాలు, అవినీతిపైనే ఎక్కువ ఫోకస్ పెట్టి ప్రచారం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ప్రచారానికి మరో వారం రోజులే సమయం ఉన్నా ఇప్పటి వరకు ఏ అభ్యర్థి కూడా పార్లమెంట్ వరకు ప్రత్యేకంగా తన మేనిఫెస్టోను విడుదల చేయలేదు. వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మెగా టెక్స్‌టైల్ పార్కు విస్తరణ, మామునూరు ఎయిర్‌పోర్టు, భూపాలపల్లికి రైల్వేలైన్ లాంటి వాటినే తమ హామీలుగా ప్రచారం చేసుకుంటున్నారు. రైతుల సమస్యలపై ఏ పార్టీ కూడా పెద్దగా స్పందించటం లేదని అన్నదాతలు వాపోతున్నారు. సాగునీటి ప్రాజక్టులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, విద్యా, వైద్యంపై కూడా అభ్యర్థుల నుంచి హామీ రావటం లేదనే చర్చ జరుగుతోంది. ప్రచారానికి ఇంకో వారం రోజుల గడువు ఉండటంతో ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి అభ్యర్థులు, పార్టీలు హామీ ఇస్తారనే ఆశతో ఓరుగల్లు ఓటర్లు ఎదురు చూస్తున్నారు.



ఢీ అంటే ఢీ

ప్రచారంలో నేతల మాటల తూటాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

'నీవు ఒకటంటే.. నేను రెండంట.. నీవు రెండంటే.. నేను అంతకంటే ఒకటి ఎక్కువే అంటా..' ఇదీ నేటి ఎన్నికల ప్రచారంలో నేతల తీరు. ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడా లేకుండా నేతలు, అభ్యర్థులు అభివృద్ధిపై హామీల కంటే వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిస్తున్నారనే ఆవేదన విద్యావంతులు, మేధావుల్లో వ్యక్తమవుతోంది. మాటల తూటలతో స్వరం పెంచుతున్న నేతల తీరుతో ప్రచార సరళి దారి తప్పుతోంది. ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు ఏం చేస్తామో చెప్పాల్సిన నేతలు.. ప్రత్యర్థిపై వ్యక్తిగత మాటల దాడికి దిగుతుండటం.. ఆ మాటల కోసం ఎదురు చూస్తున్నట్లుగా కేడర్ చప్పట్లు కొడతూ ఈలల వేస్తూ ఎంజాయ్ చేయటం ప్రచారంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ఎంతో రాజకీయ ప్రాముఖ్యత, చరిత్ర ఉన్న ఓరుగల్లులో గత ఎన్నికలకు భిన్నంగా ఈ సారి ఎన్నికల ప్రచారం సాగుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

- అభివృద్ధిపై హామీలు గోరంత.... దూషణలు కొండంత..
- ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యక్తిగత ఆరోపణలు
- లోక్‌సభ ఎన్నికల్లో మారిన ప్రచార తీరు
- సరళి దారి తప్పుతోందంటున్న విద్యావేత్తలు, మేధావులు
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో వేడెక్కిన ఓరుగల్లు రాజకీయం

ప్రచారం కొత్త పుంతలు

లోక్‌సభ ఎన్నికల ప్రచార సరళి మారుతోంది. ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే పల్లె, పట్నం తేడా లేకుండా ప్రచారంతో మోత మోగేవి. తమ ప్రాంతానికి వచ్చే అభ్యర్థికో... లేదా కీలక నేతకో తమ కాలనీ, ఊరులో ఉన్న సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చేవారు. దీంతో నేతలు కూడా తమను గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలను పరిష్కరించటంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఎలా ఏర్పాటు చేస్తారో వివరించేవారు. ఇంటింటి ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవారు. పనిలో పనిగా రాష్ట్ర, జాతీయ రాజకీయాలపై పారదర్శకంగా విమర్శలు, ఆరోపణలతో ప్రచార సభలు ముగించేవారు. కానీ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ప్రచారతీరు ఓటర్లలో చర్చనీయాంశంగా మారింది.

స్థానిక అంశాల జోలికి వెళ్లకుండా ప్రత్యర్థిపై ఆరోపణలకే ప్రాధాన్యమిస్తూ ప్రచారం చేస్తున్నారు. 'ఆ అభ్యర్థి ఇంత సంపాదించాడు.. అంటే మరో అభ్యర్థి అంత సంపాదించాడు. ఇన్ని కబ్జాలు చేశారు' అనే విధంగా ప్రచారం నడుస్తోందని ఓరుగల్లువాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈయన దొంగ అంటే ఆయన గజదొంగ అంటూ ఆరోపణలు చేసుకుంటు అసలు సమస్యలపై ఓటర్ల దృష్టి మరల్చుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మారుతున్న ప్రచార తీరుతో కాలనీ, గ్రామ సమస్యలు అభ్యర్థులు, ఎమ్మెల్యేల దృష్టికి వెళ్లటం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్వరం పెంచుతున్న నేతలు

ఓరుగల్లు రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ లోక్‌సభ ఎన్నికలు వ్యక్తిగత దూషణలకు కేరాఫ్‌గా మారాయి. ప్రధానంగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లక్ష్యంగా ప్రత్యర్థి పార్టీల నేతలు స్వరం పెంచుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన కడియంపై బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ నేతలు మాటల తూటాలు పేలుస్తున్నారు. కడియం కులంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన కుమార్తె కడియం కావ్య వివాహంపై కూడా ప్రత్యర్థులు దాడిని పెంచారు. కావ్య హిందువు, ఎస్సీ కాదని, శ్రీ హరి కూడా ఎస్సీ కాదని, అవినీతి పరుడంటూ ప్రత్యర్థి పార్టీలు, ఇత ర సంఘాల నేతలైనా అరూరి రమేష్, మంద కృష్ణ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌కుమార్ తదితర నేతలు ఆరోపణలు చర్చనీయాంశమయ్యాయి. ఓరుగల్లు రాజకీయాల్లో కొంత విలువలతో కూడిన రాజకీయం చేస్తారనే పేరున్న కడియం శ్రీహరికి ఈ ఎన్నికలు భారీ షాక్‌నే ఇచ్చాయనే చర్చ జరుగుతోంది. అయితే శ్రీహరి ఇమేజ్‌ని డ్యామేజ్ చేసేందుకు ప్రతిపక్షాలు రాజకీయ వ్యూహంలో భాగంగానే దాడికి దిగాయనే అభిప్రాయాలు

మిగతా 8వ పేజీలో..

బీఆర్‌ఎస్ గల్లీలో లేదు.. ఢిల్లీలో లేదు..



- దళితులను అణగదొక్కడమే కడియం శ్రీహరి పని
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గెలిపిస్తే పెద్ద జీతగాడి లెక్క పనిచేస్తా..
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్
- నగరంలో బీజేవైఎం నమో యువ సమ్మేళనం

7



వరంగల్ జిల్లా బాలయ్యపల్లి సమీపంలో బావిలో ఈత కొడుతున్న యువకులు

నిప్పుల కుంపటి

6

- ఉమ్మడి జిల్లాలో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వరంగల్ జిల్లాలో అత్యధికంగా 46.1 డిగ్రీలు నమోదు
- మిగతా జిల్లాలోనూ ఇదే పరిస్థితి

శుక్రవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 46.1°C	కనిష్ఠం : 27.5°C

నేను హిందువునే.. ఎస్సీ మహిళనే..

ఇంటర్వ్యూ INTERVIEW



- కులం, మతంపై రాజకీయం చేయడం హేయం
- కవిత లిక్కర్ స్కాంలో ఉండటం, ఎవరూ సహకరించేవాళ్లు లేకే పార్టీ మారాం..
- కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు సహా శ్రేణులంతా ఉత్సాహంగా పని చేస్తున్నారు
- బీజేపీని గెలిపించేందుకే బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టింది
- వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక విజన్ ఉంది
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

తాను హిందువునేనని, ఎస్సీ మహిళనేనని, తన కులం, మతంపై రాజకీయం చేయటం తగదని, చదువు, ఉద్యోగం ఎస్సీగానే కొనసాగాయని వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య స్పష్టం చేశారు. లిక్కర్ స్కాంలో కల్వకుంట్ల కవిత పాత్ర ఉండటం, నేతలపై అవినీతి ఆరోపణలు వస్తుండటంతోనే తాము బీఆర్‌ఎస్‌లో ఉండలేక పోయామన్నారు. వరంగల్ అభివృద్ధిపై తనకు ఓ ప్రత్యేక విజన్ ఉందని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కేడర్ తన గెలుపుకోసం ఉత్సాహంతో పని చేస్తున్నారని చెప్పిన ఆమె.. తనను ఓడించేందుకు బీజేపీకి బీఆర్‌ఎస్ లోపాయికారిగా సహకరిస్తోందని ఆరోపించారు. ఎన్నికలు, ప్రచారం, తన విజన్ గురించి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ఇచ్చి న ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: రాజకీయాల్లోకి ఎందుకు రావాలనుకున్నారు?

కడియం కావ్య: మాది మొదటి నుంచి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. నేను 8వ తరగతిలో ఉన్నప్పుడే సోషల్ సర్వీస్ సబ్జెక్టు చదివిన క్రమంలో ప్రజలకు సేవా చేయాలనే లక్ష్యం ఏర్పడింది. డాక్టర్‌గా సేవ చేసే అవకా శం వచ్చినప్పటికీ దాని పరిధి కొంత వరకే. అందుకే రాజకీయాల్లోకి రావానుకున్నా. దానికి నాన్న కూడా ప్రోత్సహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మీ కులం, మతంపై జరుగుతున్న వివాదంపై మేరేమంటారు?

కావ్య: నేను పక్కా హిందువునే.. ఎస్సీ మహిళను. నా చదువు, డాక్టర్‌గా ఉద్యోగం అన్నీ ఎస్సీ మహిళగా, హిందువుగానే చేశాను. ఎన్నికల్లో పోటీ అనేసరికే నా కులం, మతాన్ని వివాదం చేయటం హేయమైన చర్య. నా వివాహం ముస్లీం వ్యక్తితో జరిగినప్పటికి, ప్రత్యేక చట్టం ప్రకారం భార్య భర్తలు ఎవరి మత ధర్మాన్ని వారు పాటించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన ఈ హక్కు గురించి కూడా తెలియకుండా మాట్లాడటం బాధేస్తోంది. అభ్యంతరాలు ఉంటే రిటర్నింగ్ అధికారికి ఎందుకు ఫిర్యాదు చేయలేదు. కేవలం రాజకీయం చేయాలనే దురాలోచనతో నా కులం, మతాన్ని వివాదం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ ఎన్నికల్లో మీకు ఎవరితో ప్రధాన పోటీ అనుకుంటున్నారు?

కావ్య: ఏ పార్టీతో పోటీ అనేది లేదు. కాంగ్రెస్ బలంగా ఉంది. ఏడుగురు ఎమ్మెల్యేలతో పాటు కేడర్ కూడా సీఎం రేవంత్ నాయకత్వాన్ని బలపరిచి నన్ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ నన్ను ఓడించేందుకు కుట్రలు చేస్తోంది. బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఓ డమ్మీ అభ్యర్థిని బరిలోకి దించింది. నిజంగా పోటీ చేయాలనుకుంటే తాటికొండ రాజయ్యకు ఎందుకు టికెట్ ఇవ్వలేదు.

ఆంధ్రజ్యోతి: బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చిన తరువాత పార్టీ మారటంపై వస్తున్న విమర్శలకు మీ సమాధానమేంటి?

కావ్య: మార్చి 13న బీఆర్‌ఎస్ నాకు టికెట్ ఖరారు చేసింది. దీంతో బీఆర్‌ఎస్ ముఖ్య నేతలందరినీ కలిసి నా విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశాం. అయితే ఎవరూ సహకరించేందుకు ఆసక్తి చూపలేదు. పైగా కడియం కూతురికి టికెట్ అంటే ఒకే ఇంట్లో రెండు పదవులా అనే అక్కసు కూడా బీఆర్‌ఎస్ నేతల్లో కనిపించింది. దీంతో పాటు ఒక మహిళై ఉండి లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కావటం ఏంటనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమయ్యాయి. ఆ క్రమంలోనే బీఆర్‌ఎస్ నేతలపై అవినీతి, భూకబ్జాలు, ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు కూడా రావటంతో పార్టీలో కొనసాగలేక మార్చి 29న పార్టీ నుంచి బయటకు రావాల్సి వచ్చింది. వెంటనే బీఆర్‌ఎస్ నేతలు మా నాన్నపై విమర్శలు చేశారు. పార్టీలో సీనియర్ నేత అనే గౌరవం లేకుండా మాట్లాడారు. దీంతో మరింత మనస్తాపం చెందాం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి వచ్చిన ఆహ్వానంతో పార్టీలో చేరి, వరంగల్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. అంతేకాకుండా మేం పార్టీ ఫండ్ తీసుకుని పార్టీ మారినట్లు ఆరోపణలు చేశారు. ఒక్క ఆధారమైన చూపించండని మా నాన్న సవాల్ చేస్తే తోక ముడిచారు. ఎవరెన్ని కుట్రలు చేసిన, లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నా ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారు. అంతిమ విజయం నాదే.

ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు, కేడర్ సహకరిస్తున్నారా?

కావ్య: ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త నన్ను తమ ఆడపడుచుగా ఆశీర్వదిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ వారే కావటంతో పాటు వారు దగ్గరుండి నా గెలుపుకోసం వ్యూహరచన చేస్తున్నారు. కొత్త, పాత నేతల మధ్య అక్కడక్కడ చిన్నచిన్న బేధాభిప్రాయాలు ఉండటం సహజం. ప్రచారంలో జట్టుగా పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : గెలిస్తే వరంగల్‌కు మీరేం చేయాలనుకుంటున్నారు?

కావ్య: వరంగల్ అభివృద్ధిపై నాకు ఓ ప్రత్యేక విజన్ ఉంది. 2014లో మా నాన్న వరంగల్ ఎంపీగా గెలిచి ఆరేడు నెలలే పని చేసినా స్పీకర్ పేరు పెట్టి పిలువగలిగేలా చేశారు. అంటే ప్రజల ప్రతీ సమస్యను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చే స్తా. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తా. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినే జీ ఏర్పాటు, ఓఆర్ఆర్, మామునూరు ఎయిర్‌పోర్టు, సైనిక్ స్కూల్, ఐఏఎం, ఐటీ కంపెనీలను తీసుక వస్తా.. అలాగే పరకాల, భూపాలపల్లి మధ్య సింగరేణి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా. వీటితో పాటు వరంగల్ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి : నాన్న చాటు కూతురనే పేరుంది.. నిజమేనా?

కావ్య: నాన్నంటే అమితమైన ప్రేమ ఉంది వాస్తవమే. రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకున్నది నాన్న వద్దే. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, సేవ చేసే విషయాల్లో నాన్నే నాకు ఆదర్శం. కానీ, రేపు ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే రాజ్యాంగం నాకు కల్పించిన హక్కులు, విధులను స్వతంత్రంగా నిర్వహిస్తా. అభివృద్ధిలో అవసరమైతే నాన్న సలహాలు తీసుకుంటా. అంతే కానీ, పూర్తిగా నాన్న చాటు కూతురిగా రాజకీయాలు చేయను. స్వతంత్రంగానే వ్యవహరిస్తా.

బీఆర్‌ఎస్‌కు 10 స్థానాలు పక్కా..

- అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- కడియం శ్రీహరికి రాజకీయ సమాధి తప్పదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి మండలంలోని చెన్నూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

పాలకుర్తి, మే 3: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 10 స్థానాలను గెలుచుకుంటుందని, ఈ విషయం సర్వేలు చెబుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల, మల్లంపల్లి, దర్దెపల్లి, కొండాపురం, వల్మిడి, ముత్తారం, చెన్నూరు, విస్నూరు, లక్ష్మీనారాయణపురం, తొర్రూరు, ఈరవెన్ను, గూడూరు, బమ్మెర, పాలకుర్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాలుగు నెలలకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తెలంగాణ తెచ్చిన పార్టీని ప్రజలు 10 యేళ్ల ఆదరించడం వల్లనే అద్భుత ఫలితాలు అందించిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు ఎందుకెయ్యాలని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ను మోసం చేసినందుకు కడియం శ్రీహరికి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వాటిని అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే కరెంటు కోతలు, వ్యవసాయ మోటార్లు కాలిపోవడం మొదలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో సాగునీరు, మెడికల్ కాలేజీలు, నిరంతర విద్యుత్ సరఫరా, కేసీఆర్ కిట్లు, దళితబంధు, రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మిలాంటి పథకాలు అడ్రస్ లేకుండా పోయాయని అన్నారు. ఈ నెల 13న ఓట్ల ద్వారా కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరుతో ఓట్లను దండుకోవడానికి కుట్ర చేస్తున్నారని ఎర్రబెల్లి విమర్శించారు. బీజేపీ దేవుడి పేరుతో ఓట్ల డ్రామాను తెరపైకి తెచ్చిందని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పాలకుర్తి ప్రజలు చైతన్యవంతులని, ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పాలకుర్తి ప్రజలకు అండగా ఉంటానని అన్నారు.

ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. రాష్ట్రం తెచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమించిన పోరాట యోధుడికి పాలకుర్తి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నవీన్, ఎల్లయ్య, మదార్, దేవానాయక్, ఇమ్మడి ప్రకాష్, దేవేందర్, శ్రీనివాస్, బొమ్మగాని కొంరయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

రెండు జాతీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్
- అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి విస్తృత ప్రచారం

రాంనగర్, మే 3: లోక్‌సభ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ పిలుపిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 11, 29 డివిజన్‌లలో అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి వినయభాస్కర్ విస్తృతంగా ప్రచారం చేశారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి ప్రచారంలో పాల్గొన్నారు. రామన్నపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పొలాలకు నీరిస్తే.. రేవంత్‌రెడ్డి కరువు వెంట బెట్టుకొచ్చిండని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ బస్సు యాత్రకు మంచి స్పందన ఉందన్నారు. ప్రజల స్పందన చూసి ఓర్వ లేక కేసీఆర్ ప్రచారాన్ని ఆపించారని ఆయన విమర్శించారు. ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ పక్షాన ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించి స్వలాభం కోసం పార్టీని వీడి ఎన్నికల బరిలో నిలిచిన ఆ ఇద్దరికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ ఉద్యమకారుడు, మచ్చలేని మనిషి అని కొనియాడారు. సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపిచ్చారు.

సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. అనతి కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన ఇద్దరికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆ రెండు పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. మేధావులు, విద్యావంతులు, తెలంగాణవాదులు తనను దీవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే వరంగల్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రచారంలో స్థానిక నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న వినయ్‌భాస్కర్, సుధీర్‌కుమార్

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి

ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



రాంనగర్, మే 3: నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ ఎస్ అభ్యర్థిగా ఏనుగల రాకేష్‌రెడ్డికి అవకాశం దక్కిం ది. ఈ మేరకు శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఈ ఉపఎన్నిక జరగబోతోంది. ఈ స్థానం కోసం వరంగల్ నుంచి రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ పోటీ పడగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డికి అవకాశం దక్కింది.

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రాకేష్‌రెడ్డి.. బిట్స్ పిలానిలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలో ఉద్యోగం చేసి రాజకీయాలపై ఆసక్తితో 2013లో బీజేపీలో చేరి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం టికెట్ ఆశించినా అవకాశం దక్కకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరారు. వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న రాకేష్‌రెడ్డి.. ఉమ్మడి జిల్లా వాసులకు సుపరిచితుడు. యువతలో మంచి గుర్తింపు ఉన్న రాకేష్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ బరిలో దిగబోతున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



రాములు మృతదేహం

కాజీపేట, మే 3: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేటలో జరిగింది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట దర్గాకు చెందిన ధరావత్ రాములు (50) కూలీపనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన అతడు గురువారం రాత్రి దర్గాసమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కరీమాబాద్, ఏప్రిల్ 3: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి రంగశాయిపేటలో చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన ముని వంశీ(29)కి మూడు నెలల క్రితం వివాహం జరిగింది. నగరంలోని రంగశాయిపేటలో అద్దెకు ఉంటూ స్థానిక ఓ బిర్యాని హోటల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల భార్యతో కుటుంబ కలహాలు పెరగడంతో మనస్తాపం చెందిన వంశీ గురువారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వంశీ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు యథాతథం

వరంగల్ ఎడ్యుకేషన్, మే 3: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి స్పష్టం చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి పరీక్షలు జరుగుతాయని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పరీక్షలు వాయిదా పడ్డట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఎవరు నమ్మవద్దని ఆయన కోరారు. పరీక్షలకు సంబంధించిన ఏ అంశమైనా యూనివర్సిటీ అధికారికంగా వెల్లడిస్తుందని, విద్యార్థులు ఎలాంటి అపోహలకు పోకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన సూచించారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



మురళీధర్‌రావు(ఫైల్)

ఐనవోలు, మే 3: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పంథిని శివారు లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి మురళీధర్‌రావు(48) 1.20 ఎకరాల సొంత భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని సాగుచేశాడు. పెట్టుబడులు పెరగడంతో పంట దిగుబడిరాక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. సుమారు రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై జీవితంపై విరక్తిచెంది ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంసభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిప్పుల కుంపటి

● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు ● వరంగల్ జిల్లాలో అత్యధికంగా 46.1 డిగ్రీలు నమోదు ● మిగతా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి



నగరంలోని ఓ స్విమ్మింగ్‌పూల్ వద్ద సందడి..

హనుమకొండ / జనగామ (ఆంధ్రజ్యోతి)/ ములుగు , మే 3 : భానుడి ఉగ్రరూపానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తోంది. శుక్రవారం వరంగల్ జిల్లాల్లో అత్యధికంగా 46.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా ములుగులో 45.4 డిగ్రీలు, జనగామలో 45.3 డిగ్రీలు, హనుమకొండలో 45.1 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పది రోజులుగా ములుగు, జయశంకర్ జిల్లా భూపాలపల్లి తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా శుక్రవారం ఈ రెండు జిల్లాలో కాస్త తగ్గినట్టు కనిపించినా వరంగల్ జిల్లాలో మాత్రం ఎండ మాడుపగలగొట్టింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 46 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదైన ఆరు జిల్లాల్లో వరంగల్ జిల్లా కూడా ఉంది. మరో వారం పాటు ఇదే పరిస్థితి ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నాఉరు. ఎండ తీవ్రతకు తోడు వడగాలులు కూడా తీవ్రమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్య శాఖ, వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వీలైనంత వరకు ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండటమే మంచిదని సలహా ఇస్తున్నారు. ఉమ్మడిజిల్లా రెడ్ జోన్ పరిధిలోకి వచ్చినందు వల్ల తత్ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఎదుర్కొనేందుకు యంత్రాంగాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్లు అప్రమత్తం చేశారు. వడదెబ్బకు గురైనవారికి తక్షణం అత్యవసర వైద్యం అందచేసేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైన పడకలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

గీసుగొండ / తరిగొప్పుల, మే 3: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడదెబ్బ కారణంగా శుక్రవారం ఇద్దరు మృతిచెందారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతు వేల్పుల శ్రీనివాస్ (55) గురువారం గ్రామ సమీపంలోని తన మొక్కజొన్న చేను కోయగా.. మక్కలను ఆరబెట్టే పనులు చేపట్టాడు. అనంతరం ఇంటికి వచ్చిన శ్రీనివాస్ నీరసించి నిద్రపోయాడు. అయితే రాత్రి సమయంలోనూ ఆయన నిద్రలేవక పోవడంతో అతడిని భార్య లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అలాగే జనగామ జిల్లా తరిగొప్పల మండల కేంద్రానికి చెందిన దామెర సాయిలు(75) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం వడదెబ్బగురైన ఆయనకు కుటుంబ సభ్యులు వైద్యుడిని సంప్రదించి ఇంటివద్దే ప్రథమ చికిత్స అందిస్తున్నారు. కానీ శుక్రవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మృతి చెందాడు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి : డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ మెడికల్: ఎండ తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటిశాతం తగ్గడం, మూత్రం గాఢ పసుపురంగులో ఉండి మంట రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురైన వెంటనే నీడ గల ప్రదేశానికి చేర్చి, శరీరాన్ని చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలని సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ, చల్ల, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. సత్వర చర్యల కోసం 108లో అత్యవసర సేవలను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. ప్రథమ చికిత్స చేసిన తర్వాత దగ్గరలోని ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం తప్పించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించాలన్నారు. నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.

ఆ మృతదేహం సుస్మితది కాదు..

నిర్ధారించిన తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్

హసన్‌పర్తి, మే 3: చత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో తన కూతురు సుస్మిత లేదని, ఆ మృతదేహం ఆమెది కాదని సుస్మిత తండ్రి తిక్క సుధాకర్, బాబాయి తిక్క దేవేందర్‌లు తెలిపారు. మంగళవారం చత్తీస్‌గడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో సుస్మిత ఉందని, మృతదేహాన్ని తీసుకుపోవాలని కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు.

బుధవారం సాయంత్రం చత్తీస్‌గడ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తండ్రి సుధాకర్, బాబాయి దేవేందర్ వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని వారు పరిశీలించారు. సుస్మిత తలకు ఇరువైపులా, నుదుటిపై ఉన్న మచ్చల ఆనవాళ్లు మృతదేహంపై లేకపోవడంతో అది తన కూతురుది కాదని నిర్ధారించుకున్నారు. అక్కడి అధికారులకు తెలియజేసి కుటుంబసభ్యులు వెనుదిరిగారు. శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులకు ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది సుస్మిత కాదని తెలియజేశారు. దీంతో బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సుస్మిత సేఫ్‌గా ఉందని, ఎక్కడో ఒకచోట బతికే ఉందన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

హైకోర్టుకు ఎంజీఎం ఏడీ

▸ స్టేటస్ కోతో మళ్లీ అదే స్థానంలో.. ▸ పెద్దాస్పత్రిని వీడని పలువురు ఉద్యోగులు ▸ ఏసీబీ విచారణ జరపాలని డిమాండ్

వరంగల్ మెడికల్, మే 3: రెండు రోజుల కిందట ప్రభుత్వానికి సరెండర్ అయిన ఎంజీఎం ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. సరెండర్‌పై కోర్టు స్టేటస్ కో ఇవ్వడంతో మళ్లీ పాతస్థానంలో చేరారు. పరిపాలన పరమైన కారణాలతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఎంజీఎం ఏడీని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అయితే అనతికాలంలోనే కోర్టును ఆశ్రయించి మళ్లీ కుర్చీలో దర్జాగా కూర్చున్నారు. 13 ఏళ్లుగా ఇక్కడే తి ష్ట వేసిన ఏడీ.. మళ్లీ ఇక్కడికే రావడంపై ఎంజీఎంలో చర్చనీయాంశంగా మారింది.

ఇటీవల ఎంజీఎం ఆస్పత్రిలో అంతర్గత బదిలీలు నిర్వహించారు. కొత్తగా కేటాయించిన స్థానాల్లో చేరిపోయారు. అయితే కేవలం మూడురోజుల్లోనే అనేక ప్రయత్నాలు చేసి తిరిగి ఎవరి స్థానాల్లో వారు చేరారు. ఫలితంగా ఎంజీఎంలో బదిలీలకు విలువలేకుండా పోయింది. ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆర్థిక లావాదేవీల కారణంగానే వీరు ఆయా సెక్షన్‌లను వదలడానికి ఇష్టపడటం లేదనే విమర్శలున్నాయి.

ఏసీబీ విచారణ చేపట్టాలి


ఎంజీఎం పరిపాలన విభాగంలో సుదర్ఘీకాలంపాటు తిష్టవేసిన ఉద్యోగులపై ఏసీబీ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది. రోగుల అవస్థలు పట్టించుకోని పరిపాలన యంత్రాంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా సెక్షన్‌లలో ఎలాంటి మార్పులు రావడం లేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణప్రాంతాల్లో పనిచేస్తే వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులను బదిలీలు చేసే ప్రభుత్వం.. ఎంజీఎం ఆస్పత్రిని ఎందుకు విస్మరిస్తుందో అర్థం కావడం లేదని పలువురు వాపోతున్నారు.

ప్రచారానికి ఎండదెబ్బ!

- ఎండలు మండుతుండటంతో ముందుకుసాగని లోక్‌సభ ప్రచారం
- అల్లాడుతున్న అభ్యర్థులు, పార్టీల శ్రేణులు
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే అభ్యర్థుల క్యాంపెయినింగ్
- పల్లెల్లో ప్రచార రథాల మోత.. రచ్చబండల వద్ద చర్చ
- పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో పార్టీల్లో ఆందోళన



ఖిలావరంగల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కావ్య



మానుకోటలో ఉదయం వేళలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్



రంగంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, వినయ్ భాస్కర్

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) / మహబూబాబాద్ టౌన్, మే 2 : భానుడు భగ్గుమంటున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడిజిల్లాలో 45 డిగ్రీలను దాటిన ఉష్ణోగ్రతలతో ఓ వైపు జనం అల్లాడుతుంటే.. మరో వైపు లోకసభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి విజయం కోసం పనిచేస్తున్న ఆయా పార్టీల శ్రేణులు కూడా ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా ప్రచారంలో అంతగా జోష్ కనిపించని పరిస్థితి. పోలింగ్‌కు మరో పదిరోజులు మాత్రమే ఉండటం.. ప్రచారానికి కేవలం ఎనిమిదిరోజులే గడువున్న నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గాన్ని చుట్టేయడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది. ఇప్పటికే గ్రామ, బూత్ స్థాయిల్లో సమావేశాలు పూర్తిచేసినా.. ఇంటింటి ప్రచారానికి ఎండ తీవ్రత ప్రధాన అడ్డంకిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన హోరు.. హుషారు ఈ ఎన్నికల్లో కనిపించడం లేదు. ఉదయం 7గంటల మొదలు సాయంత్రం 7గంటల వరకు ఎండ మాడుపగలగొడుతుండటంతో అభ్యర్థులు ప్రచారానికి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇక పార్టీ శ్రేణులు తామెక్కడ వడదెబ్బకు గురవుతామోనని జాగ్రత్త పడుతున్నారు. వీలైనంత వరకు ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రచార కార్యక్రమాలు వెలవెలబోతున్నాయన్న చర్చ జరుగుతోంది.

దీంతో అభ్యర్థులు, నాయకులు ఎక్కువ శాతం ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రచారంలో పాల్గొంటూ.. మధ్యాహ్నం సమయంలో ఆత్మీయ సమావేశాలతో పాటు, వ్యక్తిగతంగా పలువురిని కలుస్తూ తమకు మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నా రు. ముఖ్యనేతల సభలు, కార్నర్‌మీటింగ్‌లు, రోడ్‌షోలు కూడా సాయంత్రం సమయంలోనే ఎక్కువగా నిర్వహిస్తున్నారు.

వరంగల్‌లో 42, మానుకోటలో 23మంది అభ్యర్థులు

ఉమ్మడి జిల్లాలోని వరంగల్ లోసనభ నియోజకవర్గం నుంచి 42 మంది, మహబూబాబాద్ నుంచి 23మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రధాన పార్టీల నుంచి ఆరుగురు పోటీలో ఉన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, బీజేపీ తరఫున ఆరూరి రమేష్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్, మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత, బీజేపీ తరఫున ప్రొఫెసర్ సీతారాం నాయక్ పోటీ పడుతున్నారు. వీరితో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు బరిలో నిలిచారు. వీరంతా తమ తమ స్థాయిల్లో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించి తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులైతే ఢీ అంటే ఢీ అంటున్నారు. కానీ వారి ప్రచారాలకు ఎండలు ప్రతిబంధకంగా మారాయి. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఉరుకులు పరుగులుపెడుతున్నారు. ఎండల వేళ ఇంటింటి ప్రచారం కాస్త ఇబ్బంది కరంగా పరిణమించడంతో నేతలు ప్రచారరథాలతో గ్రామాలను మోతెక్కించే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామగ్రామాన ప్రచార రథాలను తిప్పుతున్నారు. ఆయా పార్టీలు చేసిన అభివృద్ధి, మేనిఫెస్టోను వివరిస్తూ పాటల రూపంలో ప్రచారం కొనసాగిస్తున్నారు. దీంతో పల్లెల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు మైకుల మోత మోగుతోంది. ఇదే సమయంలో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలన, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజలు రచ్చబండల వద్ద చర్చించుకుంటున్నారు. వేసవి కావడం, వ్యవసాయ పనులకు కూడా విరామం కావడంతో పార్లమెంట్ ఎన్నికలపై చర్చల పరంపర కొనసాగుతోంది. నలుగురు కలిసిన చోట ఇదే చర్చ వినిపిస్తోంది.

> **46డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**
>
> ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా 46 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. గురువారం ములుగు జిల్లాలో రికార్డు స్థాయిలో 46.5 డిగ్రీలు నమోదవగా.. మహబూబాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, హనుమకొండ జిల్లాల్లోనూ ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతంలో సాధారణంగా ఉమ్మడిజిల్లాలో ఏప్రిల్‌లో గరిష్టంగా 40 నుంచి 41డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. కానీ ఈ సారి భిన్నంగా ఉష్ణోగ్రతలు 43నుంచి 45డిగ్రీలకు చేరువై.. మే నెల ఆరంభం నాటికి 46డిగ్రీలను దాటాయి. దాదాపు వందేళ్ల క్రితం అంటే 1921లో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



లక్ష్మీపురంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ప్రధాని రాక కోసం ఏర్పాట్లు

- లక్ష్మీపురంలో 8న బీజేపీ భారీ బహిరంగ సభ

సంగెం, మే 3 : ఈనెల 8 ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు బీజేపీ నాయకులు వెల్లడించారు. ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం హవేలి శివారు లక్ష్మీపురంలో శుక్రవారం బీజేపీ నాయకులు విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్, బీజేపీ మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ టి.రాజేశ్వరరావు, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షురాలు రావు పద్మ, జనగామ జిల్లా పార్టీ అధ్యక్షుడు దశమంత రెడ్డి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, వరంగల్ తూర్పు పార్టీ ఇన్‌చార్జి ఎర్రబెల్లి ప్రదీప్ రావులు సభ సక్సెస్ చేయడంపై మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 8న ప్రధాని వరంగల్‌కు రానున్నట్లు వివరించారు. ఉదయం 11:30లకు మామునూరు ఎయిర్ పోర్టులో హెలికాప్టర్‌లో దిగి నేరుగా సభ స్థలానికి చేరకుంటారన్నారు. మధ్యహ్నం 12:45 గంటలకు సభలో మాట్లాడి తిరుగు ప్రయాణం చేస్తారని వివరించారు. లక్ష్మీపురంలోని సుమారు వందఎకరాల స్థలంలో బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్కింగ్, సభ స్థలం, మంచి నీటి సౌకర్యం, వంటి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. సభకు తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీ సంఖ్యలో జన సమీకరణ చేయడం జరుగుతుందన్నారు. సభకు లక్షా 50వేల మందికి ప్రత్యేకంగా ఉత్తరాలు రాసి ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే సభ నిర్వహణకు సంబంధించిన పర్మిషన్లు తీసుకోవడం జరిగిందన్నారు. సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు నిరంతరం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని పార్లమెంట్ నియోజక వర్గాల ప్రజలు నరేంద్ర మోదీ తిరిగి దేశ ప్రదాన మంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కేంద్రంలో 10 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం, సంరక్షణ, పథకాల అమలు వంటి అంశాలను దేశ ప్రజలకు వివరించడానికి ప్రధాని ఎన్నికల ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు వివరించారు. అనంతరం సభ స్థలంలో పనులను అరూరి రమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనితా రంజిత్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

వరంగల్ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య



ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 3: పోలింగ్ విధులు, ఎన్నికలకు సంబంధించిన, ఇతర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. హనుమకొండ ఆర్డీవో కార్యాలయం, ఎల్‌బీ కళాశాలలో పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. వరంగల్ లోక్‌సభ పరిధిలో ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయింపు, అలాట్‌మెంట్ కౌంటర్లను కలెక్టర్ పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోస్టల్ బ్యాలెట్ కేటాయింపు విషయాన్ని సరైన అవగాహనతో కొనసాగించాలన్నారు. ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారి ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించడానికి వారికి తగు సూచనలు చేశారు. కలెక్టర్ స్వయంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించే 13బీ, 13సీ కవర్స్‌ను పార్ట్‌నెంబర్లు, సీరియల్ నెంబర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ వెంకన్న, నోడల్ అధికారులు అజిత్‌రెడ్డి, తహసీల్దార్‌లు విజయ్, ఇక్బాల్ పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం అదనపు ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ స్థానానికి 42మంది పోటీలో ఉన్నందున ఎన్నికల సంఘం కేటాయించిన అదనపు ఈవీఎంలకు పరిశీలించారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట పోలింగ్ కేంద్రాలకు మూడు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల సప్లమెంటరీ ర్యాండమైజేషన్ జరిగింది. ఈఎంఎస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు 792 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం బ్యాలెట్ యూనిట్లు 2615 అవసరం ఉండగా మొదటి ర్యాండమైజేషన్ ద్వారా 988, సప్లమెంటరీ ర్యాండమైజేషన్ ద్వారా 1627 ఎన్నికల నిబంధనల మేరకు కేటాయించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు కృష్ణవేణి, సిదం దత్తు, ఎన్నికల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇవి.శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, కుసుమ శ్యాంసుందర్, రజనీకాంత్, ఫైజోద్దీన్ పాల్గొన్నారు.

> **పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలి**
>
> లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు కల్పించాలని, ఆ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, షేడ్ నెట్‌ల ఏర్పాటు, వైద్య సేవలు పోలింగ్ సిబ్బందికి భోజన ఏర్పాట్లు తదితర సదుపాయాల కల్పనపై అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10 నాటికి అన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. 5వ తేదీలోగా ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పోలింగ్‌కు ముందే పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యదేవి, డీపీవో కల్పన, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, డీఈవో వాసంతి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గల్లీలో లేదు.. ఢిల్లీలో లేదు..

- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్
- బీజేవైఎం నమో యువ సమ్మేళనం

హనుమకొండ టౌన్, మే3: బీఆర్ఎస్ పార్టీ గల్లీలో లేదు.. ఢిల్లీలో లేదని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్కామ్‌లతోనే కాలం వెళ్లదీస్తోందన్నారు. ఆ రెండు పార్టీలను నమ్మి ఓటు వేస్తే ప్రజలు తమ హక్కులను వారంతట వారే కాలరాసుకున్నట్లవుతుందని అన్నారు. హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌లో బీజేవైఎం నమో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అరూరి మాట్లాడుతూ.. కార్మికుల నుంచి మేధావుల వరకు మోదీ నామస్మరణ చేస్తున్నారని, వారందరినీ పోలింగ్ బూత్‌ల వరకు తీసుకపోవాల్సిన బాధ్యత బూత్ కమిటీలతో పాటు పార్టీ యువతపై ఉందన్నారు. గతంలో రెండు సార్లు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే.. వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని, కొంత మంది కుట్రల వల్ల ఓటమి చెందానన్నారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, గెలిస్తే పెద్ద జీతగాడి లెక్క పనిచేస్తానని చెప్పారు. అలాగే వరంగల్ లోక్‌సభ పరిధిలోని ప్రాంతాలను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ 50 యేళ్లలో స్కామ్‌లతో దేశాన్ని అప్రతిష్టపాలు చేసిందన్నారు.

దళితులను అణగదొక్కి టికెట్ తెచ్చుకున్న కడియం శ్రీహరికి మాదిగలు బుద్ధి చెప్పాలని అరూరి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ కరీంనగర్ లోక్‌సభ పరిధికి చెందిన వ్యక్తి అని, అయనెవరో ఎవరికీ తెలియదని ఎద్దేవా చేశారు. మోదీని మూడోసారి ప్రధానిగా చేసేందుకు మే 13 వరకు బీజేపీ పార్టీ యువత శక్తివంచనలేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా ప్రభారి కాసం వెంకటేశ్వర్లు, బీజేవైయం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పార్లమెంట్ ప్రభారి మురళీధర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు రవికుమార్, పద్మ, రాష్ట్ర నాయకులు ధర్మారావు, ప్రదీప్‌రావు, కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్, తీగల భరత్, తదితరులు పాల్గొన్నారు.

> **నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి**
>
> 
>
> దామెరలో మాట్లాడుతున్న అరూరి రమేశ్
>
> దామెర: దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కోరారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం దామెర మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్‌ను మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరూరి రమేశ్ హాజరై మాట్లాడుతూ.. దేశంలో మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని బలపర్చేందుకు ప్రతీ ఒక్కరు కలిసి రావాలని కోరారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తనకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూడలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తన గెలుపును ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.
>
> ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంకిడి బుచ్చిరెడ్డి, నియోజవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్, వేల్పుల సుధాకర్(వాజ్‌పేయ్), వేల్పుల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నరేంద్ర మోదీతోనే సాధ్యం

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్

సంగెం, మే 3: ఎస్సీ వర్గీకరణ ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. సంగెం మండలం కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. పథకాలను తప్పుదోవ పట్టడానికి రిజర్వేషన్ల మార్పు అని తెర మీదికి తీసుకొచ్చి నీచ రాజకీయం చేస్తున్న వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగునెలలైనా ఏదీ నెరవేర్చలేదన్నారు. దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చేసిన ఘనత మోదీదేన్నారు. బీజేపీకి ఓట్లు వేసి ఆశీర్వాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ కాళీప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు రాజేశ్వరరావు, వన్నాల శ్రీరాములు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

- గీసుగొండ: ప్రధాని మోదీతోనే దేశానికి సుస్థిరపాలన సాధ్యం అని అరూరి రమేష్ అన్నారు. గీసుగొండ మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చి ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. కమలం పువ్వు గుర్తుకు ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. కడియం శ్రీహరి కుట్ర రాజకీయాలు చేస్తూ మాగలను అణగదొక్కారన్నారు. చంద్రబాబు నుంచి కేసీఆర్ వరకు శ్రీహరి వెన్నుపోటు రాజకీయాలే చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌లోకి వచ్చి మొదటి నుంచి కష్టపడిన సాంబయ్య, ఇందిరలాంటి వారికి అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, గట్టికొప్పుల రాంబాబు, ములక ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రం, కత్తి రమేష్, వెంకటేశ్వర్లు, హేమలత, కర్ణకంటి రజిత, కందికొండ ప్రదీప్, పాల్గొన్నారు.



సంగెం ఎన్నికల కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రమేష్

ఓటుకు చేటు!

లోక్‌సభ ఎన్నికల్లో తగ్గుతున్న పోలింగ్ శాతం

- వరంగల్‌లో 12.2 శాతం, మానుకోటలో 9.68 శాతం తగ్గుదల
- ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారుల తంటాలు
- ఈ సారైనా పోలింగ్ శాతం పెరిగేనా?
- ఆందోళనలో అధికారులు, అభ్యర్థులు



హనుమకొండ, ఏప్రిల్ 29, (ఆంధ్రజ్యోతి): వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గుతుండడం అటు అధికారుల్లో, ఇటు అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతున్నా.. పోలింగ్ శాతం ఆ మేరకు పెరగడం లేదు. అసెంబ్లీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం మరీ తక్కువగా ఉంటోంది. ప్రజలు ఓటర్లు గా తమ పేరు నమోదు చేసుకోవడంలో చూపుతున్న ఆసక్తి.. తీరా ఓటు హక్కును వినియోగించుకోవడంలో చూపడంలేదు. పో లింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వరకు వెళ్లి ఓటు వేయడానికి బద్దకిస్తున్నారు. దీంతో ప్రతీ ఎన్నికల్లో పోలింగ్ శాతం అంతకంతకు తగ్గుతూ వస్తోంది. ఇది అభ్యర్థుల విజయా వకాశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

వరంగల్ లోక్‌సభలో..

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి లో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, భూపాలపల్లి వర్ధన్నపేట, పాల కుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ సెగ్మెంట్ల పరిధిలో కొత్త ఓటర్ల జాబితా ప్రకారం 18,16,543 మంది ఓటర్లు ఉన్నారు. 8,91,940 మంది పురుష ఓటర్లు ఉండగా, 9,24,208 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గతంలో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతాన్ని చూస్తే అప్పటికీ ఇప్పటికీ పోలింగ్‌శాతం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈసారి ఓటు హక్కు వినియోగించుకునే వారి సంఖ్యను మరింత పెంచాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం లో ఓటర్ల సంఖ్య పెరుగుతున్నా పోలింగ్ శాతం మాత్రం పెరగడం లేదు. 2004లో జరిగిన ఎన్నిక ల్లో 74.90 శాతం పోలింగ్ జరగ్గా 2009 ఎన్నికల నాటికి అది కాస్త 69.32 శాతం తగ్గింది. 2014 ఎన్నికల్లో పోలింగ్ శాతం కాస్త పెరిగి అది 76.52 శాతంగా రికార్డు అయింది. ఎంపీగా గెలిచిన కడియం శ్రీహరి రాజీనామాతో 2015లో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం మళ్లీ తగ్గింది. 68.50 శాతం మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం మరింతగా తగ్గింది. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం 63.70 శాతంగా నమోదైంది. 2004 నుంచి 2019 వరకు జరిగిన ఐదు ఎన్నికలో పోలింగ్ శాతం క్రమంగా 12.2 శాతం తగ్గుతూ వచ్చింది. 2014 ఎన్నికలతో పోల్చితే 2019 నాటికి పోలింగ్ శాతం దాదాపుగా 13 శాతం తగ్గింది.

మహబూబాబాద్ లోక్‌సభలో...

మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగుతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పినపాక, ఇల్లందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ సెగ్మెంట్లలో కొత్త ఓటర్లను కలుపుకొని మొత్తం 15,30,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 7,46,982 మంది పురుష ఓటర్లు, 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోనూ ఓటింగ్ సరళి ఇదే విధంగా ఉంది. ఇక్కడ కూడా ఓటింగ్ శాతం ప్రతీ ఎన్నికల్లో తగ్గుతూ వస్తోంది. 2009 ఎన్నికల్లో 78.74 శాతం ఓటింగ్ నమోదు కాగా, 2014 ఎన్నికల్లో కాస్త పెరిగి 81.21 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో మళ్లీ తగ్గింది. ఈ ఎన్నికల్లో 69.06 శాతం మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అసెంబ్లీ ఎన్నికలకన్నా..

అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటింగ్ శాతం తగ్గుతూ వస్తోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చినప్పుడు ఎంపీ ఎన్నికల నాటికి పోలింగ్ శాతం మరింత తగ్గిపోతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు సెగ్మెంట్లలో 12,70,497 మంది ఓటేయగా, ఎంపీ ఎన్నికల్లో మాత్రం 10,60,412 మంది మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా 18లక్షల మంది ఓటర్లకుగాను దాదాపు 14 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

లోక్‌సభ ఎన్నికలపై అనాసక్తి

ఓటర్లు అసెంబ్లీ ఎన్నికలపై చూపినంత ఆసక్తి లోక్‌సభ ఎన్నికలపై చూపడం లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఇతర ప్రాంతాల్లో ఉండే వారు సైతం స్వస్థలాలకు వచ్చి ఓటు వేస్తున్నారు. ఎంపీ ఎన్నికలకు మాత్రం ఆ స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018 డిసెంబర్ 7 జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో సరాసరి పోలింగ్ శాతం 73.74 నమోదు కాగా, ఆ తర్వాత నాలుగు నెలలకు 2019 ఏప్రిల్ 11న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం సరాసరి పోలింగ్ 62..77 శాతమే నమోదైంది. ఏకంగా 11 శాతం తగ్గింది. ఇందుకు రకరకాల కారణాల్లో ఎండాకాలం కూడా ఒకటని స్పష్టమవుతోంది. 2019 ఏప్రిల్ రెండో వారంలో రాష్ట్రం లో 42-43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈసారి ఇప్పుడు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటేశాయి. ఇక పోలింగ్ జరిగే మేనెల రెండోవారం నాటికి ఇంకెంత పెరుగుతాయో, ఎండలు ఎంతగా మండిపోతాయో చెప్పలేని పరిస్థితులున్నాయి. అయితే పోలింగ్ తగ్గడానికి ఎండలతోపాటు ఇతర కారణాలు కూడా లేకపోలేదు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఎంపీ అభ్యర్థులు, పార్టీలు గడపగడపకూ ప్రచారం చేయడం, మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తరలించడం లాంటివి జరగవు. ఓటర్లను ప్రత్యేక ఇళ్లకు రప్పించి ఓటేయించుకునే విధానం ఎంపీ ఎన్నికల్లో కనిపించదు. ఇది కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌శాతం తగ్గడానికి ఒక ప్రధానంగా కనిపిస్తోంది. అలాగే పట్టణ ఓటర్లు ఓటు హక్కు వినియోగంపై అనాసక్తి చూపుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోకన్నా పట్టణ పరిధిలో ఓటింగ్ శాతం ప్రతీ సారి మరీ తక్కువగా ఉంటోంది.

ప్రచారం చేసినా..

ఎన్నికల్లో ఓటర్లందరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ఎంత ప్రచారం చేసినా, ఎంతగా ప్రో త్సహించినా పెద్దగా ఫలితం ఉండడం లేదు. స్వీప్ వంటి సంస్థలు ఓటర్లలో ఓటుహక్కుపై అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర, జిల్లా అధికారులు యువ ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లో 5కే రన్ నిర్వహించారు. వాల్ రైటింగ్ కూడా చేయిస్తున్నారు. క్యాంపస్ అంబాసిడర్లను నియమించి విద్యార్థులకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. మహిళా సంఘాల ద్వారా సమావేశాలు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యం చేస్తున్నారు. బూత్ లెవల్ బీఎల్‌వోలతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. అయినా ఇప్పటికీ ఓటు హక్కు వినియోగించుకోవడానికి కొందరు ఆసక్తి చూపడం లేదు.



సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 3: ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పాఠశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అన్ని పాఠశాలల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. జీవో నెం.1ని అనుసరించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు, సమ్మర్ క్యాం పులు నిర్వహించరాదని పేర్కొన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు ప్రకటించిన వేసవి సెలవులు అనంతరం జూన్ 11న మాత్రమే పాఠశాలలు పునఃప్రారంభించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని పాఠశాలలు శిక్షణ, సమ్మర్ క్యాంపుల పేరిట వేసవిలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి పాఠశాలలు వాటి చర్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, పాఠశాల అనుమతులు రద్దు చేసేందుకు వెనకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తా..

● వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య ● హసన్‌పర్తి మండల బూత్ కమిటీల సమావేశం

హనుమకొండ సిటీ/భీమారం, మే 3: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో తనను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య వెల్లడించారు. శుక్రవారం హసన్‌పర్తి కేఎల్ఎన్ కన్వెన్షన్ హాలులో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన హసన్‌పర్తి మండల బూత్ కమిటీల సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి కడియం కావ్య మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. ఏఐసీసీ మేనిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారంటీల పట్ల ప్రజల్లో విశ్వాసం ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యేగా ఆరూరి రమేశ్ ప్రజలకు సేవలు అందించడంలో వైఫల్యం చెందన్నారన్నారు. ఈ కారణంగానే అసెంబ్లీ ఎన్నికలో ఆయనను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలో కూడా రమేశ్ ఓటమి ఖాయమన్నారు. భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే సామాన్యుల బతుకు ఛిద్రమే అని కావ్య అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తాం.. రిజర్వేషన్లను తొలగిస్తామంటూ బీజేపీ చెబుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. బీజేపీ నియంతృత్వ పోకడలకు అడ్డుకట్ట వేసి ప్రజలను రక్షించేందుకు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి అండగా నిలువాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీకి తెలంగాణ అంటే గిట్టదని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు జరిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను బీజేపీ తుంగలో తొక్కిందన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటును విస్మరించిందన్నారు. తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలన్న విజ్ఞప్తులను మోదీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే శ్రీరాంసాగర్, దేవాదుల ద్వారా రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యతను తీసుకుంటానని శ్రీహరి హామీ ఇచ్చారు. తన రాజకీయ జీవితంలో అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవ చేస్తున్నట్లు చెప్పా రు. మడికొండ డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలనేది తన ఆలోచనగా శ్రీహరి చెప్పారు. ఈ విషయాన్ని కొందరు వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నాలు చేస్తున్నారని చెప్పారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికలో కడియం కావ్యకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దొమ్మటి సాంబయ్య, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులను కలిసిన కడియం కావ్య

హనుమకొండలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య న్యాయవాదులను కలిసి గెలిపించాలని కోరారు. గెలిచిన తరువాత న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కావ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

కావ్య గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

వడ్డెపల్లి, మే 3: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ రాఘవేంద్ర నగర్ ఫేస్ -1, ఫేస్-2 లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేస్తూ, కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను వివరిస్తూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మండల సమ్మయ్య, జిల్లా నేత తాళ్లపల్లి రవీందర్ (జేకే), మండల సంధ్య, మేరి, విజయ్, భాస్కర్, జాషువా పాల్గొన్నారు.

న్యాయవాదులు, సిబ్బంది
సహకారంతో సమస్యలు పరిష్కరిస్తాం..

● కేసుల పరిష్కారంలో తగిన చర్యలు తీసుకుంటాం..
● వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి నిర్మలా గీతాంబ, జయరాజ్, సమ్మయ్య

వరంగల్ లీగల్, మే 3: న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది చిత్తశుద్ధి, క్రమశిక్షణతో న్యాయమూర్తులకు సహకరిస్తే కేసుల సత్వర పరిష్కారానికి అవకాశముంటుందని వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి నిర్మలా గీతాంబ అన్నారు. వరంగల్, హనుమకొండ రెండు జిల్లాల న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నూతన కమిటీ పరిచయ, సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కోర్టు ప్రాంగణంలో వివిధ స్థాయిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధితో ఉన్నామని, కేసుల పరిష్కారంలో న్యాయవాదులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడికి లోనవుతున్న న్యాయవాదులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసాన్ని ఇస్తాయని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి జడ్జి కమ్ మొదటి అదనపు జిల్లా జడ్జి బి.అపర్ణాదేవి అన్నారు. గౌరవ అతిథుడు, ప్రజా వాగ్గేయకారుడు గోడిశాల జయరాజ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు సైతం కీలక భూమిక పోషించాలన్నారు. అమ్మ ఒడి, నాన్న ప్రేమ ప్రకృతి మనిషి జీవితంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. పాటల రూపంలో పర్యావరణ విధ్వంసానికి మనుషులు ఏవిధంగా కారణమవుతున్నారో జయరాజ్ వివరించారు. ప్రకృతికి సృజనాత్మకత మమేకమై ఉంటుందని అన్నారు. ముప్పై ఏళ్ల నుంచి ప్రాచీనమైన యక్షగాన, చిందుకళను బతికించడంలో కృషిచేస్తున్నానని సమ్మయ్య అన్నారు. భావితరాల కోసం ఈ కళను కాపాడటంలో తన వంతు కృషి చేస్తానన్నారు. న్యాయవాదులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఆహుతుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. వరంగల్, హనుమకొండ, జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జీవన్‌గౌడ్, ఎం.రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల ప్రధానకార్యదర్శులు ముద్దసర్ హైమద్, లాజ రమేష్, ఉపాధ్యక్షులు పోషిణి రవీందర్, సుదర్శన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు భైరపా జయాకర్, సిరికొండ సంజీవరావు, దుస్స జనార్దన్, ఇతర న్యాయమూర్తులు, కార్యవర్గసభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, న్యాయవాదుల కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

'సభలో జరిగిన సంఘటన దురదృష్టకరం'

న్యూశాయంపేట, మే 3: హనుమకొండలో గురువారం ఏర్పాటు చేసిన రెడ్డి కార్పొరేషన్ సభలో గొడవ జరగడం దురదృష్టకరమని రెడ్డి జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వనంరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పత్తి సంపత్‌రెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కృతజ్ఞత సభలో రెడ్డి కులస్థులను కాకుండా ఇతర రాజకీయ నాయకులను పిలిచి కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని రాజకీయం చేయడం సరైందికాదన్నారు.

ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని వినతి

కాజీపేట, మే 3: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరుపున ఎమ్మెల్సీగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని బీజేపీ సీనియర్ నేత మేకల కేదారియాదవ్ కోరారు. శుక్రవారం మార్తినేని ధర్మారావు, టి.రాజేశ్వర్‌రావు, రావుపద్మలను కలిసి ఆయన వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. 33 యేళ్లుగా పార్టీలో పని చేస్తున్నానని, ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని వినతిపత్రంలో కేదారియాదవ్ పేర్కొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి సర్కారు పెద్దపీట

కాజీపేట, మే 3: కాంగ్రెస్ పాలనలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ముదిరా జ్ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం కాజీపేటలో దువ్వ వీరవెంకటరాజు అధ్యక్షతన ఫిషర్‌మెన్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషర్‌మాన్ కాం గ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ, పార్లమెంట్ ఇన్‌చార్జి పిట్టల రాజు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు అందరూ ఐక్యమత్యంతో ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వ యాదగిరి, దువ్వ రేవతి రాజు, ఇప్ప శ్రీకాంత్, పెసర రవికిశోర్, దువ్వ వీరేశ్ కుమార్, గుర్రం అమర్‌నాథ్, భరత్, భానుచందర్, రాకేశ్, రాము, రవికుమార్, హరికృష్ణ, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే3: నిబంధనలు ఉల్లఘించిన 15 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ 15 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఏడుగురికి రూ.5,700, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 8 మందికి రూ.6,500 న్యాయమూర్తి రమేశ్ జరిమానా విధించగా, డ్రైవింగ్ లైసెన్స్ లేని మరో 18 మంది మైనర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

పోలింగ్ పెంపులో భాగస్వాములమవుతాం..

మడికొండ, మే 3: ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన రామలింగేశ్వర ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటింగ్ శాతం పెంచడానికి నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ప్లకార్డులు పట్టుకుని ప్రమాణం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మేము ఓటు వేయడమే కాకుండా ఆటోలో ప్రయాణించే ప్రతీ ఒక్కరికి ఓటు ప్రాముఖ్యతను తెలిపి అందరూ ఓటు వేసేలా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో విజయ్, రాజు, రాజ్‌కుమార్, ప్రవీణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీసీ అండ్ రాక్ సీజీఎంగా తిరుమల్‌రావు



తిరుమల్‌రావును సన్మానిస్తున్న టీఈఈఏ నాయకులు

హనుమకొండ టౌన్, మే 3: టీఎస్ ఎన్పీడీసీఎల్ ఐపీసీ అండ్ రాక్ విభాగం సీజీఎంగా కె.తిరుమల్‌రావు శుక్రవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్, టెక్నికల్ మెంబర్‌గా కొనసాగుతున్న తిరుమల్‌రావును సీజీఎంగా నియమిస్తూ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఇటీవలే ఉత్తర్వులు జారీచేశారు. కాగా, సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన తిరుమల్‌రావును తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో ఆపరేషన్ సీజీఎం కె.కిషన్, జీఎం మల్లికార్జున్, డీఈలు సామ్యానాయక్, రాంబాబు, శ్రీధర్‌చారి, ఏడీఈలు కిరణ్, మధుకర్, అశోక్, ఈఈ జనార్ధన్, ఏఈలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ భద్రతా సూత్రాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఈ, డీఈ, ఇతర సిబ్బంది

హనుమకొండ టౌన్, మే3: విద్యుత్ సిబ్బంది విధి నిర్వహణలో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం బాలసముద్రం సబ్‌స్టేషన్‌లోని సిబ్బందికి విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. ప్రమాద నివారణకు సిబ్బంది తప్పనిసరిగా సేఫ్టీ బెల్ట్, ఎర్త్‌రాడ్, హెల్మెట్ ధరించాలన్నారు. విద్యుత్ లైన్లమీద అజాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రాణాలకు ప్రమాదం సంభవించే అస్కారం ఉందన్నారు. లైన్ క్లియర్ లేకుండా విద్యుత్ పోల్స్‌ను ఎక్కొద్దన్నారు. హ్యాండ్‌గ్లౌస్‌లు వాడాలని సూచించారు. అదే విధంగా వినియోగదారులు వీధిదీపాలను, వైర్లను సరి చేసేందుకు స్తంభాలను ఎక్కకుండా విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఇంటి ఆవరణంలో, ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్‌కు దగ్గరగా వైరు ను దండెంగా కట్టి తడిబట్టలను ఆరేయొద్దన్నారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, ఏడీఈ మల్లిఖార్జున్, హనుమకొండ చౌరస్తా, మచిలీబజార్ ఏఈలు అనూష, ఫోర్‌మెన్, లైన్‌మెన్స్, లైన్‌ఇన్స్‌పెక్టర్స్, జూనియర్ లైన్‌మెన్స్ పాల్గొన్నారు.

ఎస్సార్ యూనివర్సిటీలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి, మే 3: మండలంలోని అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో యంత్ర 2.0 ను నిర్వహించారు. నలుగురు విద్యార్థులు కలిసి జట్లుగా ఏర్పడి ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమాన్ని వీసీ దీపక్‌గార్గ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సమర్థవంతులుగా తయారై పరిశ్రమలకు సిద్ధం చేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న రెండో వెర్షన్ అని అన్నారు. యూనివర్సిటీలో ఓపెన్ బుక్ సిస్టంను ప్రారంభించామని దీని ద్వారా విద్యార్థులకు సమస్యపై తన ఆలోచనను వ్యక్తీకరించడంలో సృజనాత్మకమైన ఆలోచనలు ఉంటాయన్నారు. ఈ ఎక్స్‌పోలో 70 ప్రాజెక్ట్‌ల్లో వివిధ విభాగాలైన స్కూల్ ఆఫ్ బిజినెస్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఏవీవీ సుధాకర్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం బెదిరింపులకు భయపడేది లేదు

వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్



వేలేరు మండల సోడషపల్లిలో వరంగల్ లోక్‌సభ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్

వేలేరు (ధర్మసాగర్) ఏప్రిల్ 3: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్‌కుమార్ అన్నారు. శుక్రవారం వేలేరు మండలం సోడషపల్లిలో నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మసాగర్, వేలేరు మండలాల విస్తృత స్థాయి సమావేశానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ద్వారా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం.. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. ఆయన రాజీనామా చేసే వరకు వెంట పడతామన్నారు. బిల్లులు ఇప్పిస్తామని మాయ మాట చెప్పి, ఆయన మాట వినకుంటే పలువురిని బెదిరింపులకు గురి చేస్తున్నాడని సుధీర్‌కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు గౌరవ వేతనం రావడం లేదన్నారు. కడియం కావ్యది అసలు ఈ రాష్ట్రమే కాదన్నారు. తనది కరీంనగర్ జిల్లా అని అంటున్నారని, కానీ హనుమకొండలోనే పుట్టానన్నారు. కాంగ్రెస్ పార్టీని నాశనం చేయడానికే కడియం కాంగ్రెస్ పార్టీలో చేరాడని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తనను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్నాడని, ఈ ప్రాంతానికి ఆయన ఒక్క పని కూడా చేయలేదన్నారు. టెక్స్‌టైల్ పార్కును తరలించాడని, ఎలుకుర్తికి సైనిక్ స్కూల్ రాకుండా నిలిపివేశాడని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆయనకు అనేక పదవులను ఇచ్చిందని అయినప్పటికీ కాంగ్రెస్ ఎంగిలి మెతులకు ఆశపడి కేసీఆర్‌కు మోసం చేశాడని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. కడియంను రాజకీయంగా బొందపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సరిత, కార్పొరేటర్ రాధిక రెడ్డి, ధర్మసాగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాజు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి సమక్షంలో
సొంత గూటికి పలువురు..



బీఆర్ఎస్ కండువా కప్పి కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఐనవోలు, మే 3: మండలంలోని వనమాల కనపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. శుక్రవారం పాలకుర్తికి వెళ్లి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరారు. పార్టీలో చేరిన మాజీ ఉప సర్పంచ్ రిపిక రమేశ్, మాజీ వార్డు సభ్యులు బండి సతీశ్, సింగారం పుష్పలతోపాటు సుమారు 100 మందికి మాజీ మంత్రి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అబద్దాల కాంగ్రెస్, బీజేపీ పార్టీల వాస్తవపరిస్థితులను తెలుసుకున్నందునే తిరిగి సొంత గూటికి చేరుకున్నారని ఈ సందర్భంగా దయాకర్‌రావు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి

● రేపటి కల్లా ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలి ● జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మే 3: మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికలలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ ద్వారా జిల్లాలోని వివిధ మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, సెక్టార్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ లైట్లు, పారిశుధ్య నిర్వహణ, షెడ్ నెట్ల ఏర్పాటు, ఫ్యాన్లు, కూలర్లు, పోలింగ్ సిబ్బందికి ఏర్పాట్లు, వైద్య సేవలు, తదితర సదుపాయాల కల్పనపై అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. పోలింగ్ జరిగే మే 13వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసి ఉంచాలన్నారు. 5వ తేదీ ఆదివారం కల్లా ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగినన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వందశాతం వెబ్ కాస్టింగ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వయో వృద్ధులు, దివ్యాంగులకు సరైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వై.వి.గణేష్, జడ్పీ సీఈఓ విద్యాలత, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీపీఓ లక్ష్మీ రమాకాంత్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, ఇతర నోడల్ అధికారులు మధురిమ, రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్: సమాజంలోని ప్రతీ ఓటరు తన ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. శుక్రవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఓటరు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఓటుహక్కును వినియోగించు కోవడంలో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఓటు విలువ తెలుసుకొని ఓటును వేయా లన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతీసారి 60 శాతంలోపే ఓటింగ్ జరుగుతుందని, ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉద్యోగులు సెలవును సొంత ప్రయోజనాలకు వినియోగించుకోకుండా ఓటు వేసేందుకు ఉపయోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకబృందం పాల్గొన్నారు.



జూమ్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



175 మావే!

మంత్రి బొత్స సత్యనారాయణ

అబ్బ ఛా!

175 అసెంబ్లీ సీట్లకు 175 గెలుపొంది చరిత్ర సృష్టిస్తాం. చరిత్రలో తన కోసం ఓ పేజీ ఉండాలన్నదే జగన్ ఆకాంక్ష. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్నాం. ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇస్తున్నాం. విదేశీ విద్యకు ఎక్కువ ఖర్చు చేస్తున్నదీ మా ప్రభుత్వమే. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు భూ యజమానులకు వరం. వీటన్నింటితో చరిత్రలో జగన్‌కు ఓ పేజీ ఉంటుంది.

నాన్నను వైఎస్ జగన్ పావులా వాడుకుంటున్నారు

- ముద్రగడ కుమార్తె క్రాంతి సంచలన ఆరోపణ
- పవన్‌పై ముద్రగడ వ్యాఖ్యలను తప్పుబట్టిన క్రాంతి
- జనసేనాని గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడి



పిఠాపురం, మే 3: వైసీపీ నేత ముద్రగడ పద్మనాభానికి ఆయన కుమార్తె క్రాంతి షాకిచ్చారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ముద్రగడ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. 'మా నాన్నను జగన్ పావులా వాడుకుంటున్నారు' అని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన వీడియోలో క్రాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్‌కల్యాణ్‌ను ఓడించేందుకు వైసీపీ పలురకాల కుట్రలు చేస్తోందని ఆమె ఆరోపించారు. పవన్‌పై ముద్రగడ చేసిన చాలెంజ్ బాధాకరమని తెలిపారు. పవన్‌ను పిఠాపురంలో ఓడించి తన్ని తరిమివేస్తానని అనడం, లేకుంటే తన పేరు పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని చెప్పడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముద్రగడ లాజిక్, కాన్సెప్ట్ ఏమిటో తనకు అర్థం కావడం లేదని, ఈ ప్రకటన ఆయన అభిమానులకే నచ్చలేదని తెలిపారు. వంగా గీతను గెలిపించడానికి కష్టపడవచ్చు కానీ... పవన్‌ను, ఆయన అభిమానులను కించపరిచేలా కామెంట్స్ చేయడం తగదని అన్నారు. పవన్‌ను తిట్టేందుకే జగన్ తన తండ్రిని వాడుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల తర్వాత ముద్రగడను జగన్ ఎటూకాకుండా వదిలివేయడం పక్కా అని స్పష్టం చేశారు. పవన్ విషయంలో తన తండ్రిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పవన్ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

మా ఇద్దరి మధ్య చిచ్చు పెట్టాలని చూశారు: ముద్రగడ

క్రాంతి చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం స్పందించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ... 'నా కుమార్తె ప్రస్తుతం నా ప్రాపర్టీ కాదు. పెళ్లి కాక ముందు ఆమె నా ప్రాపర్టీ. ఇప్పుడు పెళ్లయింది కాబట్టి అత్తవారి ప్రాపర్టీ. నా కూతురు చేత కావాలనే వీడియో రిలీజ్ చేయించారు. అటువంటి వాటికి భయపడను' అన్నారు. ఎవరు బెదిరించినా భయపడిపోనని, జగన్‌కు సేవకుడిగా ఉంటానని స్పష్టం చేశారు. వైసీపీలో చేరాను, ఇక పక్కచూపులు చూసే ప్రసక్తి లేదన్నారు. తనకూ, తన కుమార్తెకు మధ్య చిచ్చుపెట్టాలని చూశారని ఆరోపించారు. ఇటువంటి వాటికి బెదరనని, తన మార్గంలో తాను వెళ్తానని స్పష్టం చేశారు.

ఆ చట్టం రైతులకు ఉరితాడే!

మేమొచ్చాక ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు.. రెండో సంతకం దానిపైనే

- ఇళ్లకు వెళ్లి పింఛన్ ఎందుకు ఇవ్వరు?
- లబ్ధిదారుల చావులు ప్రభుత్వ హత్యలే
- పొదిలి, నెల్లూరు సభల్లో చంద్రబాబు



నెల్లూరులో నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

ఒంగోలు/నెల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులకు ఎలాంటి రక్షణా ఉండదని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. దాని ద్వారా ఈ సీఎం ప్రజల భూమిని ఇతరులకు తాకట్టు పెడతాడని.. అమ్మేస్తాడని ధ్వజమెత్తారు. ఈ చట్టం రైతుల మెడకు ఉరితాడు వంటిదని.. తక్షణం దానిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రద్దుచేస్తామన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీపైన, రెండో సంతకం టైటిలింగ్ చట్టం రద్దుపైనే పెడతానని స్పష్టం చేశారు. ప్రజాగళంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం పొదిలిలో, జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలిసి రాత్రికి నెల్లూరులో నిర్వహించిన జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. 'మనకు అమ్మానాన్నలు ఇచ్చిన ఆస్తుల మీద, మనం కష్టపడి సంపాదించుకున్న ఆస్తుల మీద ఈ జగన్ బొమ్మ వేసుకోవడం దేనికి సంకేతమో ప్రజలు ఆలోచించాలి. భవిష్యత్‌లో మన భూములు మనం అమ్ముకోవాలన్నా, కొనాలన్నా జగన్ అనుమతి తీసుకోవలసిన పరిస్థితి వస్తుంది. ఆ విధంగా జగన్ ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తయారు చేశాడు. భవిష్యత్‌లో 10 (1), అడంగల్, పాసు పుస్తకాలు ఏమీ ఉండవు. కార్డులు మొత్తం ఆన్‌లైన్‌లోనే ఉంటాయి. వీటిని కొనాలన్నా, అమ్మాలన్నా జగన్ అనుమతి కావాలి' అని తెలిపారు. ఈ ఫొటోల పిచ్చోడు చివరకు జనం ముఖాలపై కూడా తన బొమ్మ వేయాలంటాడేమోనని ఎద్దేవా చేశారు. సామాజిక పెన్షన్లు తీసుకునే వృద్ధులు మండుటెండల్లో అల్లాడుతుండడంపై ఆవేదన వ్యక్తంచేశారు. ఒకసారి సచివాలయాలు, ఇంకొకసారి బ్యాంకుల చుట్టూ తిప్పుతూ వారిని అవస్థలు పెడుతున్నారన్నారని ఆక్షేపించారు. అనేక మంది వృద్ధులు ఎండల్లో తిరగలేక చనిపోతున్నారని, అవన్నీ ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా 1వ తేదీన ఇళ్ల వద్దే రూ.4వేల పింఛన్ అందజేస్తామన్నారు.

జగన్ మళ్లీ వస్తే మన భూములన్నీ దోపిడీ

- ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు అందుకే: పవన్



ఏలూరు/ కైకలూరు/ఒంగోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులన్నీ గాల్లోనే ఉంటాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో మన భూములు, ఆస్తులను ఈ సీఎం దోచుకుపోతారని హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఏలూరు జిల్లా కైకలూరు, ప్రకాశం జిల్లా గిద్దలూరుల్లో జరిగిన వారాహి విజయయాత్ర సభల్లో ప్రసంగించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి రాత్రి నెల్లూరులో ఉమ్మడి బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సీఎం అబద్ధాలకోరని.. మద్యనిషేధం అంటూ మద్యం తానే అమ్మాడని ధ్వజమెత్తారు. వైసీపీ కోటలు బద్దలు కొడతామని పవన్ ఆయా సందర్భాల్లో తేల్చిచెప్పారు. అది ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదని.. జగన్ గ్రాబింగ్ యాక్టు అని.. దీని ద్వారా రాష్ట్రంలో సాగులో లేని భూములన్నీ ఆక్రమణలకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన భూముల పట్టాదార్ పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలు ఎలా వేసుకుంటారని ప్రశ్నించారు. సర్వే రాళ్లపై ఈయన ఫొటోలెందుకని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మెగా డీఎస్సీని ప్రకటిస్తామన్నారు. వెలిగొండ సొరంగాలను ప్రారంభించకుండా మోసం చేసిన జగన్‌కు ప్రకాశం జిల్లా ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపిచ్చారు. నెల్లూరుతో ఉన్న తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నెల్లూరు తనకు చాలా ఇచ్చిందని.. ఎంతంటే.. ఒక గూండాకు వ్యతిరేకంగా ప్రజల కోసం పోరాడేంత శక్తి ఇచ్చిందని చెప్పారు. భవానీ బుక్ స్టాల్‌లో చదువుకున్న పుస్తకాలే తనకు జ్ఞానాన్ని, సమాజం పట్ల బాధ్యతను తెలియజేశాయన్నారు.



ఎర్రబల్లెకొత్తపల్లెలో తమకు ఇంటి పట్టా ఇచ్చి తిరిగి తీసేసుకున్నారని భారతికి చెబుతున్న సావిత్రమ్మ

మీకు ఓటు వేయం!

- ఇంటి పట్టా ఇచ్చినట్టే ఇచ్చి లాగేసుకున్నారు
- పులివెందులలో ఏపీ సీఎం జగన్ సతీమణి భారతికి తేల్చి చెప్పిన మహిళలు

కడప, మే 3(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రచారం చేస్తున్న ఏపీ సీఎం జగన్ సతీమణి భారతికి మహిళల నుంచి ఊహించని నిరసన ఎదురవుతోంది. శుక్రవారం పులివెందుల మండలంలోని ఎర్రబల్లెకొత్తపల్లెలో భారతి చేపట్టిన ప్రచారంలో అడుగడుగునా సమస్యలు స్వాగతం పలికాయి. పది ఇళ్ల ప్రచారం చేస్తే ఆరు ఇళ్లలోని మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఒకరిద్దరైతే.. ఏకంగా 'మీకు ఓటేయం' అని భారతికే తేల్చి చెప్పేశారు. "నాకు ఇంటి పట్టా ఇచ్చారు. ఇల్లు ఉందని మరలా పట్టా తీసేసుకున్నారు. మేం ఉండే ఇల్లు ఇదే. మాకెందుకు ఇంటి పట్టా ఇవ్వరు" అని సావిత్రి అనే మహిళ భారతిని ప్రశ్నించారు. దీంతో పక్కనే ఉన్న కొందరు నేతలు.. ఈసారి ఇల్లు ఇప్పిస్తామని సర్దిచెప్పే యత్నం చేశారు. అనంతరం, భారతి మరో ఇంటికి వెళ్లారు.. అక్కడ ఓ మహిళ మాట్లాడుతూ.. "మా ఇంట్లో ఐదు ఓట్లు ఉన్నాయి. మాకు పథకాలు రాలేదు. మీకు ఓటు వేయం" అని భారతికి తేల్చి చెప్పారు. మరికొందరు తాగునీటి సమస్య ఉందని, పింఛను రాయలేదని, ఇళ్లు లేవని సమస్యలను వివరించారు. దీంతో భారతి అవాక్కయ్యారు.

'స్మార్ట్' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FqyANIY లో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XmrIV0Iలో చదవండి.

'ట్యాపింగ్'ను కేటీఆర్‌కు అంటగడుతున్నారు

ఆధారాల్లేకున్నా పలు చానళ్లలో ప్రసారాలు

- అలా చేయకుండా అడ్డుకోండి
- హైకోర్టులో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పిటిషన్
- కేటీఆర్‌కు పరువు నష్టమైతే ఆయనే పిటిషన్ వేయాలి?
- కోడ్ అమల్లో ఉంది.. ఈసీని ప్రతివాదిగా చేర్చలేదేం?
- కోడ్ అమలుపై కేంద్రాన్ని ఎలా ఆదేశిస్తాం?: హైకోర్టు

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆధారాల్లేని అంశాలను, దర్యాప్తులో ఉన్న కేసులను తమ పార్టీ నేత కేటీఆర్ సహా ఇతర నాయకులకు అంటగట్టేలా సోషల్‌మీడియా, ప్రధాన స్రవంతి మీడియాలో ప్రసారాలు చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌రెడ్డి హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. అలా ప్రసారం చేస్తున్న మీడియా సంస్థలను, సామాజిక మాధ్యమ చానెళ్లను అడ్డుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌లో కేంద్ర ఎలక్ట్రానిక్స్-ఐటీ, సమాచార-ప్రసార శాఖలను, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఎన్టీవీ, బిగ్ టీవీ సహా పలు మీడియా, యూట్యూబ్ చానెళ్లను ప్రతివాదులుగా చేర్చారు. వీటితో పాటు గూగుల్, యూట్యూబ్‌లను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫోన్‌ట్యాపింగ్ కేసును కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులకు అంటగట్టే విధంగా పలు మీడియా సంస్థలు ప్రసారాలు చేస్తున్నాయని, ఎలాంటి ఆధారాల్లేకుండా ఈ ప్రసారాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ఐటీ శాఖ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్-2021కు విరుద్ధంగా రెచ్చగొట్టేలా, పరువునష్టం కలిగించేలా ఆయా చానెళ్లు ఇష్టానుసారంగా ప్రసారాలు కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్న ఈ ప్రసారాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. సదరు వీడియోలను తొలగించేలా గూగుల్, యూట్యూబ్‌లను ఆదేశించాలంటూ ఏప్రిల్ 25నే కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని హైకోర్టుకు తెలిపారు. అయినప్పటికీ కేంద్రం యూట్యూబ్, గూగుల్‌కు ఎలాంటి ఆదేశాలు జారీచేయలేదని, చర్యలు తీసుకోలేదని మయూర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. "పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పరువునష్టం కలుగుతోందని అంటున్నారు. అలాంటప్పుడు ఆయనే నేరుగా పిటిషన్ వేయవచ్చు కదా.. ఆయన తరఫున బీఆర్ఎస్ పార్టీ పిటిషన్ వేయడం ఏంటి? ఎవరికి నష్టం జరిగిందనుకుంటున్నారో వారే పిటిషన్ వేయాలి. అలాగే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల సమయంలో అన్ని శాఖలు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు లోబడి ఉంటాయి. మీరు ఎలక్షన్ కమిషన్‌ను ఎందుకు పార్టీగా చేర్చలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని ఈసీకి కాకుండా కేంద్ర ఐటీ, ప్రసార శాఖలకు ఎలా ఆదేశాలు ఇవ్వాలి" అంటూ పలు ప్రశ్నలు సంధించింది. పిటిషనర్ చేసిన విజ్ఞప్తిపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. అలాగే ప్రైవేటు ప్రతివాదులకు వ్యక్తిగత నోటీసులు పంపేందుకు పిటిషనర్ పార్టీకి అనుమతి ఇచ్చింది. తదుపరి విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. కాగా, ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని తమ పార్టీ నాయకులకు అంటగట్టేలా బీజేపీ, కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యలు చేయకుండా అడ్డుకోవాలని, ఈ మేరకు ఈసీకి ఆదేశాలు జారీచేయాలని ఇప్పటికే బీఆర్ఎస్ ఒక పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై నిర్ణయం తీసుకుంటామని ఈసీ వివరణ ఇవ్వడంతో చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సదరు పిటిషన్‌లో వాదనలు ముగించింది.

ప్రభాకర్‌రావుపై రెడ్ కార్నర్ నోటీసు!

- నాంపల్లి కోర్టులో పోలీసుల పిటిషన్



హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగు చూసినప్పటి నుంచి పరారీలో ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ఎలాగైన అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయడానికి అనుమతి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 73 కింద అరెస్టు వారంట్ జారీ చేయాలని కోరారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నాడని పోలీసులు న్యాయస్థానానికి తెలిపారు. అరెస్టుకు నాంపల్లి కోర్టు అనుమతిచ్చిన తర్వాత ప్రభాకర్‌రావుపై విచారణాధికారులు రెడ్ కార్నర్ నోటీసులు జారీచేస్తారు. ఈ నోటీసులు జారీ అయితే విదేశీ దర్యాప్తు సంస్థల సహకారంతో ప్రభాకర్‌రావును అరెస్టు చేయించి స్వదేశానికి రప్పించవచ్చు. కాగా, పరారీలో ఉన్న ప్రభాకర్‌రావు ఏ ఎయిర్‌పోర్టులో కనిపించినా అరెస్టు చేసేలా ఇప్పటికే ఆయనపై లుకౌట్ నోటీసులు ఉన్నాయి.

మధ్యప్రదేశ్‌కే ఎందుకు?

- ఓటుకు నోటు కేసు బదిలీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రశ్న
- న్యాయవాదుల తీరుపై ధర్మాసనం అసహనం



న్యూఢిల్లీ, మే 3(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉండగా మధ్యప్రదేశ్‌కే కేసును ఎందుకు బదిలీ చేయాలని కోరుతున్నారని ఓటుకు నోటు కేసు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇలా ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని అడిగింది. కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, మహబూబ్ అలీ, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో పిటిషన్ వేశారు. దీనిని శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీష్‌చంద్రశర్మ, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, దామ శేషాద్రినాయుడు, మోహిత్ రావు హాజరయ్యారు. ప్రతివాదులైన తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి, ఇతరుల పక్షాన సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ లూథ్రా, మేనకాగురుస్వామి, తెలంగాణ స్టాండింగ్ కౌన్సిల్ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. శుక్రవారం రిజిస్ట్రార్ కోర్టులో విచారణ జరగాల్సి ఉన్నదని, పిటిషనర్లు ఉద్దేశపూర్వకంగానే రెగ్యులర్ బెంచ్ ముందు మెన్షన్ చేశారని ముకుల్ రోహిత్గి, మేనక అభ్యంతరం తెలిపారు. రాజకీయ ప్రమేయం ఉన్న ఈ కేసును ఉద్దేశ పూర్వకంగానే కోర్టు ముందుకు తెచ్చారని వాదించారు. ఈ వాదనలపై సిద్ధార్థదవే అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, తొలుత తాము మధ్యప్రదేశ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేయాలని కోరామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు బదులిచ్చారు. అయితే, ఏదైనా ఒక రాష్ట్రాన్నే కోరాలని రిజిస్ట్రార్ తెలిపారని ధర్మాసనానికి స్పష్టం చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం విచారణను జూలైకు వాయిదా వేసింది. వేసవి సెలవుల అనంతరం తొలి మాసంలో విచారణను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. కాగా, ఓటుకు నోటు కేసును బదిలీ పిటిషన్‌పై ఇరు పక్షాల న్యాయవాదులు తీవ్రస్థాయిలో వాదనలు వినిపించారు. ఈక్రమంలో ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ దవే ఒకరి వాదనలకు మరొకరు అడ్డుపడే ప్రయత్నం చేశారు. పిటిషనర్ కాబట్టి తమకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలంటూ దవే తన వాదనలు కొనసాగించారు. ఇదే సమయంలో సిద్ధార్థ లూథ్రా ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించారు. ఈ క్రమంలో జస్టిస్ బీఆర్ గవాయ్ అసహనం వ్యక్తం చేశారు. 'నాకు పలు హైకోర్టుల్లో పనిచేసిన అనుభవం ఉంది. ఇలాంటి క్రమశిక్షణా రాహిత్యాన్ని నేనెప్పుడూ చూడలేదు. సీనియర్ న్యాయవాదుల ప్రవర్తన ధర్మాసనానికి కొత్తగా ఉంది. మీ వాదనలను నియంత్రించడం క్లిష్టంగా ఉంది" అని అన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

దాసరి వ్యక్తి కాదు వ్యవస్థ

- నేడు దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి
- డైరెక్టర్స్ డేగా పాటిస్తున్న తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం



సినిమా అనేది ఒక కళ. ఈ రంగంలో రాణించాలంటే ముందుగా అవకాశాలు రావాలి. కానీ అతి సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారికి అవకాశాలు దొరకడం చాలా కష్టం. అయినా మనిషికి సంకల్పం ఉంటే అదేమీ అసాధ్యం కాదని తెలుగు సినీ రంగంలో అనేక మంది నిరూపించారు. అలాంటి వారిలో అగ్రగణ్యులు, దర్శక దిగ్గజం, దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణ రావు. దర్శకుడిగా, రచయితగా, నిర్మాతగా, రాజకీయ నాయకుడిగా, పత్రికాధిపతిగా ఇలా అన్నింట్లోనూ తనదైన ముద్ర వేశారు.

జీవితంలో ఫలానా స్థాయిలో ఉండాలనీ, లేదంటే ఒక గోల్ పెట్టుకొని దాన్ని సాధించాలని గానీ దాసరి నారాయణరావు ఎప్పుడూ అనుకోలేదు. పదో ఏటనే ఆయనకు నాటకరంగంపై ఆసక్తి ఏర్పడింది. రంగస్థలంలో ఉద్యోగం చేయడానికి 60వ దశకంలోనే హైదరాబాద్‌లో అడుగుపెట్టిన ఆయన రవీంద్రభారతి, గాంధీభవన్‌లో నాటకాలు వేస్తుండేవారు. అక్కడ దాసరిని చూసిన వైవీ కృష్ణయ్య అనే దర్శకుడు తన సినిమాలో కమెడియన్ వేషం ఆఫర్ చేయగా, దానికి దాసరి ఇష్టపడలేదట. 'నేను స్టేజ్ డైరెక్టర్‌ను, రైటర్‌ను, గోల్డ్‌మెడలిస్టును ఈ పాత్ర ఎందుకు చేయాలి' అనుకున్నారట. కానీ ఆయన స్నేహితులు మాత్రం ఇది చాలా మంచి అవకాశం అన్నారట. చివరికి మద్రాసు, వాహినీ స్టూడియోలో అడుగుపెట్టిన తొలిరోజునే మేకప్ వేసుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇలా సినిమా రంగంలో ఎవరికీ జరగలేదని, తనకు మాత్రమే ఆ అవకాశం వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా వాళ్ల తండ్రి పిల్లలను బాగా చదివించారట. స్కూల్ అయిపోయిన తర్వాత తన ఖర్చుల కోసం అరటిపళ్లు అమ్మానని ఆయన చెప్పారు. అలా పేదరికం, ఆకలి తెలిసిన దాసరి తర్వాత సినిమా రంగంలో పనిచేసే కార్మికులు, చిన్న నటీనటుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. భారీ బడ్జెట్ సినిమాలు అవసరమే కానీ అదే సమయంలో చిన్న సినిమాలు బతికితే వాటి ద్వారా ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుందని చాలా సందర్భాల్లో చెప్పారు.

తెలుగు సినిమా అంటే రాంగోపాల్ వర్మకు ముందు తర్వాత అంటారు. అలాంటిది ఒక సందర్భంలో దాసరి, ఆయన దర్శకత్వం వహించిన 'శివరంజని' సినిమా లు దర్శకుడిగా తనను ఎంతగానో ప్రభావితం చేశాయని రామ్‌గోపాల్ వర్మ స్వయంగా చెప్పారు. ఆ సినిమాలో మోహన్‌బాబు, జయసుధ పాత్రలను మలిచిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. దాసరి గారి క్యారెక్టరైజేషన్స్ బాగా స్టడీ చేయడం వల్లే రియలిస్టిక్ పాత్రలను సృష్టించగలిగాను అని వర్మ చెప్పారు. అందుకే దాసరి అంటే వ్యక్తి కాదు వ్యవస్థ, సినిమా పాఠశాల.

చాలామంది సినీ నటులను దాసరి తయారుచేశారు. చాలా మంది టెక్నీషియన్స్ ఆయన స్కూల్‌నుంచి వచ్చారు. అందుకే హీరో, హీరోయిన్ల వల్లే సినిమా ఆడుతుందంటే ఆయన అంగీకరించలేదు. దర్శకులు, ప్రొడక్ట్ ప్రొడ్యూసర్, ఆ సినిమాకు పని చేసిన మొత్తం టీం వల్లే సినిమా విజయవంతం అవుతుందని అని అనేక సందర్భాల్లో కుండబద్దలు కొట్టారు. సినిమాలకు ఇచ్చే రాయితీలు లాంటివి చిన్న నిర్మాతలకు, చిన్న సినిమాకు ఎప్పటికీ అందుబాటులో ఉండాలనేవారు. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో చిన్న సినిమాలను ప్రోత్సహించడానికి రాయితీలు ఇస్తున్నారనీ, అలాంటి ప్రోత్సాహకాలు మన దగ్గర కూడా కావాలన్నారు. సినిమాకు కెప్టెన్ దర్శకుడే. సినిమాలోని పాత్రలు, సన్ని వేశాలు, పాటల చిత్రీకరణ, కామెడీ ఇలా అన్నీ దర్శకుడి విజన్ నుంచే పుట్టుకొస్తాయి. దర్శకుడికి ఉండే అభిరుచితోనే మంచి సాహిత్యం, సంగీతంతో పాటు విజువల్‌గానూ సినిమా బాగున్నదనే ప్రశంసలు వస్తాయి. దాని వెనుక దర్శకుడి కృషి ఎంతో ఉంటుంది. దర్శకుడు ఒక ప్రేక్షకుడిగా మారి, తన హీరో ఎలా ఉండాలి, తన సినిమాలో పాత్రలు ఎలా ఉంటే అవి ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయి అన్న అంశాలపై చాలా ఆలోచించి రాసుకొని, వాటిని చిత్రీకరిస్తాడు. అందుకే దర్శకత్వం అనేది చాలా బాధ్యతతో కూడుకున్న పని.

మనం ఇవాళ గొప్పగా చెప్పుకుంటున్న మలయాళ సినిమాల కంటే దశాబ్దాల ముందే దాసరి మధ్య తరగతి సినిమాను తీసుకొచ్చి తన మార్క్‌ను చూపెట్టారు. కమర్షియల్ సినిమాతో పాటు దాసరి నారాయణరావు అందించిన స్ఫూర్తితో చిన్న సినిమాలతో జాతీయ స్థాయిలో తెలుగు సినిమాకు మంచి కథలు రాసి, సినిమాలు చేయాలి. అదే దాసరి గారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

44 ఏళ్ల పాటు చిత్ర పరిశ్రమలో కొనసాగి ఎంతోమందికి సినీ జీవితాన్ని ప్రసాదించడంతో పాటు పరిశ్రమకు పెద్దదిక్కుగా కొనసాగిన దాసరి నారాయణరావు జయంతి (మే - 04)ని డైరెక్టర్స్‌డేగా తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం నిర్ణయించి, సెలబ్రేట్ చేస్తోంది.

● **కుమారస్వామి (అక్షర),** సెన్సార్ బోర్డ్ సభ్యులు

వర్క్ పూర్తి చేసిన అక్షయ్



డాక్టర్ మోహన్ బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి మేటి నటులతో రూపుదిద్దుకొంటున్న 'కన్నప్ప' చిత్రంలో విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం ఇటీవల వచ్చిన బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ తన సన్నివేశాలకు సంబంధించిన వర్క్ పూర్తి చేశారు. ఈ విషయాన్ని మంచు విష్ణు సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. 'అక్షయ్‌కుమార్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ ప్రయాణం ఎంతో విలువైంది' అని పేర్కొన్నారు విష్ణు. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది.

పడుచు గుండె చప్పుడు



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ మేనల్లుడు అశోక్ గల్లా నటిస్తున్న రెండో చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ఆధ్యాత్మిక అంశాలు కలిగిన ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం నుంచి 'ఏమయిందే' అంటూ సాగే లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. సురేశ్ గంగుల రాసిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. హీరోయిన్ పై హీరోకు ఉన్న ప్రేమను, పడుచు గుండె చప్పుడుని చాలా అందంగా, అద్భుతంగా ఈ పాటలో చూపించారు. రసూల్ ఎల్లోర్ విజువల్స్ పాటకు ప్రాణం పోశాయి. నల్లపనేని యామిని సమర్పణలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

పొలిటికల్ సెటైర్



ఓటర్లే వారి ఓటుకు ఓ రేటు నిర్ణయించేసుకుని రాజకీయ నాయకులను ముప్పుతిప్పలు పెట్టే కథాంశంతో రూపొందిన 'లక్ష్మీ కటాక్షం' చిత్రం ఈ నెల పదిన విడుదల కానుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల హోరు వినిపిస్తుంటే పొలిటికల్ సెటైరికల్‌గా రూపొందిన 'లక్ష్మీ కటాక్షం' చిత్రం ఆ ఎన్నికలకు సరిగ్గా మూడు రోజుల ముందు విడుదలవుతుండడం గమనార్హం. డ్రామా, హాస్యం కలగలసిన ఈ చిత్రంలో సాయికుమార్, వినయ్, అరుణ్, దీప్తి వర్మ, చరిష్మా శ్రీకర్, హరిప్రసాద్, సాయికిరణ్ ఏడిద తదితరులు నటించారు. యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కె.పురుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ సినిమాకు రచన, దర్శకత్వం: సూర్య.



అబ్ కీ బార్?

గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి రిటర్న్ గిఫ్ట్ ఇద్దాం!: సీఎం రేవంత్



గడిచిన పదేళ్లుగా తెలంగాణ ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి ఢిల్లీ దర్బారుకు పన్నులు, జీఎస్టీ కట్టి అలిసి పోయారని, కానీ ఢిల్లీ దర్బారు తిరిగి తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మనకు గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి.. లోక్‌సభ ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇద్దామంటూ ఆయన పిలుపునిచ్చారు. ఎక్స్ వేదికగా గాడిద గుడ్డు సిరీస్‌లో మరో వీడియోను ఆయన పోస్ట్ చేశారు.

రేవంత్‌ను సిద్దిపేటకు నేనే ఆహ్వానిస్తా

- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే సన్మానిస్తా
- బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్‌ఫిక్సింగ్
- చెరో 8 ఎంపీ సీట్లు పంచుకున్నారు: హరీశ్‌రావు



సిద్దిపేట/అక్కన్నపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టులోగా ఆరు గ్యారెంటీలతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే సిద్దిపేటకు సీఎం రేవంత్‌రెడ్డిని తానే స్వయంగా ఆహ్వానిస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. ఆయనకు స్వాగతం పలికి శాలువా కప్పుతానన్నారు. అలాగే స్పీకర్‌కు తన రాజీనామా పత్రం సమర్పించి మరోసారి ఎన్నికల్లో పోటీ చేయబోనని తెలిపారు. ఒకవేళ మాట నిలబెట్టుకోకుంటే తన పదవికి రాజీనామా చేసి కొడంగల్ చౌరస్తాలో ముక్కు నేలకు రాస్తారా అంటూ రేవంత్‌కు సవాల్ విసిరారు. శుక్రవారం హరీశ్‌రావు సిద్దిపేటలోని తన నివాసంలో విలేకరులతో, హుస్నాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి అక్కన్నపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లోనూ మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని ఆరోపించారు. చెరో 8 ఎంపీ సీట్లు గెల్చుకునేలా ఒప్పందం చేసుకున్నాయని, ఒకరి కోసం ఒకరు డమ్మీ అభ్యర్థులను నిలబెట్టాయన్నారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు, నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే వీరి అక్రమ బంధానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు అనూహ్యమైన స్పందన రావడంతో ఆయన ప్రచారాన్ని అడ్డుకోవడానికి బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్రపన్నాయని ఆరోపించారు. రేవంత్ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, రాష్ట్రంలో భూముల ధరలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పైగా కొత్త జిల్లాలను రద్దు చేసే కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సిద్దిపేటలో అభివృద్ధి జరగలేదని ఇదే గడ్డపై మాట్లాడడంతో ప్రజలు నవ్వుకున్నారన్నారు. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధాని చేయడానికి తన గురువు మాజీ సీఎం చంద్రబాబుతో కలిసి శిష్యుడు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. వాళ్ల ఆటలు సాగకూడదనుకుంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

వెలిచాల రాజేందర్‌రావుపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మే 3: కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై కరీంనగర్ రెండో ఠాణాలో ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లంఘన కింద శుక్రవారం కేసు నమోదైంది. రాజేందర్‌రావు సోషల్ మీడియా ఖాతా నుంచి కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ అనని మాటలు అన్నట్లుగా ఫేక్ వీడియో, కాల్‌రికార్డులు సృష్టించి పోస్ట్ చేశారని బీజేపీ నాయకుడు కొట్టె మురళీకృష్ణ రెండు రోజుల క్రితం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎంసీసీ 171 ఎఫ్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో ఆదిలాబాద్ నేతల చేరిక నిలిపివేత

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో ఆదిలాబాద్ జిల్లా నేతల చేరికను తాత్కాలికంగా నిలిపేసినట్లు చేరికల కమిటీ సభ్యుడు, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వెల్లడించారు. ఆదిలాబాద్ డీసీసీ మాజీ అధ్యక్షుడు సాజిత్‌ఖాన్, ఆ జిల్లా నేతలు గండ్రత్ సుజాత, సంజీవరెడ్డి ఇటీవల గాంధీభవన్‌లో చేరికల కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, కోదండరెడ్డిల సమక్షంలో చేరారు. అయితే అనివార్య కారణాలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సూచనల మేరకు వారి చేరికను తాత్కాలికంగా నిలిపివేసినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో జగ్గారెడ్డి వెల్లడించారు.

ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదు


- తీర్పు వెలువరించిన హైకోర్టు



ఆదిలాబాద్/ హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌కు మరోభారీ షాక్ తగిలింది. 2022లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన దండె విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు శుక్రవారం తీర్పును వెలువరించింది. అప్పట్లో నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై ఫోర్జరీ సంతకాలు చేసి, తనను ఎన్నికల బరి నుంచి తప్పుకొనేలా కుట్ర పన్నారంటూ దండె విఠల్‌పై ప్రత్యర్థి అయిన నిర్మల్ జిల్లా సారంగపూర్ జడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టులో కేసు పెట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది బీ మంధని వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు సంబంధించిన ప్రతిపాదకుల్లో ఒకరిగా ఉన్న దస్తురాబాద్ ఎంపీపీ కిషన్ సింగారి...రాజేశ్వరరెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి.. ఉపసంహరణ పత్రం దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఆ సంతకం రాజేశ్వర్ రెడ్డిది కాదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో తేలిందని తెలిపారు. దాంతో చట్టబద్ధమైన ప్రొసీజర్‌ను అధికారులు అనుసరించలేదని రుజువడంతో ఎన్నిక చెల్లదని హైకోర్టు ప్రకటించింది. ఈ స్థానానికి తాజాగా ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. ఖర్చుల నిమిత్తం పిటిషనర్‌కు రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని పేర్కొంది. అప్పీలు చేయడానికి వీలుగా తీర్పు అమలను నాలుగువారాలపాటు సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే దండే విఠల్ పదవీ కాలం రెండేళ్లు పూర్తయింది. మరో నాలుగేళ్ల పాటు పదవీ కాలం ఉంది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని విఠల్ తెలిపారు. మరో అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ సరిగ్గా జరగలేదన్న కారణంతో హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. అప్పీలుకు వెళ్లేందుకు నాలుగు వారాల గడువు ఉందని చెప్పారు. తనకు సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని అభిప్రాయపడ్డారు.

అమిత్‌షా సహా నలుగురిపై కేసు

- మొఘల్‌పురా పోలీస్ స్టేషన్‌లో నమోదు
- చిన్న పిల్లలతో ప్రచారం చేయించారంటూ ఈసీకి కాంగ్రెస్ సీనియర్ నేత నిరంజన్ ఫిర్యాదు



చార్మినార్ మే 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారన్న ఫిర్యాదు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై మొగల్‌పురా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయనతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత, ఎమ్మెల్యే రాజాసింగ్, మరో నేత యమాన్‌సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 1వ తేదీన అమిత్‌షా నగరంలో పర్యటించారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత తరపున పాతబస్తీలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా లాల్ దర్వాజాలోని మహంకాళి దేవాలయంలో పూజల అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. సుధా టాకీస్ సమీపంలో నాయకులతో కలిసి వేదికపై నుంచి ప్రసంగించారు. మాధవీలత మాట్లాడుతున్న సందర్భంలో కొంతమంది చిన్నారులను వేదికపైకి ఎక్కించారు. వారి చేతిలో బీజేపీ ఎన్నికల చిహ్నమైన కమలం పువ్వు ఉండగా, మరొకరి చేతిలో అబ్ కీ బార్ 400 సీట్లు అని రాసి ఉన్న ప్లకార్డు ఉంది. అయితే, చిన్నారులతో ఎన్నికల ప్రచారం నిర్వహించడం ఎన్నికల నిబంధధనలకు విరుద్ధమంటూ కాంగ్రెస్ సీనియర్ నేత నిరంజన్ బుధవారం సాయంత్రం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ.. జరిగిన సంఘటనపై విచారణ జరిపించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించింది. సీపీ ఆదేశాలతో సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా విచారణ చేసి, కేసు నమోదు చేయాలని మొఘల్‌పురా పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఐపీసీ 188 కింద సభ నిర్వాహకులతోపాటు పాల్గొన్న నేతలపైనా కేసు నమోదు చేశారు.ఏ-1గా యమాన్ సింగ్, ఏ-2గా మాధవీలత, ఏ-3గా అమిత్‌షా, ఏ-4గా కిషన్‌రెడ్డి, ఏ-5గా రాజాసింగ్‌ను చేర్చారు.

మోదీ షాలను ఓడిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వరు. ప్రాజెక్టులు ఇవ్వరు. మంజూరైన ప్రాజెక్టులను కూడా రద్దు చేస్తారు. గుజరాత్‌లో ఉన్నోళ్లే మనుషులా? తెలంగాణలో ఉన్నోళ్లు మనుషులు కారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలపై బీజేపీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని, రాష్ట్రానికి పెద్ద గాడిద గుడ్డు తప్ప ఏమీ ఇవ్వలేదని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోటీ పడుతున్నది కొత్త వాళ్లేమీ కాదని, గతంలో ఎంపీలుగా పని చేసిన వినోద్‌రావు, బండి సంజయ్‌లని.. ఒకరు అపర మేధావి కాగా, మరొకరు అరగుండు మేధావి అని రేవంత్ పేర్కొన్నారు. పదేళ్ల వీరి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని, తెలంగాణకు అవి చేసిన ద్రోహాన్ని చూశామని, రాష్ట్రాన్ని ఎలా దోచుకున్నారో చూశామని తెలిపారు. తెలంగాణకు హక్కులు, నిధులు ఇవ్వకపోగా నరేంద్రమోదీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో.. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను తప్పు పట్టి అవమానించారని రేవంత్ ఆరోపించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని, పార్లమెంట్ తలుపులు మూసి తెలంగాణ బిల్లు అమోదించారని మోదీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటునే అవమానించిన బీజేపీ పార్టీకి చెందిన బండి సంజయ్, అరవింద్‌లకు తెలంగాణ రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు ఉందా అని ప్రశ్నించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఉద్దేశించి.. కోనసీమ నుంచి చిత్రసీమ వరకు ప్రపంచంలో అన్నింటి గురించీ మాట్లాడే ట్విట్టర్ టిల్లును ఒకటే అడుగుతున్నానని.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు రద్దు చేసి రాజ్యాంగాన్ని మార్చడానికి నరేంద్రమోదీ బీజేపీ కుట్ర చేస్తుంటే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కేటీఆర్‌ను అసెంబ్లీలో అడుగు పెట్టనివ్వనని, ఆయనను ఓడిస్తామని ప్రకటించారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే విషయంలో కేసీఆర్, నరేంద్రమోదీలది ఒకే విధానమన్నారు. 2022 ఫిబ్రవరిలో కేసీఆర్ రాజ్యాంగాన్ని మార్చి కొత్త రాజ్యాంగాన్ని రాసుకోవాలని చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ బస్సు యాత్ర చేస్తుంటే కొడుకు కేటీఆర్ కారు కరాబు అయ్యిందని అంటున్నాడని, షెడ్డుకు పోయిన కారు తిరిగిరాదని, తూకానికి అమ్మాల్సిందేనన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఒకటి రెండు సీట్లు గెలిస్తే మోదీకి అమ్మే ఆలోచన కేసీఆర్ చేస్తున్నాడని ఆరోపించారు. రెండు పార్టీలు చీకటి ఒప్పందాలు చేసుకొని కాంగ్రెస్ గెలిచే చోట కుట్రలు చేస్తున్నాయన్నారు. బిడ్డ బెయిల్ కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ సుల్తానుల వద్ద తాకట్టు పెడతారా అని నిలదీశారు. బీఆర్ఎస్



సిరిసిల్లలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వం రూ.40 వేల కోట్లు అప్పు మిగిల్చి పోయిందని, వాటిని చెల్లించలేక చస్తున్నానని.. సిరిసిల్ల నేత కార్మికులకు కూడా రూ.275 కోట్లు ఉద్దెర పెట్టారని తెలిపారు. నాటి తాగుబోతుల సంసారంలో ఉద్దెరలు, బకాయిలతోనే సరిపోయిందని అన్నారు. నేతన్నలకు రూ 50 కోట్లు చెల్లించామని, ఎన్నికల తరువాత విగతా బకాయిలు చెల్లిస్తామని చెప్పారు.

పెద్దపల్లికి గొప్ప చరిత్ర

పెద్దపల్లి నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉందని, ఈ నియోజకవర్గం పరిధిలోని మంథనికి ప్రాతినిధ్యం వహించిన పీవీ నరసింహారావు దేశానికి ప్రధాని అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఇవాళ దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నారని, అందుకు పునాదులు వేసింది పీవీనేనని చెప్పారు. ఇదే ప్రాంతానికి చెందిన దివంగత నేత శ్రీపాదరావు స్పీకర్ పదవికే వన్నె తెచ్చారన్నారు. పెద్దపల్లికి ప్రాతినిధ్యం వహించిన కాకా వెంకటస్వామి 1990లో సింగరేణి దెబ్బతినకుండా ఉండేందుకు కేంద్రం నుంచి రూ.వెయ్యి కోట్లు తీసుకొచ్చి ఆ సంస్థను కాపాడి అనేక కుటుంబాలకు ఉపాధి కల్పించారని అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు కృషి చేశారని కొనియాడారు. 'ఏ దిక్కు లేక అక్క మొగుడే దిక్కు' అన్నట్లు బీఆర్ఎస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి ప్రజలు ఓడించిన కొప్పుల ఈశ్వర్‌కే టికెట్ ఇచ్చిందని సీఎం ఎద్దేవా చేశారు. ఆయన 25 ఏళ్ల నుంచి ఈ ప్రాంతానికి చేసిందేమి లేదని, ప్రధాని మోదీ సింగరేణి గనులను ప్రైవేట్‌పరం చేస్తుంటే మౌనంగా ఉన్నాడని, ఆయనకు, బీఆర్ఎస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదని విమర్శించారు. 'బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పాము.. మొన్నటి ఎన్నికల్లో తోక మీద, నడుం మీద కొట్టారు.. ఇప్పుడు పడగ మీద కొట్టాలి.. శాశ్వతంగా కాల నాగు పీడ విరగడవుతుంది' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

400 సీట్లు ఎందుకు అడుగుతున్నారంటే..

బీజేపీ నేతలు చెప్పేవన్నీ అబద్ధాలేనని, అందులో పోటీ పెడితే వారిని ఎవరూ తట్టుకోలేరని, అదొక పెద్ద యూనివర్సిటీ అని విమర్శించారు. పదేళ్లలో మోదీ రాష్ట్రానికి చేసేందేమి లేదని సీఎం తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని కాలగర్భంలో కలిపారని, కాజీపేట ఉక్కు కర్మాగారాన్ని లాథూర్‌కు తరలించారని, రామగుండం ఎన్టీపీసీలో 4 వేల మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాల్సి ఉండగా 1600 మెగావాట్ల ప్లాంట్‌ను మాత్రమే నిర్మించారని, ఐఐటీ, ఐటీఐఆర్.. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత ఉంటుందని విమర్శించారు. తెలంగాణకు ఇవ్వకుండా గుజరాత్‌కు లక్షల కోట్లు దండుకుపోయారని మండిపడ్డారు. ఈసారి మళ్లీ అధికారం కావాలని మోదీ అడుగుత లేరని, 400 సీట్లు కావాలని అడుగుతున్నారని, దీంతో ప్రమాదం పొంచి ఉందని, అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. 2/3వ వంతు మెజారిటీతో మొత్తం రిజర్వేషన్లనే రద్దు చేయాలని చూస్తున్నదని అన్నారు. మోదీ, అమిత్‌షాలను మనువాద సిద్ధాంతం ఆవహించిందని, బీజేపీకి వేసే ఓటు, రిజర్వేషన్ల రద్దుకు వేసే ఓటనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. జనాభా లెక్కలు చేపడితే కులగణన కూడా జరపాల్సి వస్తుందని ప్రధాని మోదీ జనాభా లెక్కలనే నిర్వహించటం లేదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఉండాలన్నా, ఉన్నవి పెరగాలన్నా రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని వాడొకడు వీడొకడు అంటున్నడు. ఈ ప్రభుత్వం వైపు చూస్తే లాగుల్లో తొండలు వేసి కొడతారు ప్రజలు. ఇంచు కూడా కదలించలేరు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉంటుంది. ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన కొనసాగుతుంది. ఇచ్చిన గ్యారంటీ పథకాలు అమలవుతాయి' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా, జన జాతర సభలను మధ్యాహ్నమే ఏర్పాటు చేసినప్పటికీ సీఎం రేవంత్ మూడు నాలుగు గంటల ఆలస్యంగా చేరుకోవటంతో జనం వేచి చూస్తూ ఉండిపోయారు. పలువురు వెళ్లిపోవటం కనిపించింది.

ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదు

- విద్యుత్ అంతరాయం లేకున్నా ఉన్నట్లు నాటకాలు
- గతంలో కంటే ఎక్కువ విద్యుత్ సరఫరా
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్‌కు బుద్ధిరాలేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నా.. కరెంట్ కట్ అయిందంటూ బీఆర్ఎస్ నేతలు నాటకాలు చేస్తున్నారని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. గతంలో సూర్యాపేటలో, మొన్న మహబూబ్‌నగర్‌లో కరెంట్ పోయిందని కేసీఆర్ లేనిపోని అబద్ధాలు ప్రచారం చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో అంతరాయం తలెత్తినా వెంటనే విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరిస్తున్నారని గుర్తు చేశారు. ఎక్కడైనా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే... వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటున్నామని, వాటిని కూడా బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తూ తప్పుపడుతున్నారని ఆరోపించారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఇప్పటి దాకా రాష్ట్రమంతటా గత ప్రభుత్వం ఇచ్చిన దాని కంటే ఎక్కువ విద్యుత్తును సరఫరా చేశామని వివరించారు. 2022 డిసెంబరు నుంచి 2023 ఏప్రిల్ వరకు మొత్తం 36,207 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేయగా... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు నుంచి 2024 ఏప్రిల్ 30 దాకా 38, 155 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అందించామని తెలిపారు. ఒకే రోజున గరిష్ఠంగా 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ నెలకొన్నా... విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర తమ ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. గత ఏడాది ఏప్రిల్ 24 నుంచి ఏప్రిల్ 30 వరకు గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 1369 సార్లు 11 కేవీ లైన్ ట్రిప్పింగ్‌లు అయ్యాయని, మొత్తం 580 గంటలు కరెంట్ సరఫరాలో అంతరాయం వాటిల్లిందని చెప్పారు. ఈ ఏడాది అదే వారంలో కేవలం 272 చోట్ల 11 కేవీ విద్యుత్తు సరఫరా ట్రిప్పు అయిందని, కేవలం 89 గంటలు మాత్రమే కరెంట్ సరఫరాలో అంతరాయం వాటిల్లిందని వివరించారు. జీహెచ్ఎంసీ పరిధిలో విద్యుత్తు అంతరాయానికి సంబంధించి ఎక్కడ ఫిర్యాదు వచ్చినా వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా 226 స్పెషల్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

మొన్ననే పెళ్లాయె.. సంసారం సర్దుకోవాలిగా!

- కాంగ్రెస్ పాలనలో హామీల అమలుపై జగ్గారెడ్డి వ్యాఖ్య
- ప్రజలు కోరుకున్నట్టే కాంగ్రెస్ పాలన ఉంటుందని వెల్లడి

నర్సాపూర్/సంగారెడ్డి, మే 3 (ఆంధ్రజ్యోతి): "మొన్ననే పెళ్లాయె.. సంసారం సర్దుకోవాలి కదా".. అని కాంగ్రెస్ పాలనలో హామీల అమలు తీరుపై మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సరదాగా వాఖ్యానించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీ, రోడ్డుషోలో జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ సమస్యలను జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ.. మొన్ననే కదా పెళ్లయింది.. అప్పుడే పిల్లలంటే ఎలా? సంసారం సర్దుకోవాలి కదా.. అంటూ సరదాగా చేసిన వ్యాఖ్యలు నవ్వులు పంచాయి. కాంగ్రెస్ మాట ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పదని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కోరుకున్నట్టుగానే కాంగ్రెస్ పాలన ఉంటుందని, నిరుత్సాహపడవద్దన్నారు. అనంతరం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు హామీల్లో ఇప్పటికే ఐదింటిని అమలు చేస్తున్నామని చెప్పారు. వంద రోజుల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200యూనిట్ల మేర ఉచిత విద్యుత్తుతో పాటు ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచామన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను నంబర్ వన్‌గా నిలపాలని ప్రజలను కోరారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్‌కు 20 వేల ఓట్ల మెజార్టీ ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి పనులన్నీ జరుగుతాయన్నారు. స్థానిక నేతలు చెబుతున్నట్లుగా 50వేల ఓట్ల మెజార్టీ ఇస్తే నియోజకవర్గానికి ఏం కావాలో తానే దగ్గరుండి చేయిస్తానని హామీ ఇచ్చారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారని, కాంగ్రెస్ పాలనలో అందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. దళిత, గిరిజన కుటుంబాలకు రూ. 6లక్షలతో, ఇతరులకు రూ.5 లక్షలతో ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. వడ్డీలేని రుణాలను అందించి పేదలను ఆర్థికంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.



నర్సాపూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో జగ్గారెడ్డి

మా సర్కార్‌ను కూలగొట్టే కుట్ర

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం.. పార్టీ, ప్రభుత్వం బలోపేతం: తుమ్మల

- కాంగ్రెస్‌లోకి 20మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటూ రాదు: ఉత్తమ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌ను కూలగొట్టేందుకు ఆ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆరోపించారు. అందుకే ఇటు పార్టీని, అటు ప్రభుత్వాన్ని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. బీజేపీ, బీఆర్ఎస్... కన్నెత్తి చూసేందుకూ సాహసించని విధంగా తమ వ్యూహాలు ఉంటాయని తెలిపారు. రెండు, మూడు నెలల్లోనే కాగ్రెస్ ఇచ్చిన రైతు రుణమాఫీ అమలు చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వల్ల రైతుబంధు ఆగిపోయిందని, ఎన్నికల అనంతరం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకురాలు, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు రమాదేవి, కొత్తపల్లి నీరజ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఖమ్మంలో విలేకరుల సమావేశంతో పాటు మహబూబాబాద్‌లో నిర్వహించిన సీపీఐ ప్రజా పిలుపు సభలో తుమ్మల మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మరింత బలం చేకూరడంతోపాటు రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా రాష్ట్రానికి అత్యధిక నిధులు సాధించుకునే ఆస్కారం ఉంటుందన్నారు. ఇప్పటికే జరిగిన రెండు విడతల ఎన్నికల్లో ఇండియా కూటమికే ఆధిక్యం ఉందని సర్వేలు చెబుతున్నాయన్నారు. అందుకే ప్రధాని మోదీ.. మతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీని ఓడించేందుకు వామపక్ష, అభ్యుదయ పార్టీలతో



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఖమ్మం మేయర్ నీరజ, ఇద్దరు కార్పొరేటర్లు


ఇండియా కూటమి ఏర్పడిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో స్కీములన్నీ స్కామ్‌లుగా మారిపోయాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన 20మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతు తెలిపాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రాదని జోస్యం చెప్పారు. తెలంగాణలో పదేళ్ల పాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు చక్రవర్తుల్లా ప్రవర్తించారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లోనే బీఆర్ఎస్‌ను ప్రజలు బొంద పెట్టారని, రానున్న రోజుల్లో దాని మనుగడ ప్రశ్నార్థకం కానుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఉంటుందన్నారు. తెలంగాణకు పదేళ్లలో ప్రధాని మోదీ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. అభివృద్ధి గురించి చెప్పకుండా ఎన్నికల సభలో మతపరమైన అంశాలే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, సీపీఐది సహజ బంధమని, రెండు పార్టీలు పేదల కోసమే పని చేస్తాయని పేర్కొన్నారు.

నేడు కొత్తగూడేనికి సీఎం రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం కొత్తగూడెం రానున్నారు. ఖమ్మం అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం స్టేడియంలో ఉదయం 11 గంటలకు బహిరంగ సభ జరగనుంది.

13 తర్వాత కేసీఆర్ పని ఖతం

- జూలై 4న దుకాణం బంద్: మంత్రి కోమటిరెడ్డి
- నా కోటిన్నర ఆస్తిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నా
- నాపై పోటీ చేసే వారూ ఆ పని చేయాలి: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరిట అగ్రిమెంట్ చేయించిన తన ఆస్తి పత్రాలను మంత్రి కోమటిరెడ్డికి అందజేస్తున్న తీన్మార్ మల్లన్న

నల్లగొండ, మే 3: అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా దోచుకున్న మాజీ సీఎం కేసీఆర్ పని ఈ నెల 13 తర్వాత ఖతం అవుతుందని, జూలై 4న ఆయన దుకాణం బంద్ అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ (ఎమ్మెల్సీ) స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) నామినేషన్ వేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం అంతా చిన్నాభిన్నమైందని, బిడ్డ జైలులో ఉందని ఆయన మానసిక పరిస్థితి ఏమాత్రం బాగా లేదన్నారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ నడుస్తోందని మోదీ అంటున్నారని, అయితే దేశంలో నడిచేది అంబానీ, అదానీల ట్యాక్స్ అని విమర్శించారు. రాష్ట్రంలో జీవో 46తో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని, ఆ జీవోపై కమిటీ వేసి రద్దు చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను లక్ష ఓట్ల మెజార్టీతో మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలిపించాలని కోరారు. తనకున్న కోటిన్నర ఆస్తిని ప్రభుత్వానికి అప్పగిస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పేరిట అగ్రిమెంట్ చేశానని తీన్మార్ మల్లన్న ఈ సందర్భంగా ప్రకటించారు. తనపై పోటీ చేసే వారు కూడా తమ ఆస్తులను ప్రభుత్వానికి ఇచ్చిన తర్వాతే తనపై పోటీకి దిగాలని సవాల్ విసిరారు. ఈ మేరకు అగ్రిమెంట్ చేయించిన ఆస్తి పత్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అందజేసి ప్రభుత్వానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, తీన్మార్ మల్లన్న దంపతులకు రూ.1.50కోట్ల ఆస్తులు, రూ.31లక్షల అప్పులున్నాయి. నామినేషన్ దాఖలు సందర్భంగా ఆయన తమ ఆస్తులు, అప్పుల వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మల్లన్న పేరుపై రూ.16.34 లక్షల విలువైన స్థిర, చరాస్తులు ఉండగా ఆయన భార్య మాతమ్మ పేరుపై రూ.1.34 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నట్లు ప్రకటించారు. తీన్మార్ మల్లన్నపై రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 56 కేసులు నమోదు కాగా, వివిధ కోర్టుల్లో 26 కేసులు విచారణ దశలో ఉన్నాయి.

● ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు

నల్లగొండటౌన్: ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఐదుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తీన్మార్ మల్లన్న రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, చాలిక చంద్రశేఖర్, అలయన్స్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఈద శేషగిరిరావు, తెలంగాణ సకల జనుల పార్టీ అభ్యర్థిగా నందిపాటి జానయ్య నామినేషన్లు దాఖలు చేశారు.



అబ్ కీ బార్?



మీకు గుర్తున్నాయా!? దివంగత మజ్లిస్ అధినేత సలావుద్దీన్ ఒవైసీతో బీజేపీ నేతలు బద్దం బాల్ రెడ్డి, ఆలె నరేంద్ర తలపడిన రోజులు!? అప్పట్లో హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉద్విగ్న పరిస్థితులు నెలకొనేవి! రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ అటువంటి పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి! ఇందుకు కారణం.. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీపై పోటీగా విరించి ఆస్పత్రుల అధినేత కొంపెల్ల మాధవీలతను బీజేపీ బరిలో నిలపడం.. ఆమె దూకుడుగా ప్రచారంలో దూసుకుపోతుండడమే! దాంతో, ఇక్కడ హైటెన్షన్ పోరు నెలకొంది!!





2019 లోక్‌సభ ఎన్నికల్లో..

మజ్లిస్	బీజేపీ	బీఆర్ఎస్	కాంగ్రెస్
అసదుద్దీన్ ఒవైసీ	భగవంత్ రావు	పుస్తే శ్రీకాంత్	ఫీరోజ్ ఖాన్
5,17,100	2,35,285	63,239	49,944

పంతం.. నీదా..!? నాదా..!?

పతంగితో కమలం ఢీ

- హైదరాబాద్ లోక్‌సభలో ఉత్కంఠ పోరు
- ఐదోసారి గెలుపునకు అసదుద్దీన్ పావులు
- ముస్లిం కోటలో బీజేపీ ఖాతా తెరవాలని మాధవీలత పట్టు
- ఇక్కడి ఫలితంపై దేశవ్యాప్తంగా ఆసక్తి

హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలు వచ్చినప్పుడు హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పేరు చెప్పగానే.. 'ఆ.. అక్కడ మజ్లిసే గెలుస్తుంది' అనే మాట సర్వసాధారణంగా వినిపించేది! సలావుద్దీన్ ఒవైసీ, బద్దం బాల్‌రెడ్డి, ఆలె నరేంద్ర కాలంలో పోటాపోటీ నెలకొన్నా.. అసదుద్దీన్ బరిలోకి దిగినప్పటి నుంచి గత రెండు దశాబ్దాలుగా ఆయనకు తిరుగులేదు. కానీ, ఇప్పుడు అక్కడ పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మజ్లిస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు మారింది. ఇరు పార్టీల అభ్యర్థుల మధ్య మాటలు తూటాల్లా పేలుతున్నాయి. ప్రసంగాలతోనే కాదు.. హావభావాలతోనూ ఇరువురూ రక్తి కట్టిస్తున్నారు. ప్రచారంలో భాగంగా మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ తమ పార్టీ గుర్తు పతంగిని ఎగరేస్తున్నట్లు చూపిస్తే.. ఎగురుతున్న గాలిపటాన్ని కాట్ (కట్) చేస్తున్నట్లు బీజేపీ అభ్యర్థి మాధవీలత అభినయిస్తున్నారు. ఇరువురి ప్రచార శైలి సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. అందుకే, ఈసారి హైదరాబాద్ పార్లమెంటు ఎన్నికపై జాతీయ స్థాయిలోనూ ఉత్కంఠ నెలకొంది. నిజానికి, ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు కూడా బరిలో నిలిచినా.. బీజేపీ, మజ్లిస్ మధ్యే ముఖాముఖి పోటీ నెలకొంది. అంతేనా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓట్లను ఎవరు ఎక్కువ చీలిస్తే వారికే విజయావకాశాలు ఉండే అవకాశం ఉందనే విశ్లేషణలూ వెలువడుతున్నాయి. ఇక, మత ప్రాతిపదికనే ఇక్కడ ప్రచారం జరుగుతోంది. ఓటింగూ అదే తరహాలో ఉండనుంది.



బీజేపీ అభ్యర్థి దూకుడు

అనూహ్యంగా మొదటి జాబితాలోనే హైదరాబాద్ అభ్యర్థిగా బీజేపీ మాధవీలతను ప్రకటించింది. అప్పటి నుంచి ఆమె ఇటు సోషల్ మీడియాలో అటు పాతబస్తీలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మహిళ కావడంతోపాటు వాగ్ధాటి ఆమెకు అదనపు ఆకర్షణగా నిలిచింది. ఓ టీవీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడిన తీరుకు ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. రుద్ర నమక చమకాలను లయబద్ధంగా పఠించడం పలువురిని ఆకర్షిస్తోంది. పార్లమెంటు ఎన్నికల్లో నిలబడే లక్ష్యంతో చాలాముందు నుంచే ఆమె వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. లతా మా ఫౌండేషన్ ద్వారా పేద ముస్లింలకు రేషన్, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నారు. విరించి ఆస్పత్రిలో పలువురికి ఉచితంగా ప్రసవాలు చేసి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయోధ్య బలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సమయంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీతారామ కల్యాణం జరిపించారు. తద్వారా, హిందువుల ఓట్లన్నీ గంపగుత్తగా తనకే పడతాయని భావిస్తూ.. ముస్లిముల ఓట్లలోనూ చీలిక తీసుకొచ్చే దిశగా ఆమె పావులు కదుపుతున్నారు. అప్పుడే తన విజయం ఖాయమవుతుందని భావిస్తున్నారు. శ్రీరామనవమి రోజు విల్లు ఎక్కుపెట్టి బాణం వదులుతున్నట్లు ఫోజు ఇవ్వడం వివాదాస్పదమైంది. ఆమె మసీదు వైపు బాణం వదులుతూ ఫోజు ఇచ్చారంటూ ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు కూడా. ఇక, నాలుగు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో అభివృద్ధి కుంటుపడిందని, యువతులను అరబ్ షేక్‌లకు ఇచ్చి పెళ్లి చేస్తున్నా ఇక్కడి ప్రతినిధులు పట్టించుకోవడం లేదని, వితంతువులకు ఆధారం కల్పించడం లేదని, అభివృద్ధి శూన్యమని ఆరోపిస్తున్నారు. బోగస్ ఓట్లతోనే మజ్లిస్ గెలుస్తోందని, దానిపై ఈసీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే, నియోజకవర్గ పరిధిలో బీజేపీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ సహాయ నిరాకరణ మాధవీలతకు సమస్యలు సృష్టిస్తోందని అంటున్నారు. ఆమెకు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తితో రాజాసింగ్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇక్కడ బీజేపీ గెలిస్తే పాతబస్తీలో ఖాతా తెరవడమే కాదు.. దేశంలోనే పెను సంచలనమూ అవుతుంది. అందుకే, ఇక్కడ గెలుపును బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?


పార్టీ	సెగ్మెంట్లు
మజ్లిస్	మలక్‌పేట, కార్వాన్, చార్మినార్, చంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా
బీజేపీ	గోషామహల్

పురుషులు	11,25,283
మహిళలు	10,91,615
ఇతరులు	196
మొత్తం ఓటర్లు	22,17,094

ఎప్పట్లాగే బీజేపీ అభ్యర్థి పోటీని హైదరాబాద్‌లో తొలుత మజ్లిస్ లైట్ తీసుకుంది. తమ గెలుపు ఖాయమని భావించింది. కానీ, మాధవీలత ప్రచార జోష్‌తో అప్రమత్తమైంది. రంజాన్ నెలలోనే ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు గల్లీ గల్లీ తిరుగుతూ ప్రచార తీవ్రత పెంచారు. అదే సమయంలో ముస్లిం ఓట్లు చీలకుండా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా పావులు కదిపారు. బద్ధ శత్రువైన ఎంబీటీ

మజ్లిస్ వ్యూహాత్మక అడుగులు

బరిలో నిలవకుండా మజ్లిస్ జాగ్రత్తలు తీసుకుందనే ప్రచారం జరిగింది. నిజానికి, ఎంబీటీ పోటీ కారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో యాకత్‌పురాలో మజ్లిస్ బొటాబొటి మెజారిటీతో బయటపడింది. మరికొన్ని నియోజకవర్గాల్లోనూ మెజారిటీలు తగ్గిపోయాయి. పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎంబీటీ బరిలోకి దిగితే ముస్లిం ఓట్లను గణనీయంగా చీల్చేందుకు అవకాశం ఉంటుంది. అది అంతిమంగా బీజేపీకే లబ్ధి చేకూరుస్తుంది. ఈ నేపథ్యంలోనే, మజ్లిస్ తరఫున కొంతమంది మత పెద్దలు ఎంబీటీ నేతలతో చర్చలు జరిపారు. ఫలితంగా పోటీ నుంచి ఆ పార్టీ తప్పుకుంది. దాంతో, అత్యధికంగా ఉన్న ముస్లిం ఓట్లన్నీ గంపగుత్తగా తమకే పడతాయని, తమ గెలుపు ఖాయమనే అంచనాల్లో మజ్లిస్ ఉంది. ఇక, మతతత్వ బీజేపీ గెలిస్తే ఇంతకాలం ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో కల్లోలం ఏర్పడుతుందని మజ్లిస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. తనను, తన సోదరుడు అసదుద్దీన్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందంటూ ముస్లిముల మనసు చూరగొనే ప్రయత్నాలను ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేశారు. మసీదుపై బాణం ఎక్కుపెట్టినట్లు చేస్తూ మాధవీలత మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శలు చేస్తున్నారు. ఈసారి తెలుగులో పాటలు రూపొందించి మజ్లిస్ ప్రచారం నిర్వహిస్తోంది.



2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?

పార్టీ	ఓట్లు
మజ్లిస్ (పతంగి)	4,25,476
బీజేపీ (కమలం)	2,21.454
బీఆర్ఎస్ (కారు)	1,71,497
కాంగ్రెస్ (హస్తం)	1,01,014



ఏపీలోని ఆ 5 గ్రామాలు రాష్ట్రంలోకి..

ఐటీఐఆర్ పునఃప్రారంభం.. ఇండస్ట్రియల్ కారిడార్లు, విద్యా సంస్థల ఏర్పాటు

విభజన హామీల అమలు.. మేడారం జాతరకు జాతీయ హోదా

లోక్‌సభ ఎన్నికలకు 23 అంశాలతో తెలంగాణకు కాంగ్రెస్ ప్రత్యేక మేనిఫెస్టో

రాష్ట్రాభివృద్ధికే ప్రత్యేక మేనిఫెస్టో : మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీలో భాగమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయడం, ఐటీఐఆర్ ప్రాజెక్టు పునఃప్రారంభం, ఐదు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు, విభజన హామీల అమలు, విద్యా సంస్థల ప్రారంభం, మేడారం జాతరకు జాతీయ హోదా తదితర 23 హామీలతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైంది. పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్రం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోను శుక్రవారం విడుదల చేసింది. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీలతో పాటు రాష్ట్రానికి ఇచ్చిన 23 ప్రత్యేక హామీలనూ అమలు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే 23 అంశాలతో మేనిఫెస్టో రూపకల్పన చేశామని చెప్పారు. రాహుల్ గాంధీని పప్పూ అంటూ మోదీ హేళన చేశారని, ఇప్పుడదే రాహుల్‌ను చూసి ఆయన భయపడుతున్నారని దీపాదాస్ మున్షీ అన్నారు. ప్రధాని స్థాయిని మరిచి ఎన్నికల ప్రచారంలో మోదీ చేస్తోన్న విమర్శలే అందుకు నిదర్శనమని తెలిపారు.

రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హామీలు ఇవే

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా

- హైదరాబాద్ మహా నగరానికి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటీఐఆర్) ప్రాజెక్ట్ పునఃప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌లో ఐఐఎం, హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి రాపిడ్ (వేగవంతమైన) రైల్వే వ్యవస్థ, మైనింగ్ వర్సిటీల ఏర్పాటు

73, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం కేంద్ర ప్రభుత్వ నిధులు సర్పంచ్‌లకు నేరుగా బదిలీ

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా

- హైదరాబాద్- బెంగళూరు ఐటీ- ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్ - నాగపూర్, హైదరాబాద్ -వరంగల్, హైదరాబాద్ - నల్గొండ - మిర్యాలగూడ, సింగరేణి ఇండస్ట్రియల్ కారిడార్లు
- భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయడం.
- హైదరాబాద్‌లో నీతి అయోగ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు
- నూతన ఎయిర్‌పోర్టుల ఏర్పాటు
- రామగుండం-మణుగూరు నూతన రైల్వే లైన్ ఏర్పాటు
- 4 నూతన సైనిక పాఠశాలలు
- కేంద్రీయ విద్యాలయాల పెంపు
- నవోదయ విద్యాలయాల సంఖ్య రెట్టింపు
- జాతీయ క్రీడల విశ్వవిద్యాలయం ఏర్పాటు
- ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ఏర్పాటు
- ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) ఏర్పాటు
- భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఇరి) క్యాంపస్ ఏర్పాటు
- నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు
- అధునాతన వైద్య పరిశోధనల కోసం ఐసీఎంఆర్ పరిధిలో కేంద్ర వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటు
- డ్రై పోర్టు ఏర్పాటు.
- హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు

ప్రతి ఇంటికి సౌర శక్తితో కూడిన సొంత విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థ ఏర్పాటు

ఆశీర్వదించండి.. ప్లీజ్!





హైదరాబాద్ మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ గురువారం రాత్రి మూసారాంబాగ్ బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం పక్క నుంచి వెళ్లారు. ఆ సమయంలో అసదుద్దీన్‌ను ఆశీర్వదించాలని, ఆయనకు పూలమాల వేయాలని మూసారాంబాగ్ మాజీ కార్పొరేటర్ అస్లాం, ఇతర మజ్లిస్ నాయకులు ఆలయ అర్చకులను కోరారు. దాంతో, వారు పూలమాల వేశారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అలాగే, బీజేపీ అభ్యర్థులు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, మాధవీలత, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి వంశా తిలక్, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ శుక్రవారం హైదరాబాద్ ఆర్చి డయాసిస్ బిషప్, కార్డినల్ పూల ఆంథోనీని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

- రెజిమెంటల్ బజార్, ఆంధ్రజ్యోతి



ఓటుకు వేళాయె!

రాష్ట్రంలో పోలింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టుకుంది. 80 ఏళ్లు దాటిన వయో వృద్ధులు, నడవలేని దివ్యాంగులతోపాటు పోస్టల్ బ్యాలెట్లు స్వీకరించడాన్ని శుక్రవారం ప్రారంభించారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని రఘుపతిపేట గ్రామంలో హోమ్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకున్న వయో వృద్ధురాలి దృశ్యమిది. అలాగే, హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో పోస్టల్ ఓటు వేస్తున్న పోలీసునూ చూడవచ్చు.

- ఆమనగల్లు-ఆంధ్రజ్యోతి

బీఆర్ఎస్‌కు ఒక్కటీ రాదు

రాష్ట్రంలో బీజేపీకి 11-12 ఎంపీ స్థానాలు.. రంజిత్‌రెడ్డి నాకు అసలు పోటీయే కాదు

- అపరిమిత అధికారంతో కేసీఆర్ పిచ్చిపనులు
- అప్పటి అప్పులను రేవంత్ కడుతున్నారు
- రుణమాఫీ.. గోడమీద 'రేపు' లాంటిదే
- మేడిగడ్డ ప్రయోజనకరమైన ప్రాజెక్టేమీ కాదు
- పాలిటిక్స్‌లో రేవంత్ నాకంటే ప్రొఫెషనల్
- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బిగ్ డిబేట్‌లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): అపరిమిత అధికారాలతో కేసీఆర్ చాలా పిచ్చిపనులు చేశారని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా.. దేశంలో ఎక్కడా ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి చేతుల్లో రాష్ట్రం లేదని, తెలంగాణలోనే అలా జరిగిందని తెలిపారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి తప్పు చేశారని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని స్పష్టం చేశారు. శుక్రవారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణతో 'బిగ్ డిబేట్'లో విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.

రంజిత్‌రెడ్డిపై ఈసారి ప్రతీకారం తీర్చుకుంటారా..?

ఆయన నాకు పోటీ కాదు.. నా పోటీ కేసీఆర్, కేటీఆర్‌తో ఉండేది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీతోనే ఉండేది. నాకు వరమిచ్చినట్టుగా సునీతా మహేందర్‌రెడ్డిని ప్రకటించి తప్పించారు. ఆమెకు ఇక్కడ పరిచయాలు ఎక్కువగా ఉన్నందున ఆమె ఉంటే పోటీ టఫ్‌గా ఉండేది. రంజిత్‌రెడ్డికి పెద్దగా లేవు. భూ లావాదేవీలు, వ్యాపార ఒప్పందాలున్న నేతలే ఆయనకు మద్దతు పలుకుతున్నారు. ఎమ్మెల్యేలు ఎలాగైనా గెలిపించాలని సీఎం రేవంత్ ఒత్తిడి చేస్తున్నారు.

సీఎం రేవంత్, మీరు జిగ్రీ దోస్తులు కదా..?

దోస్తులు దోస్తులే.. పాలిటిక్స్ పాలిటిక్సే. రాజకీయాల్లో రేవంత్ నాకంటే ఎక్కువ ప్రొఫెషనల్‌గా ఉంటాడు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎప్పుడూ ఇలాగే ఉండేది కదా..?

కేసీఆర్ అప్పులు చేసిండు. రేవంత్ అప్పులు కడుతున్నడు. రాష్ట్రానికి వచ్చే ఆదాయమంతా రూ.1.40 లక్షల కోట్లే. ఇందులో రూ.80 వేల కోట్లు అప్పులు కట్టేందుకు, రూ.60 వేల కోట్లు జీతాలకు చెల్లించాల్సిందే. పెద్దన్న అని మోదీ రూ.9 వేల కోట్లు ఇచ్చారు కాబట్టే ఇప్పుడు రాష్ట్రం నడుస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తెలుసుకోకుండా ఏఐసీసీ ఆరు గ్యారంటీలను రేవంత్ నెత్తిన పెట్టింది. ఇందులో రేవంత్ తప్పేం లేదు. అవి ఇప్పుడు గుదిబండలా మారాయి. రూ.2 లక్షల రుణమాఫీకే రూ.30 వేల కోట్లు కావాలి. ఇప్పుడు రూ.3 వేల కోట్లు కూడా లేవు.

రుణమాఫీ డెడ్‌లైన్ ఆగస్టు-15 పెట్టుకున్నారు కదా?

అప్పు అడిగితే గోడ మీద 'రేపు' అని రాస్తారు.. ఆ రేపు ఎప్పటికీ రాదు. ఇదీ అలాంటిదే. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుల చెల్లింపును 25 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుకుంటే మంచిది. దానికి కేంద్రం సహకారం కావాలి. మేడిగడ్డ పెద్ద ప్రయోజనకరమైన ప్రాజెక్టేం కాదు. మూసీనది సుందరీకరణకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేయడం కూడా సరికాదు.

బీజేపీ మళ్లీ వస్తే ఇక్కడి నుంచి మంత్రులెవరవుతారు?

అందరికీ వస్తే అందరూ తీసుకుంటారు. కానీ, కాంగ్రెస్‌లో ఉన్నట్టు ఇక్కడ మంత్రి పదవులను ఎంజాయ్ చేయలేరు.

మీ మనస్తత్వానికి ఇన్ని పార్టీలు మారకూడదు. కేసీఆర్ ఫ్యామిలితో విభేదాలేంటి.?

నేను పార్టీలు మారలేదు. పార్టీలే మారాయి. కాళేశ్వరం పేరుతో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాలు చేశాడు. కుటుంబ పాలనే అక్కడ అసలు సమస్య. దానిని అంతం చేయాలని కాంగ్రెస్‌లో చేరితే ఇక్కడా ఎమ్మెల్యేలు అమ్ముడుపోయిన్రు. కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి మాత్రమే ఢీకొంటాడని నమ్మాను. ఆయన్ను పీసీసీ అధ్యక్షుడిగా చేయాలని కోరాను. అయితే సీనియర్లు నన్ను వ్యతిరేకించారు.. కోపగించుకున్నారు.

చేవెళ్లలో ముస్లింలు ఎక్కువగా ఉన్నారు కదా?

ఈ విషయంలో నాకు రంజిత్‌రెడ్డి హెల్ప్ చేస్తున్నారు. 4 లక్షల ముస్లిం, 2లక్షల క్రైస్తవుల ఓట్లు ఉన్నాయని అంటున్నారు. అది మతతత్వ భాష. 23 లక్షల హిందువుల ఓట్లు కూడా ఉన్నాయి. మతాల గురించి ఆయన చెబుతున్న మాటలను నేను ప్రచారం చేస్తే చాలు.. నాకు వచ్చేవి వచ్చే స్థాయి. నేను బీజేపీలో ఉన్నా వ్యక్తిగత అభిమానంతో 20 శాతం ముస్లింలు నాకు మద్దతుగా ఉన్నారు.

బీజేపీ అర్బన్ పార్టీ అంటారు.. ఇక్కడ గ్రామీణ ఓటర్లు ఎక్కువ కదా?

నేను గ్రామీణ ప్రాంతాల్లో చాలా తిరిగాను. ప్రతీ గ్రామంలో పరిచయం ఉంది. అర్బన్‌లోనే నేనంటే 80 శాతం తెలియదంటారు. గ్రామీణంలోనే 99శాతం మందికి తెలుసు.

కవితను అరెస్టు చేయకపోవడమే గత ఎన్నికల్లో బీజేపీ ఓటమికి కారణమన్నారు?

కవితను అరెస్టు చేశారు, రామమందిరం పూర్తయింది. ఈ అంశాలు ఎన్నికల్లో నాకు అనుకూలంగా మారుతాయి. ఈ విషయంలో బీఆర్ఎస్‌కు ఎలాంటి సానుభూతి రాలేదు. బీజేపీ-బీఆర్ఎస్ మధ్య పొత్తు ఉందని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నమ్మడంతో కాంగ్రెస్‌కు లాభించింది.

తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు రావచ్చు..?

11-12 వచ్చే అవకాశాలున్నాయి. అసదుద్దీన్‌ను ఓడించడం గతంలో అసాధ్యం. ఇప్పుడు సాధ్యమే. హైదరాబాద్‌లో మాధవీలత గెలుస్తారు. బీఆర్ఎస్‌కు ఒక్కటీ రాదు.

బీఆర్ఎస్ ఓటుబ్యాంకు పెరిగితే మీకు నష్టమే కదా..?

కొన్ని ప్రాంతాల్లోనే నష్టం. చేవెళ్లలో అంతగా పెరగలేదు. సభలకు జనం వస్తున్నారని ఆదరణ పెరిగిందని అనలేం.

ముగ్గురు ధనిక అభ్యర్థులే.. ప్రజలు ఆశలు పెరగవా?

నల్లధనం ఉన్నోడు పంచిపెడుతడు. తెల్లధనం ఉన్నోడు పంచి పెట్టడు. ఇంత ప్రకటించాడంటే ఒక్కపైసా లంచం తీసుకోడు, రాజకీయాల్లోకి పైసల కోసం రాలేదన్న ముద్ర కూడా ఉంటుంది. అది నాకు చాలా అడ్వాంటేజ్.

గెలిస్తే చేవెళ్లకు ఏంచేస్తారు..?

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కేంద్రంలో బీజేపీ ఉన్నా.. వెయ్యి కోట్ల బీజాపూర్ హైవే తెచ్చాను. తాండూరు రాయిపై జీఎస్టీ 18 నుంచి 5శాతానికి తగ్గించాను. ఇప్పుడు గెలిస్తే.. కేంద్ర పథకాలు ఇక్కడ అమలయ్యేలా చూస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటాను.

'గాడిద గుడ్డు' పాలనే

(మొదటిపేజీ తరువాయి)

చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కల్వకుంట్ల పాలన పోయి.. సోనియా కుటుంబ పాలన వచ్చిందని, మార్పు అంటే ఇదేనా? అని రేవంత్‌ను నిలదీశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 100 రోజుల్లో గ్యారెంటీలు అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని ధ్వజమెత్తారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదన్నారు. ఎన్నికల ప్రచారంలో వాస్తవాలకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో రైల్వేల కోసం యూపీఏ హయాంలో ఎన్ని నిధులు ఇచ్చారో.. ప్రధాని మోదీ వచ్చాక ఎన్ని నిధులు ఇచ్చామో అనేదానిపై చర్చకు రావాలని సవాల్ చేశారు. రిజర్వేషన్లపై కావాలనే కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టించి చీలికల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి కుతంత్రానికి తెర లేపారని మండిపడ్డారు. ఒక వర్గం వారి ఓట్ల కోసం బీజేపీపై బురదజల్లడం సరికాదన్నారు. దళితులు, బీసీల పట్ల కాంగ్రెస్ మొసలికన్నీరు కారుస్తోందని, అడుగడుగునా అంబేడ్కర్‌ను అవమానపరిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. రేవంత్ రెడ్డి డీఎన్ఏలో కాంగ్రెస్ లేదని, అందుకే ఆ పార్టీ చరిత్ర ఆయనకు తెలియదన్నారు. హైదరాబాద్‌ను యూటీ చేసే ప్రతిపాదన ఏదీ లేదని, దీనిపై ప్రకటనలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని లక్ష్మణ్ అన్నారు. కాగా, వరంగల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, హైదరాబాద్ నగరానికి చెందిన కొంతమంది ఐటీ కంపెనీల యజమానులు బీజేపీలో చేరారు.

రిజర్వేషన్లను రద్దు చేస్తామన్నోళ్లను చెప్పులతో ఉరికించి కొట్టండి

» రేవంత్‌కు సీఎం సీటు పోతుందని భయం: సంజయ్



హుజూరాబాద్, మే 5: రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పేవాళ్లను చెప్పులు, చీపుర్లతో ఉరికించి కొట్టాలని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మోదీ మళ్లీ ప్రధాని అయితే రిజర్వేషన్లు ఎత్తేస్తారని కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ పైసలతో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఓట్లను కొనాలనుకుంటున్నారన్నారు. దేశవ్యాప్తంగా 300 లోక్‌సభ స్థానాలకు మించి పోటీ చేయని కాంగ్రెస్‌కు అధికారం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్లేనని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి సీఎం సీటు పోతుందనే భయం పట్టుకుందని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు ఎన్ని వస్తాయోనన్న భయంలోనే ఆయన ఉన్నారని, ఆ బాధతోనే మోదీని తిడుతున్నారన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికి లేదు: ఈటల

సికింద్రాబాద్, వనస్థలిపురం మే 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారు కొలువుదీరుతుందని తెలిసే కాంగ్రెస్ తమ పార్టీపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తుందని, రిజర్వేషన్ల రద్దు చేస్తుందని సీఎం రేవంత్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికి లేదని స్పష్టం చేశారు. 5న పరేడ్ గ్రౌండ్‌లో జరిగే అమిత్ షా సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ ముందుందని, అత్యధిక స్థానాలు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజిగిరి సిటింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు రేవంత్‌రెడ్డి కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వనస్థలిపురం రెడ్ ట్యాంక్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు ఈటల రోడ్ షో నిర్వహించారు.

కారులో రూ. 4.31 కోట్ల బంగారం

» కోల్‌కతా నుంచి హైదరాబాద్ తీసుకొస్తుండగా పట్టివేత

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి) : కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ. 4.31 కోట్లు విలువైన బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు బంగారం రవాణా జరుగుతోందన్న పక్కా సమాచారంతో డీఆర్ఐ బృందం చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం తనిఖీలు చేపట్టింది. ఫోర్డ్ ఏకో స్పోర్ట్ కారులో ప్రత్యేకంగా అమర్చిన ర్యాక్‌లో 35బంగారు కడ్డీల్ని అధికారులు గుర్తించారు. బంగారు కడ్డీల బరువు 6కిలోలు ఉంటుందని విలువ రూ.4.31కోట్లు అని డీఆర్ఐ అధికారులు తెలిపారు. కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.98 లక్షల సీజ్

హైదరాబాద్ సిటీ/దుండిగల్: ఈసీ జారీ చేసిన క్యూఆర్ కోడ్‌లు, సంబంధించిన పత్రాలు లేకుండా బ్యాంకులకు నగదు తరలిస్తున్న సీఎంఎస్ క్యాష్ లాజిస్టిక్ వాహనాల నుంచి రూ.98లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం శామీర్‌పేటలో టీఎస్ 09యూఈ 0549 సీఎంఎస్ వాహనంలో తరలిస్తున్న రూ.50లక్షలను పోలీసులు సీజ్ చేశారు. గండిమైసమ్మ చౌరస్తాలో టీఎస్09యూడీ6991 వాహనంలో తరలిస్తున్న రూ.48.32లక్షలను గురువారం రాత్రి పట్టుకున్నారు.

హిట్లర్ కాలంలో యూదుల పరిస్థితే ముస్లింలది

» ఎన్నికల్లో గెలిచేందుకే ప్రధాని ద్వేషం పెంచుతున్నారు: అసద్

హైదరాబాద్, మే 3: హిట్లర్ కాలంలో జర్మనీలో యూదులు ఎదుర్కొన్న పరిస్థితే నేడు దేశంలో ముస్లింలు ఎదుర్కొంటున్నారని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఆరోపించారు. శుక్రవారం ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈమేరకు వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాని ప్రజల్లో ముస్లింల పట్ల ద్వేషాన్ని రేకెత్తిస్తున్నారని విమర్శించారు. "133 కోట్లమంది ప్రజలకు ప్రధానమంత్రి... 17 కోట్ల మంది ముస్లింలను చొరబాటుదారులంటున్నారు... ఆయన ఎందుకు ముస్లిం సమాజాన్ని కించపరుస్తున్నారు... వారిపై ఎందుకంత ద్వేషం?" అని ఒవైసీ ప్రశ్నించారు. యాకుత్‌పురలో నిర్వహించిన ఒక బహిరంగ సభలో ఒవైసీ మాట్లాడుతూ ప్రధానికి ఓటు వేయనంత మాత్రాన ముస్లింలు భారత్‌లో భాగం కాదా? జనాభాలో 14 శాతం ఉన్నవారిని చొరబాటుదారులని, ముస్లిం మహిళలు ఎక్కువ మంది పిల్లల్ని కంటారని అనడానికి ఆయనకు ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. కర్ణాటకలో జేడీ(ఎస్) నేత ప్రజ్వల్ రేవణ్ణ అకృత్యాలు ప్రధానికి తెలిసినా... అతడి తరఫున ప్రచారానికి వెళ్లారని ఆరోపించారు.

ప్రచారంలో ప్రమాదం..

» అదుపు తప్పి జనం మీదకు వచ్చిన డీజే వాహనం

» ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

» మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రోడ్‌షోలో దుర్ఘటన

బోడుప్పల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రమాదం జరిగింది. ప్రచారం కోసం వినియోగించిన డీజే వాహనం అదుపు తప్పి జనం మీదుగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రవణ్ (24) అనే యువకుడు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాజీ మంత్రి మల్లారెడ్డితో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్‌లోని దేవేందర్‌నగర్‌లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏటవాలుగా ఉన్న ఓ రహదారిలో కింది నుంచి పైకి ర్యాలీ కొనసాగుతుండగా డీజే పాటల కోసం ఏర్పాటు చేసిన వాహనం అదుపుతప్పింది. డీజే వాహనం హఠాత్తుగా వెనక్కి జారింది. దీనిని గమనించిన శ్రవణ్ డీజే వాహనాన్ని ఆపేందుకు దాని చక్రాల కింద రాయి పెట్టేందుకు ప్రయత్నించి.. ఆ వాహనం టైర్ల కిందే నలిగిపోయాడు. ఈ క్రమంలో మరో ఇద్దరు గాయపడగా వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

రోహిత్ వేముల కేసులో నిందితులకు క్లీన్‌చిట్

రోహిత్ దళితుడు కాదని పోలీసుల నివేదిక.. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదు

» తన కులధ్రువీకరణ పత్రం సరైనది కాదని తెలుస్తుందని ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చు

» హైకోర్టుకిచ్చిన క్లోజర్ రిపోర్టులో వెల్లడి

» హెచ్‌సీయూ వీసీ అప్పారావు, ఎన్.రామచంద్రరావు, ఏబీవీపీ నేతల పిటిషన్లపై ముగిసిన విచారణ



హైదరాబాద్, రాయదుర్గం, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని.. పోలీసులు హైకోర్టుకు మార్చి 21న ఇచ్చిన ఈ కేసు క్లోజర్ రిపోర్టులో పేర్కొన్నారు. తన కులధ్రువీకరణ పత్రం సరైనది కాదనే విషయం బయటకు తెలిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే భావనతోనే అతడు ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. రోహిత్ ఎస్సీ కాదని.. అతడు, అతడి కుటుంబసభ్యులు బీసీ-ఏ (వడ్డెర) కులానికి చెందినవారని.. వారు అక్రమ మార్గంలో ఎస్సీ సర్టిఫికెట్లు పొందారని.. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ తేల్చినట్లు అందులో వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ, ఏబీవీపీ నేతలకు, హెచ్‌సీయూ నాటి వీసీ అప్పారావుకు అతడి ఆత్మహత్యతో సంబంధం లేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. దీంతో.. ఈ కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టేయాలని అభ్యర్థిస్తూ అప్పారావు, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, పలువురు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు దాఖలుచేసిన పిటిషన్లను హైకోర్టు శుక్రవారం డిస్పోజ్ చేసింది. హెచ్‌సీయూలో 2015లో.. ఏబీవీపీ (ఏబీవీపీ), అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఎస్ఏ) విద్యార్థుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో.. ఆ వర్సిటీ కుల రాజకీయాలకు, జాతివ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రంగా మారిందంటూ నాటి కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మానవ వనరుల శాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖ రాశారు. ఆ ఏడాది నవంబరులో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సిఫారసుతో.. ఐదుగురు విద్యార్థులపై వీసీ అప్పారావు బహిష్కరణ వేటు వేశారు. దరిమిలా 2016 జనవరి 17న రోహిత్ వేముల.. న్యూరిసెర్చ్ స్కాలర్ హాస్టల్ రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించాడు. దీంతో.. వీసీ అప్పారావు, బండారు దత్తాత్రేయ, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, ఏబీవీపీ నాయకుల వేధింపుల వల్లే రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నాడని విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వారి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు వీసీ అప్పారావు, ఎన్ రామచంద్రరావు, ఏబీవీపీ నాయకులు, తదితరులపై ఐపీసీ 306, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ నిరోధకచట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే, రోహిత్ ఆత్మహత్య వ్యవహారంతో తమకు ఏ సంబంధమూ లేదని.. ఈ కేసులు కొట్టేయాలని విజ్ఞప్తి చేస్తూ వారంతా హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పోలీసుల క్లోజర్ రిపోర్టు ప్రకారం.. రోహిత్ ఆత్మహత్యతో వారికి సంబంధం లేదని పేర్కొంటూ విచారణను ముగిస్తున్నట్లు వెల్లడించింది. పోలీసుల నిర్ణయంతో ఏకీభవించనివారు ట్రయల్ కోర్టులో సవాల్ చేయవచ్చని న్యాయమూర్తి పేర్కొన్నారు.

మండిపడ్డ విద్యార్థులు..

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రోహిత్ వేముల మరణంపై తెలంగాణ పోలీసుల నివేదికను నిరసిస్తూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో పలు విద్యార్థి సంఘాలు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపాయి. వర్సిటీలోని ఏఐఓబీసీఎస్ఏ, ఏఐఎస్ఏ, ఏఎస్ఏ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఫ్రెటర్నిటీ, ఎంఎస్ఎఫ్, టీఎస్ఎఫ్, హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులంతా కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. రోహిత్ చనిపోయిన ఎనిమిదేళ్ల తర్వాత.. తెలంగాణ పోలీసులు నివేదికను ఏబీవీపీ, బీజేపీకి అనుకూలంగా ఇవ్వడం అన్యాయమని, ఆ నివేదిక తప్పులతడక అని ధ్వజమెత్తారు. రోహిత్ వేములది ప్రభుత్వం చేసిన హత్యే అని విమర్శించారు. అతడి ఆత్మహత్యకు అప్పటి హెచ్‌సీయూ వీసీ అప్పారావు, బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ వేధింపులే కారణమని కేసులు నమోదు చేసినా.. పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేయలేదని విద్యార్థి నాయకులు మండిపడ్డారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు రోహిత్ కులం గురించి విచారణ చేశారేతప్ప.. వర్సిటీలో జరుగుతున్న కుల వివక్ష గురించి పట్టించుకోలేదని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ చరిత్రలో మొదటిసారిగా వర్సిటీలోని దళిత విద్యార్థులను వెలివేశారని, నాటి వీసీ పొదిలి అప్పారావు వారికి వంతపాడుతూ 10 మంది దళిత విద్యార్థులను సస్పెండ్ చేశారని ఆరోపించారు. అప్పారావు 2001 నుంచి దళిత విద్యార్థులు, దళిత ప్రొఫెసర్లపై వివక్ష చూపేవారని, ఈ అవమానం భరించలేక రోహిత్ ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు. పోలీసులు రోహిత్ దళితుడా కాదా అన్న అంశంపైనే దృష్టిపెట్టారని.. ఆధారాలు లేకుండా రోహిత్ దళితుడు కాదని చెబుతూ ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ను తొలగించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. రోహిత్ వేముల కేసు దర్యాప్తులో పోలీసులు రూపొందించిన 60 పేజీల రిపోర్టులో 40 పేజీలు అతడు దళితుడు కాదని నిరూపించేందుకే కేటాయించారని.. ఏబీవీపీ, బీజేపీ ప్రచారం చేసిన విధంగానే అతడు దళితుడు కాదని రిపోర్టు ఇచ్చారని దుయ్యబట్టారు. ఆత్మహత్య చేసుకున్న దళిత విద్యార్థికి న్యాయం చేయకపోవడం పోవడం సిగ్గుచేటన్నారు. రోహిత్ వేములకు న్యాయం జరిగేదాకా సంఘటిత పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే.. రోహిత్ ఆత్మహత్య కేసును మూసివేస్తున్నట్లుగా పోలీసులు కోర్టుకు తెలపడం ఆశ్చర్యకరమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. ఆ కేసు పునర్విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. రోహిత్ వేముల మరణంపై గతంలో స్పందించిన కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ.. అతడే తన కథానాయకుడని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'జస్టిస్ ఫర్ వేముల' ఉద్యమానికి కాంగ్రెస్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆయన వెల్లడించారు. 2022లో తెలంగాణలో నిర్వహించిన భారత్ జోడో యాత్రలో రోహిత్ తల్లి రాధికతో కలిసి నడిచారు. తాము అధికారంలోకి వస్తే.. దళితులు, ఓబీసీలు, మైనారిటీలపై అకృత్యాలను నిరోధించి, వారి విద్యాహక్కును కాపాడేలా 'రోహిత్ వేముల చట్టం' అమలుచేస్తామని ప్రకటించారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో ఆ వ్యాఖ్యలను విద్యార్థి సంఘాలు గుర్తుచేస్తున్నాయి. కాగా.. రోహిత్ మృతి కేసుపై పునర్విచారణ జరపనున్నట్లు డీజీపీ రవి గుప్తా తెలిపారు. ఈ కేసు తుది నివేదికను.. 2023 నవంబరు ముందు నిర్వహించిన దర్యాప్తు ఆధారంగా రూపొందించి, మార్చి 21న కోర్టుకు సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. అయితే.. దీనిపై రోహిత్ వేముల తల్లితోపాటు, మరికొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ త్వరలో కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన వెల్లడించారు.

అమిత్ షా ఫేక్ వీడియో కేసు

నిందితులపై కఠిన చర్యలొద్దు

» ఢిల్లీ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు.. దర్యాప్తు కొనసాగింపునకు అనుమతి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగానికి సంబంధించిన వీడియో మార్ఫింగ్‌కు పాల్పడి వైరల్ చేశారనే ఆరోపణల కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోరాదని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులకు తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి చెందిన మన్నె సతీశ్‌తో పాటు ఆస్మా తస్లీం, అంబాల శివకుమార్, నవీన్, కోయ గీత, పెండ్యాల వంశీకృష్ణ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. 'ఫేక్ వీడియోకు సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ఆరోపణలపై శింకు శరణ్‌సింగ్ అనే ప్రభుత్వ ఉద్యోగి ఫిర్యాదు మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేసి మాకు నోటీసు జారీ చేశారు. సీఆర్పీసీ సెక్షన్ 91/160 కింద జారీచేసిన ఈ నోటీసులను కొట్టేయాలి' అని పేర్కొంటూ లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసరంగా విచారించేందుకు అంగీకరించిన జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం వాదనలు నమోదు చేసింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. అమిత్ షా ఫేక్ వీడియో ఆరోపణలపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు తమ క్లయింట్లపై కేసు నమోదు చేశారని.. ఈ కేసులో బెయిల్ సైతం వచ్చిందన్నారు. ఒకే రకమైన ఫిర్యాదు, ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు మరో కేసు నమోదు చేయడం చెల్లదని.. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు జారీ చేసిన నోటీసులను కొట్టేయాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు పిటిషనర్లపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని.. అయితే దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పేర్కొంది. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రభుత్వ ఉద్యోగి శింకు శరణ్ సింగ్‌కు వ్యక్తిగత నోటీసు పంపేందుకు పిటిషనర్లకు హైకోర్టు అనుమతించింది. తదుపరి విచారణను ఈనెల 12కు వాయిదా వేసింది.

నిందితులకు నాంపల్లి కోర్టు బెయిల్..

మరోవైపు, హైదరాబాద్ పోలీసులు తమ అదుపులోని మన్నె సతీశ్, ఆస్మా తస్లీం, నవీన్, గీత, వంశీకృష్ణను శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా వారు కోర్టును బెయిల్ కోరగా.. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.10 వేల చొప్పున రెండేసి ష్యూరిటీలు సమర్పించాలని.. సోమ, శుక్రవారాల్లో ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరు కావాలని వారికి స్పష్టం చేసింది.

నకిలీ పత్రాలతో 23.78 కోట్ల జీఎస్టీ రిఫండ్!

నాడు ఫిర్యాదు చేసిన అధికారే నేడు నిందితుడిగా అరెస్ట్

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల విభాగంలో మరోసారి అక్రమాలు వెలుగు చూశాయి. నకిలీ పత్రాలు సృష్టించి పెద్దమొత్తంలో జీఎస్టీ రిఫండ్ పొందడంలో నిందితుడికి వాణిజ్య పన్నుల విభాగం అధికారులు సహకరించారు. ఈ వ్యవహారంలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేయగా.. తాను అధికారులకు లంచాలు ఇచ్చానని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ నిందితుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఫిర్యాదు చేశాడు. విచారణలో ఇంటి దొంగల ప్రమేయం బయటపడింది. దీంతో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు శుక్రవారం నలుగురు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల్ని అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. వేమిరెడ్డి రాజారమేష్ రెడ్డి.. వివర్ధ ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో విద్యుత్ వాహనాల యూనిట్ ఏర్పాటు చేశాడు. ఆ సంస్థకు ఆయన మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి చెల్లించిన జీఎస్టీ రిఫండ్ కోసం నకిలీ పత్రాలు సృష్టించి ఏకంగా రూ.23.78 కోట్ల రిఫండ్ పొందాడు. ఈ రిఫండ్‌లో మోసం జరిగినట్లు గుర్తించిన అధికారులు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు గత మార్చిలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రాజారమేష్ రెడ్డిని అరెస్ట్ చేశారు. వాణిజ్య పన్నుల విభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రాజారమేష్ జీఎస్టీ రీఫండ్‌కు పత్రాల్లో పేర్కొన్న కొన్ని యూనిట్లు అసలు అక్కడ లేనట్లు గుర్తించారు. కాగా సీసీఎస్ పోలీసులు తనను అరెస్ట్ చేయడంతో రాజారమేష్ రెడ్డి జీఎస్టీ రిఫండ్ కోసం తాను అధికారులకు లంచాలు ఇచ్చానని, ఎవరెవరికెంత ఇచ్చిందీ వివరిస్తూ సీఎస్, వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన పోలీసులు రాజారమేష్ జీఎస్టీ రిఫండ్‌కు సహకరించిన పి.స్వర్ణ కుమార్, డిప్యూటీ కమిషనర్ జీఎస్టీ (నల్లగొండ డివిజన్); పొదిల విశ్వ కిరణ్, అసిస్టెంట్ కమిషనర్ (స్టేట్ ట్యాక్సెస్) మాదాపూర్-1 సర్కిల్; కె. వేణుగోపాల్, అసిస్టెంట్ కమిషనర్(స్టేట్ ట్యాక్సెస్) నాంపల్లి-1 సర్కిల్; వి.వెంకట రమణ, డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ జీఎస్టీలను శుక్రవారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో గత మార్చిలో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విశ్వ కిరణ్‌నూ అరెస్ట్ చేయడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఈ కేసులో అతని ప్రమేయం ఉన్నట్లు తేలడంతో అరెస్ట్ చేశారు.

తొండి చేసేటోళ్లే ఒట్లు పెట్టుకుంటరు!

(మొదటిపేజీ తరువాయి)



సజీవధారగా మార్చామని, ఇప్పుడేమో పక్కనే గోదావరిఖనిలో మంచి నీళ్లు రెండ్రోజులకోసారి ఇస్తున్నారని.. అవీ మురికినీళ్లేనని విమర్శించారు. "ఐదు నెలల క్రితం రాష్ట్రం ఎట్లుండె? ఇప్పుడెట్లుంది? దీనికి కారణం ఎవరు? ఎవరి చేతగానితనం?" అని ప్రశ్నించారు. అదానీకి మోదీ ఓడ రేవులు, ఎయిర్ పోర్టులను అప్పగిస్తే.. ఆ అదానీతో రేవంత్ తెలంగాణకు రండి అంతా దోచుకుపోండి అంటూ దావోస్‌లో ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక తాము సింగరేణిని బాగుచేసి.. 19 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించామని.. ఇప్పుడా సింగరేణిని ఊడగొడ్తారేమో జాగ్రత్త అని ప్రజలను హెచ్చరించారు. ఒకప్పుడు సింగరేణిని ముంచిందే కాంగ్రెస్ పార్టీ అని... దీనిపై సీపీఐ, సీపీఎం నాయకులు ధైర్యం ఉంటే స్పందించాలన్నారు. తాను చేపట్టిన బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల గుండెలు వణుకుతున్నాయని.. ఆ పార్టీల నేతలు కుమ్మక్కై తనను నిలువరించాలని కుట్రలు పన్నారని ఆరోపించారు. బస్సుయాత్రలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. తన ప్రచారంపై ఎన్నికల కమిషన్ విధించిన 48 గంటల నిషేధం అనంతరం రాత్రి 9 గంటలకు చౌరస్తాకు చేరుకుని ప్రసంగించారు. తన ప్రచారంపై విధించిన నిషేధాన్ని గుర్తుచేస్తూ.. "ఏం చేశానని నా గొంతు నొక్కారు?" అని ప్రశ్నించారు. మోదీ... రాజకీయాల్లో మతం గురించి మాట్లాడితే తప్పులేదా? నెత్తిన దేవుడి బొమ్మలు పెట్టుకుని ముస్లింలు, హిందువులు అని ఆయన మాట్లాడినా ఈసీకి కనబడదా? అని ప్రశ్నించారు. గుడ్లు పీకి గోలీలు ఆడుకుంటా.. పండబెట్టి తొక్కుతా అని నన్ను సీఎం అంటే పట్టించుకోరా? అని నిలదీశారు. మోదీతో రేవంత్ ఆప్ హమారా బడే భాయ్ అంటూ గుజరాత్ మోడల్ పెట్టుకుంటానని అన్నారని.. ఆ గుజరాత్‌లో మన్ను కూడా లేదని.. అంతా దరిద్రం, పెట్టుబడిదారుల రాజ్యమేనని పేర్కొన్నారు. గోదావరి నీళ్లు ఎత్తుకుపోతానని, ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు కడతానని, తమిళనాడు, కర్ణాటకకు గోదావరి నీళ్లిస్తానని మోదీ మాట్లాడుతున్నారని, దీనిపై రేవంత్ మాట్లాడటం లేదని, ఆయన మౌనం వెనుక మతలబు ఏమిటి? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో దళితబంధు కింద 1,32,000 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తే ఈ ప్రభుత్వం లాక్కుందని ఆరోపిస్తూ.. ఆ లబ్ధిదారులు ఏం పాపం చేశారు? అని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకం పెడితే పెట్టారేమో గానీ.. దాని వల్ల బతుకుదెరువు దెబ్బతిన్న ఆటోవాలాలను ప్రభుత్వం ఆదుకోలేదని, ఫలితంగా వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వంపై బరిగీసి కొట్లాడాలని ప్రజలకు పిలుపునిస్తూ ఇందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని, వనరులు కాపాడుకోవాలంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి



రాంనగర్, మే 3: నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డికి అవకాశం దక్కింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం ఆయన పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ స్థానం కోసం వరంగల్ నుంచి రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కె.వాసుదేవరెడ్డి, మాజీ కుడా ఛైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌లు కూడా పోటీ పడ్డారు. అయితే వారిని కాదని అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన రాకేశ్‌రెడ్డికి బీఆర్ఎస్ అధిష్ఠానం అవకాశం కల్పించింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రాకేశ్‌రెడ్డి.. బిట్స్ పిలానీలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలో ఉద్యోగం చేశారు. రాజకీయాలపై ఆసక్తితో 2013లో బీజేపీలో చేరారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. అనంతరం బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు.

బడా భాయ్ మోదీ- చోటా భాయ్ రేవంత్

» అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన వారికి బుద్ధి చెప్పాలి

» కేంద్రం మెడలు వంచేది బీఆర్ఎస్సే

» సికింద్రాబాద్ రోడ్ షోలో కేటీఆర్



సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని అడ్డగుట్టలో జరిగిన రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/ అడ్డగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తున్న బడా భాయ్ మోదీకి.. చోటా భాయ్ ఖేడి రేవంత్‌కు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అందుకు కారు గుర్తుపై ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం రాత్రి సికింద్రాబాద్, సనత్‌నగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎంపీగా కిషన్ రెడ్డి కుర్‌కురేలు పంచడం, సింటెక్స్ ట్యాంక్‌లు ప్రారంభించడం తప్ప సికింద్రాబాద్ నియోజకవర్గానికి ఏం చేయలేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఉండే పెద్దల మెడలు వంచాలన్నా.. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధికి నిధులు రావాలన్నా బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉండాలన్నారు. కాంగ్రెసోళ్ల కాళ్లు మంచివి కావని, వాళ్లు అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు, తాగునీటి గోస మొదలైందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ లాభపడుతుందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో వరదలు వస్తే మోదీ రూపాయి ఇవ్వలేదని, గుజరాత్‌కు మాత్రం రూ.1000 కోట్లు తీసుకెళ్లారని ఆరోపించారు. గుడి కట్టడం ఒక్కటే ఓటు వేసేందుకు కారణమైతే.. కేసీఆర్ యాదాద్రి ఆలయం నిర్మించలేదా..? దేవుళ్లను అడ్డం పెట్టుకొని మనం రాజకీయం చేస్తున్నమా..? అన్నారు. ఆధునిక దేవాలయం కాళేశ్వరం నిర్మించారని, రిజర్వాయర్లకూ దేవుళ్ల పేర్లు పెట్టారని, మీ కంటే ఎక్కువ దేవుళ్లని పూజించేది కేసీఆర్ అని పేర్కొన్నారు. 'బీజేపోళ్లు మనకు కట్లు, బొట్లు నేర్పినట్టు బిల్డప్ ఇస్తరు.. వాళ్ల కన్నా ముందుకు మనకు దేవుడు తెలియదా..? బీజేపీ ఓడిపోయినా దేవుడికి జరిగే నష్టం లేదన్నా'రు. మతం పేరిట రాజకీయం చేసే సన్నాసులకు కచ్చితంగా బుద్ధి చెప్పాలన్నారు. మైనార్టీలపై కాంగ్రెస్‌ది కపట ప్రేమని ఆరోపించారు. కాంగ్రెస్‌కు మైనార్టీలపై ప్రేమే ఉంటే రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక ఎందుకివ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు. గోషామహల్‌లో బీజేపీని గెలిపించేందుకే కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థిని పెట్టిందని ఆరోపించారు. గులాబీ కండువాతో గెలిచిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల అనంతరం రేవంత్‌తో కలిసి బీజేపీలో చేరతారని అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు ఎంపీగా భారీ మోజార్టీతో గెలుస్తున్నారని ఈ సందర్భంగా కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 4 మే 2024



రెస్ట్రిక్షన్ ఫీచర్!

వాట్సాప్‌లో తాత్కాలికంగా ఉపయోగపడేందుకు వీలుగా రెస్ట్రిక్షన్ ఫీచర్‌పై పనిచేస్తున్నట్టు సమాచారం. సెండర్స్ పంపే మెసేజ్‌లపై పరిమితి విధిస్తుంది. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ ఫీచర్ ఉనికిలోకి వస్తేనే దాని అసలు ప్రయోజనం వెల్లడి అవుతుంది. డబ్ల్యుఏబేటా ఇన్ఫో ప్రకారం కొత్త సంభాషణలను మొదలుపెట్టడం, మెసేజ్‌లు పంపడంపై ఆంక్షలు ఉంటాయి. ఇది అమలులోకి వస్తే కొన్ని ఉల్లంఘనలకు శిక్ష కింద నిర్దేశిత సమయం చాట్ చేయకుండా నిరోధిస్తుంది. కొందరు యూజర్లు దుర్భాషలు ఆడటం, ప్రదర్శించే అనుచిత ధోరణి కట్టడికి ఇది పనికొస్తుందని సమాచారం. సాధారణ వినియోగానికి విరుద్ధంగా ఉంటే ఈ ఆంక్షలను విధిస్తుంది. ఇందుకోసం ఆటోమేటిక్ డిటెక్షన్‌ను చేపడుతుంది. అనుచితంగా ప్రవర్తించే యూజర్ల అకౌంట్లపై నిషేధానికి ప్రత్యామ్నాయంగా ఈ ఫీచర్‌ను తీసుకువచ్చే యత్నంలో వాట్సాప్ ఉంది.



వీడియో షేరింగ్‌కు బగ్‌తో ఆటంకం

వాట్సాప్ ఆండ్రాయిడ్ వెర్షన్‌లో ఇటీవల ఏర్పడిన బగ్‌తో వీడియో ఫైల్స్‌ను పంపడం కుదరటం లేదు. రెడిట్‌లో ఫిర్యాదులతో ఈ బగ్ వెలుగుచూసింది. ఒక్క వీడియోల విషయంలో ఈ ఇబ్బంది తలెత్తుతోందని, ఫొటోలు వంటి ఇతర ఫైల్స్ బాగానే ఉన్నాయని '9టు5 గూగుల్' పేర్కొంది. వాట్సాప్ మెసెంజర్‌లో అప్‌లోడ్ ప్రక్రియలో ఈ ఇబ్బంది కనిపించింది.

ఐఫోన్‌లో ఉండే వాట్సాప్‌లో మాత్రం ఈ సమస్య ఎదురుకావడం లేదు. అలాగే గెలాక్సీ సిరీస్‌లోనూ లేదు. వాట్సాప్ అప్డేట్‌లో వచ్చిన సమస్య కావచ్చని కూడా భావిస్తున్నారు. దీనిని పరిష్కరించేందుకు తాత్కాలిక ఏర్పాటు ఒకటి చేశారు. ఇంతకుముందు వెర్షన్ అంటే 2.24.8.85కి రివర్ట్ కావాలని చెబుతున్నారు. అయితే ఈ సమస్య రెగ్యులర్ అప్డేట్ అవసరాన్ని మాత్రం చెబుతోంది.

ఒకేసారి రెండు యాప్స్ డౌన్‌లోడ్



గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఇకపై ఒకే సారి రెండు యాప్‌లను ఆండ్రాయిడ్ యూజర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందుకు అనుగుణంగా గూగుల్ ప్లే స్టోర్ అప్డేట్ చేసింది. ఈ ఫీచర్ కొన్ని డివైజుల్లోకి ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందని '9టు5 గూగుల్' పేర్కొంది. 40.6.31 వెర్షన్‌పై రన్ అయ్యే పిక్సెల్ ఫోన్లకు కూడా ఇది అందుబాటులోకి వచ్చిందని 'ఆండ్రాయిడ్ పోలీస్' తెలిపింది. అయితే ఈ అప్డేట్‌కు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు రెంటిని ఒకేసారి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదనంగా కావాలంటే మాత్రం క్యూలో అదీ స్పేస్ అందుబాటులోకి వచ్చే వరకు వేచి ఉండాలి. మొదట్లో వచ్చిన లీకుల ప్రకారమైతే అయిదు యాప్‌లు ఒకేసారి డౌన్‌లోడ్ కావాలి. ఇప్పుడు వచ్చిన అప్డేట్ కూడా సరిపోదు. ఇంకా మెరుగుపర్చాల్సి ఉంది. యాప్ అప్డేట్స్‌కు మల్టీ డౌన్‌లోడ్ ఫీచర్‌కు వర్తించదు. గూగుల్ ప్లే స్టోర్ ఒకేసారి పలు అప్డేట్‌లను ప్రాసెస్‌లో పెడుతుంది. దాంతో చాలా మంది యూజర్లు అప్డేట్ కోసం వేచి చూడాల్సి వస్తుంది.

కిడ్స్‌కు బెస్ట్ యాపిల్ వాచీ

పిల్లల చేతికి వాచీ ఈ రోజుల్లో వింత విషయం ఏమీ కాదు. అయితే ఎలాంటి వాచీ ఇస్తే పిల్లలకు మంచిదన్నది ప్రశ్న. అందుకు యాపిల్ వాచీ అనుకూలంగా ఉంటుందన్నది ఒక సమాధానం. అదెలాగంటే....

- పేరెంట్స్‌తో టచ్, లొకేషన్ షేరింగ్, బాధ్యతలను అందుకునే విధంగా ఉంటుంది. వెబ్, సోషల్ మీడియా యాప్స్‌తో యాక్సెస్ కూడా పరిమితం. ఒకరకంగా పిల్లకు ముందే సాంకేతికను పరిచయం చేసేందుకు ఉపయోగపడుతుంది. అలాగని అతికి ఆస్కారం ఉండదు.
- కొద్ది పాటి ఫీజు చెల్లించి ఫ్యామిలీ సెటప్ ఫీచర్‌తో పిల్లల్ని కంట్రోల్ చేసుకోవచ్చు.



- ఫ్యామిలీ సెటప్‌లో స్పెషల్ సెటప్ 'స్కూల్‌టైమ్'. స్కూల్ పనిచేస్తున్న వేళల్లో దీంతో యాపిల్ వాచీ వినియోగాన్ని పరిమితం చేయవచ్చు. పేరెంట్స్ ఐఫోన్‌తో ఈ పని చేయవచ్చు.
- పిల్లల చేతులు సన్నగా ఉంటాయి. అందుకని వారికి అనుకూలమైన బ్యాండ్స్ ఉండాలి. అలా చూసుకున్నప్పుడు బకెల్ ఉన్న నైక్ స్పోర్ట్ స్టయిల్ బ్యాండ్ బాగా సూటవుతుంది.
- కొత్తగా వస్తున్న సెల్యులర్‌తో యాపిల్ వాచ్ ఎస్‌ఈ 2 అలాగే సెకండ్ హ్యాండ్ యాపిల్ వాచీలు వంటివి పిల్లలకు ఇవ్వడం మంచిది. ఇవైతే బడ్జెట్ ధరలో అందుబాటులో ఉంటాయి.
- ఫ్యామిలీ సెటప్ కోసం జీపీఎస్‌కు తోడు సెల్యులర్ వాచీలు మంచివి. ముఖ్యంగా 40ఎంఎం నుంచి 41 ఎంఎం, 44ఎంఎం, 45 ఎంఎం ఫోన్లు బాగుంటాయి. అలాగే ఐఫోన్ లేకుండా అంటే మాత్రం యాపిల్ వాచీ సిరీస్ 3ని తీసుకోరాదు. అలాగే గత సెప్టెంబర్‌లో సపోర్ట్ యాపిల్ వాచీలకు వాచ్ఓఎస్10ని ఉచిత సాఫ్ట్‌వేర్ అప్డేట్‌గా విడుదల చేసింది. ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.



ఆండ్రాయిడ్ ఉత్పత్తులకు 'ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్'

ఆండ్రాయిడ్ డివైజ్‌లకు 'ఫైండ్ మై డివైజ్ నెట్‌వర్క్' విడుదల అవుతోంది. వచ్చే నెలకల్లా ఈ పని పూర్తవుతుంది. ఎయిర్‌ట్యాగ్ లాంటి ట్రాకర్స్ సైతం అందుబాటులోకి వస్తాయి. స్మార్ట్‌ఫోన్, ఇయర్‌బడ్స్‌కు జతచేసి ట్రాకర్ల సహాయంతో అవి ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చు. గూగుల్ అకౌంట్‌తో యూజర్ సంతకం చేస్తే చాలు, స్మార్ట్‌ఫోన్లకు ఆటోమేటిక్‌గా మిగిలిన వాటికి మాన్యువల్‌గా ఈ ఫీచర్ వచ్చి చేరడమే కాదు, పని ప్రారంభమవుతుంది. కార్డుపై ఉన్న బటన్‌ని రెండుసార్లు ప్రెస్ చేస్తే, ఫాస్ట్ పెయిర్‌తో సెటప్ ప్రక్రియ జరుగుతుంది. ఆటోమేటిక్‌గా సంబంధిత ప్రాంప్ట్ ప్రత్యక్షమవుతుంది. యావత్తు ప్రక్రియకు పట్టే సమయం నిమిషానికి లోపే ఉంటుంది. ఇది ఒకసారి జత అయితే చాలు, మ్యాప్‌పై కరెంట్ లొకేషన్‌ను గుర్తిస్తుంది. సౌండ్‌కు అనుమతిస్తుంది. మరొక యూజర్‌తో సదరు లొకేషన్‌ను షేర్ చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ సానుకూలత ఉన్న డివైజుల్లో ఒకే రకంగా దీని పనితీరు ఉంటుంది.

మెమరీ నుంచి ఫేస్ తొలగింపు



మీ పిల్లలు అనగానే సెల్ ఓపెన్ చేసి ఫొటోలు చూపిస్తారు చాలా మంది. అలాగే పలు ఫొటోలను పదేపదే చూసుకుని మురిసిపోతుంటారు ఇంకొందరు. ఈ నేపథ్యంలో గూగుల్ ఫొటోస్ కొత్త వెసులుబాటును తీసుకువచ్చింది. పదేపదే చూసుకునే ఫొటోల్లో మళ్ళీ కొందరి మొహాలు చూస్తే చిరాకు ఎత్తుతుంది. అలాంటివారిని ఇకపై తొలగించవచ్చు. అందుకోసం యాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్ళాలి. ప్రిఫరెన్సెస్ - మెమరీస్ - హైడ్ పీపుల్ అండ్ పెట్స్ దగ్గరకు వెళ్ళాలి. అక్కడ వద్దనుకున్న మొహాన్ని తొలగించే వెసులుబాటు ఉంటుంది. గూగుల్ ఫొటోస్ లేటెస్ట్ వెర్షన్‌లో ఈ సదుపాయం ఉంది. హైడ్ ఫేస్ ఫ్రమ్ మెమరీస్‌ని మొదట '9టు5 గూగుల్' గుర్తించింది. ఓవర్‌ఫ్లో మెనూలో ఈ కొత్త ఆప్షన్ కనిపిస్తుంది. ఫేస్ హైడింగ్‌లో కూడా రెండు ఆప్షన్లు ఉంటాయి. మొదటిది ఫేస్‌ని బ్లాక్ చేయడం కాగా రెండోది 'షో లెస్'. రెండోదాని ప్రకారం తొలగిద్దామనుకున్న వ్యక్తి ఫేస్‌ను గుర్తించవచ్చు. ఎలాగంటే, గ్రూపులో ఉన్న ఇతరులకు మాత్రం ఆ ఫేస్ కనిపిస్తుంది. అంటే మెమరీలో అసలు ఫొటో ఉంటుంది. కావాలనుకున్న వ్యక్తికి మాత్రం ఆ ఫేస్ కనిపించదు.



శాంసంగ్ గుడ్ లాక్ యాప్

శాంసంగ్ గెలాక్సీ ఫోన్లను ఉద్దేశించి రూపొందించిన కస్టమైజేషన్ యాప్ 'గుడ్ లాక్' గూగుల్ ప్లే స్టోర్‌లోనూ లభ్యమవుతోంది. ఇంతవరకు దీన్ని గెలాక్సీ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఉండేది. ఇది శాంసంగ్ గెలాక్సీ ఫోన్లకు ఉద్దేశించిన టూల్‌కిట్. లాక్ స్క్రీన్, నోటిఫికేషన్స్, యాప్ లాంచర్ వరకు సర్దుబాటు చేసుకునేందుకు అవసరమైన మాడ్యూల్స్ ఇందులో ఉంటాయి. చాలా పర్సనల్, కస్టమైజబుల్ యాప్ ఇది. ఆండ్రాయిడ్ ఫోన్లకు ఇది ఉపయోగపడదు. హార్డ్‌వేర్ సపోర్ట్ చేయకుంటే వార్నింగ్ బ్యానర్ ప్రత్యక్షమవుతుంది.

యాపిల్ యాప్స్ నుంచి ఏఐ ఇమేజ్ జనరేటర్ తొలగింపు



యాపిల్ ఇంతవరకు మూడు ఏఐ న్యూడ్ ఇమేజ్ జనరేటర్ యాప్స్‌ను తొలగించింది. నిజానికి ఇమేజ్‌ల్లోని వ్యక్తులు ధరించిన దుస్తులు తొలగించేందుకు ఈ యాప్‌లు ఉపయోగపడతాయి. ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్ విషయంలో ఇది బాగా ఉపయోగపడుతోంది. అయితే 404 మీడియా ఫిర్యాదుపై యాపిల్ ఈ చర్య తీసుకుంది. తమకు చెందిన ఏ యాప్ కూడా పోర్నోగ్రఫీ ప్రమోషన్‌ను అనుమతించవని యాపిల్ తన రెవ్యూ గైడ్‌లైన్స్‌లో స్పష్టం చేసింది. తద్వారా జరిగే బెదిరింపులు సహా ఏ పరిణామాలను సహించదని కూడా తెలిపింది. తాము సొంతంగా చేసిన పరిశోధన, కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టెక్నాలజీ మంత్రి - డీప్ ఫేక్‌పై వ్యక్తం చేసిన ఆందోళన తదితరాలన్నీ యాపిల్ ఈ చర్య తీసుకునేందుకు దోహదపడ్డాయని సమాచారం.

టెలిగ్రామ్ అప్డేట్స్



టెలిగ్రామ్ ఈసారి గుర్తించదగ్గ అప్డేట్‌ను విడుదల చేసింది. ప్రొఫైల్ వీక్షణ నుంచి ఎన్‌హ్యాన్స్‌డ్ లొకేషన్ షేరింగ్ వంటివి చాలా సదుపాయాలను ఈ అప్డేట్‌తో రిలీజ్ చేసింది. ఆండ్రాయిడ్, ఓఎస్ యూజర్ల కోసం సంబంధిత అప్‌డేట్ అంటే వెర్షన్ 10.11 అందుబాటులో ఉంది.

ప్రొఫైల్‌కు సంబంధించి ఇంతకుమునుపు యాప్ పరిధిలోనే ప్రొఫైల్‌ను చూడటానికి తోడు ఎడిట్ చేసుకునే వీలు ఉండేది. పర్సనలైజేషన్, కంట్రోల్‌కు సంబంధించి అదనపు లేయర్ ప్రస్తుత అప్డేట్‌తో కల్పించినట్లయిందని '9టు5 గూగుల్' నివేదించింది. మూడు స్టోరీలను పిన్ చేసుకోవచ్చు. ఫెస్టివ్ ప్రొఫైల్‌ను పెట్టుకుని గ్రీటింగ్స్ అందుకోవచ్చు. లొకేషన్ షేరింగ్‌ను కూడా స్ట్రీమ్‌లైన్‌లో పెట్టింది. యూజర్ తను ఎక్కడ ఉన్నాను అన్న విషయాన్ని కొంతకాలానికి లేదా శాశ్వతంగా తెలియజేసే ఆప్షన్ కలుగజేసింది. అలాగే మరొకరు తన లొకేషన్‌కు వస్తున్నప్పుడు అలెర్ట్ వచ్చేలా యూజర్ ఏర్పాటు చేసుకోవచ్చు. కస్టమైజ్ నోటిఫికేషన్ సెట్టింగ్స్ వీలు కల్పించింది. స్పందనలు, స్టోరీలకు ఇది అనువుగా ఉంటుంది. అంటే యూజర్ తన అవసరాలకు తగినవిధంగా నోటిఫికేషన్ ప్రిఫరెన్స్‌లు పెట్టుకోవచ్చు. గ్రూప్ అడ్మినిస్ట్రేటర్లకు కూడా ఇకపై మరింత సమర్థంగా పనిచేసుకునే వీలు కల్పించింది. మల్టిపుల్ మోడరేషన్ చర్యలకు అవకాశం ఇచ్చింది.

ప్రీమియం యూజర్ల కోసం మరికొన్ని ప్రత్యేక ఫీచర్లను తెచ్చింది. వివిధ పోల్స్ విషయంలో యానిమేటెడ్, కస్టమ్ ఎమోజీలు; ప్రకటనలకు తావులేని విధానం తదితరాలు ఇందులో ఉన్నాయి. తమకు మెసేజ్‌లను ఫార్వార్డ్ చేసిన వ్యక్తి ప్రొఫైల్ ఫొటో కనిపిస్తుంది. డెస్క్‌టాప్ యాప్‌లో వెబ్‌సైట్స్‌కు సంబంధించి వ్యూ సపోర్ట్ ఇచ్చింది. అలాగే వివిధ చానల్స్ యజమానులకు ప్రకటనల ఆదాయాన్ని పంచుకునే వీలూ కల్పించింది.



ఫోన్‌ఎరీనా నుంచి 'ఫోన్ చరిత్ర'

దైనందిన జీవితంపై మొబైల్ టెక్నాలజీ చూపిన ప్రభావం ఇంతా అంతా కాదు. చేతిలో సెల్ లేకుండా కాలు కూడా కదపలేని పరిస్థితి వచ్చిందంటే అతిశయోక్తి కూడా కాదు. ఆర్థిక వ్యవస్థలు, పరిశ్రమలు సహా వ్యక్తిగత జీవితం వరకు అంతటా దాని ప్రభావం ఉంది. అటూ ఇటూగా ఇదంతా రెండు దశాబ్దాలకు పైబడిన చరిత్ర. మొబైల్ టెక్నాలజీకి సంబంధించిన సమస్త వివరాలతో 'ఫోన్ ఎరీనా' తాజాగా ఒక దాచుకోదగ్గ పుస్తకాన్ని(కలెక్టర్స్ ఇష్యూ)ని తీసుకువచ్చింది. సెల్ ఫోన్ హిస్టరీని అందులో నిక్షిప్తం చేసింది. 'ఐకానిక్ ఫోన్స్: రివల్యూషన్ ఎట్ యువర్ ఫింగర్‌టిప్స్' పేరిట ఇది విడుదలైంది. సెల్ ఫోన్ వివరాలను తెలుసుకోవాలని భావించే ఆసక్తిపరులకు ఇదో మంచి కలెక్టర్స్ బుక్.

మొబైల్ టెక్నాలజీ చరిత్రలోని ప్రతి అడుగును దీన్లో పొందుపరిచింది. రెండు దశాబ్దాల క్రితంతో పోల్చుకుంటే ఫోన్ ఇండస్ట్రీ స్వరూప స్వభావాలే మారిపోయాయి. ఈ రంగంలో అత్యుత్తమ సాంకేతికతతో వివిధ ఉత్పత్తులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు ఉన్నతీకరణ చోటుచేసుకుంటోంది. సరికొత్త ఫీచర్లతో వచ్చే ఉత్పత్తులు పాతవాటికి గుడ్‌బై చెప్పిస్తున్నాయి. డయల్-అప్ ఇంటర్నెట్ రోజుల నుంచి మొదలుపెడితే సీడీల యుగం ఒక వరసైతే అలాంటివన్నింటినీ తలదన్నేలా మరికొన్ని వచ్చాయి. దాంతో అవన్నీ మూలనపడ్డాయి అనే కంటే మ్యూజియానికి పరిమితమయ్యాయని చెప్పడం వాస్తవ వ్యాఖ్యానమవుతుంది. ఈ క్రమంలో మొదటి ఐఫోన్ కూడా ప్రస్తావనార్హం. అదిప్పుడు షార్ట్ ఫిల్మ్‌ను తీసే స్థాయికి చేరుకుంది. మోటోరోలాకు చెందిన ప్రాజెక్ట్ సలిక్వా కూడా చర్చనీయాంశమే. చైనీస్ ఎంట్రప్రెన్యూర్లు కార్ల్ పీ, పెటె లవ్ కలిసి 2014లో సృష్టించిన వన్ ప్లస్ వన్ ఏకంగా ఆండ్రాయిడ్ యూజర్ల అవసరాలను తీర్చే శక్తిమంతమైన ఫోన్‌గా సెల్ చరిత్రకెక్కింది. ఈ ఐకానిక్ ఫోన్లే కాకుండా సమస్త చరిత్రను ఈ పుస్తకంలో ఫోన్ ఎరీనా పొందుపర్చింది.

యాపిల్ నుంచి బీట్స్ సోలో బడ్స్

యాపిల్ నుంచి బీట్స్ సోలో బడ్స్ విడుదలయ్యాయి. బీట్స్ సోలో బడ్స్, బీట్స్ సోలో 4 పేరిట రెండు కొత్త వైర్‌లెస్ ఆడియో ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చాయి. యాపిల్, ఆండ్రాయిడ్ డివైజ్‌లు రెంటినీ ఇవి సపోర్ట్ చేస్తాయి. యూఎస్‌బీ టైప్ - సి చార్జింగ్ సపోర్ట్ ఉంది. మొత్తం ప్లేబ్యాక్ టైమ్ 18 గంటలు. పర్సనలైజ్డ్ స్పేషియల్ ఆడియో ఫీచర్‌కు తోడు హెడ్ ట్రాకింగ్, 50 గంటల సేపు బ్యాటరీ లైఫ్ వీటి సొంతం. పది నిమిషాల సేపు చార్జింగ్‌తో అయిదు గంటల మేర ప్లేబ్యాక్‌కు అవకాశం ఉంటుంది. బీట్స్ సోలో 4లో 40ఎంఎం డ్రైవర్స్ ఉన్నాయి. హెడ్‌ఫోన్‌లోని బి బటన్ మ్యూజిక్ ప్లేబ్యాక్, వాల్యూమ్, కాల్స్, యాక్టివ్ వాయిస్ అసిస్టెంట్స్‌ను కంట్రోల్ చేస్తుంది. బీట్స్ సోలో బడ్స్ రమారమి రూ.6,700కి లభిస్తాయి. ప్రస్తుతం అమెరికా మార్కెట్లో ఉన్నాయి. ఆర్కిటిక్ పర్పుల్, మట్టే బ్లాక్, స్టోర్మ్ గ్రే, ట్రాన్స్‌పరెంట్ రెడ్ రంగుల్లో లభిస్తున్నాయి. బీట్స్ సోలో 4ని యాపిల్ వెబ్‌సైట్‌నుంచి ఎవరైనా అమెరికా నుంచి తెప్పించుకోవచ్చు. దీని ధర రమారమి రూ.16,700 కాగా క్లౌడ్ పింక్, మట్టే బ్లాక్, స్లేట్ బ్లూ షేడ్స్ రంగుల్లో లభిస్తోంది.





సరికొత్త హంగులతో నోకియా!

నోకియా మోడ్రన్ వెర్షన్‌పై హెచ్ఎండీఏ(హ్యూమన్ మొబైల్ డివైజెస్) పని చేస్తోందని సమాచారం. 'నోకియా 3210' పేరిట రాబోతున్న ఈ మొబైల్ ప్రపంచంలోనే మొదటిసారి ఇంటర్నల్ ఎంటెన్నాతో ఉండనుంది. మూడు గేమ్స్ ఉండనున్నాయి. నిజానికి ఈ బ్రాండ్ ఫోన్ 1999లో వచ్చింది. బల్కీ ఫీచర్ ఫోన్‌గా ఇంటర్నల్ ఎంటెన్నా, టీ9 ప్రిడిక్టివ్ టెక్స్ట్‌తో ఉండేది. ప్రస్తుతం వస్తున్న దానిలో 40 వరకు మోనోఫోనిక్ రింగ్‌టోన్స్ ఉంటాయి. బ్లాక్ అండ్ గ్రీన్ 1-5 ఇంచీల బ్లాకిట్ మోనోక్రోమాటిక్ ఎల్‌సీడీ స్క్రీన్ ఉంటుంది. బరువు 150 గ్రాములు కాగా ఇప్పుడు వస్తున్న స్మార్ట్ ఫోన్లతో పోల్చుకుంటే తక్కువే. ఇందులో స్నేక్, మెమరీ, రొటేషన్ అనే గేమ్స్ ముందే ఇన్‌స్టాల్ అయి ఉంటాయి. కొన్ని వెర్షన్లలో అజ్ఞాతంగా మరికొన్ని గేమ్స్ ఉంటాయి. స్పెషల్ సాఫ్ట్‌వేర్‌కు తోడు డేటా కేబుల్ ఉపయోగించి వాటిని యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. 'నోకియోమొబ్' ఇటీవలి రిపోర్ట్ ప్రకారం ఫినిష్ ఔట్‌లెట్ 'జిజాంట్టి' అనుకోకుండా నోకియా కొత్త వెర్షన్ పేరును బైటపెట్టింది. కొత్త ఫోన్ సియాన్, ఎల్లో రంగుల్లో మే 8నుంచి అందుబాటులోకి రానుంది. దీని ధర 89 యూరోలు(రమారమి రూ.7,980) ఉంటుందని ఆ నివేదికలో పేర్కొంది. అయితే ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంటుందా అన్నది తెలియలేదు. మైక్రో ఎస్‌డీ కార్డ్, బ్లూటూత్, 4జీ కనెక్టివిటీ 1450 ఎంఏహెచ్ బ్యాటరీ, యూఎస్‌బీ-సీ చార్జింగ్ సౌలభ్యం ఉండనున్నాయి.




మార్కెట్‌లోకి యాపిల్ ఐపాడ్ ప్రొ

యాపిల్ ఐపాడ్ ప్రొ ఈ నెల 7న జరిగే 'లెట్ లూజ్' ఈవెంట్‌లో విడుదల కానుదని భావిస్తున్నారు. హార్డ్‌వేర్ అప్‌గ్రేడేషన్స్‌కు తోడు సరికొత్త ఓలెడ్ స్క్రీన్, చిప్ ఉండనున్నాయి. ఏఐ ఎక్స్‌పీరియెన్సెస్‌కు అనుగుణంగా డిజైన్ చేశారని అంటున్నారు. రెండు సైజులు - 11 ఇంచీలు, 12.9 ఇంచీలతో ఐపాడ్ ప్రొ మోడల్స్ వస్తున్నాయి. ఒక అనలిస్టుకు తోడు 'బ్లూమ్‌బర్గ్' రిపోర్ట్ ప్రకారం ఓలెడ్ ప్యానల్స్ కోసం శాంసంగ్, ఎల్‌జీ కంపెనీలతో యాపిల్ చర్చలు జరిపింది. మునుపు విడుదల చేసిన వాటితో పోల్చుకుంటే కొత్త దాని మందం 20 శాతం ఎక్కువగా ఉంటుందని '9టు5మాక్' తెలిపింది. రాబోయే క్వాల్కామ్ పవర్డ్ విండోస్ ల్యాప్‌టాప్‌లను తట్టుకునేందుకు వీలుగా ఎం4 చిప్ దీనికి ఉండనుందని కూడా బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఏఐ సామర్థ్యం ఉండే టాబ్లెట్‌గా కూడా అభివర్ధించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 4 మే 2024

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ జూన్ ఎగ్జామినేషన్

సైన్స్ విభాగాల్లో బోధన, పరిశోధనలకు అవకాశం కల్పించే జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ 2024 జూన్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వహిస్తోంది. ఇందులో జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని రీసెర్చ్ సెంటర్లు, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి ఫెలోషిప్ కింద రెండేళ్లపాటు నెలకు రూ.37,000లు; కంటింజెన్సీ గ్రాంట్ కింద రూ.20,000 ఇస్తారు. తరవాత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. లెక్చరర్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు ప్రముఖ యూనివర్సిటీలు/డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ప్రయత్నించవచ్చు.



సబ్జెక్టులు
- కెమికల్ సైన్సెస్
- ఎర్త్-అట్మాస్ఫెరిక్-ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్
- మేథమెటికల్ సైన్సెస్
- ఫిజికల్ సైన్సెస్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ ఉత్తీర్ణులు; కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బీఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు పీజీలో 50 శాతం మార్కులు చాలు. బీఈ/బీటెక్/బీఎస్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థులు/ఫలితాల కోసం చూస్తున్నవారు ఫెలోషిప్‌నకు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. వీరు లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌నకు అనర్హులు. ● ఫెలోషిప్‌నకు అభ్యర్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. మహిళలు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు అయిదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ఎగ్జామ్ వివరాలు: దీనిని సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్ అందరికీ కామన్‌గా ఉంటుంది. దీనిలో జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. రెండో పార్ట్‌లో అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రశ్నలు ఇస్తారు. మూడో పార్ట్‌లో సైంటిఫిక్ కాన్సెప్ట్‌లు, సైంటిఫిక్ నాలెడ్జ్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. మొదటి రెండు పార్ట్‌లలోని ప్రశ్నలకు ఒక్కోదానికి రెండు మార్కులు; మూడో పార్ట్‌లోని ప్రశ్నలకు ఒక్కోదానికి నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే సబ్జెక్ట్‌కు నిర్దేశించిన మేరకు మార్కులు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 200. పరీక్ష సమయం మూడు గంటలు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1150; ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.325
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 21
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 25 నుంచి 27 వరకు
- **పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నర్సరావుపేట, నెల్లూరు, ఒంగోలు, ప్రొద్దుటూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, సూరంపాలెం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్.
- **జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఎగ్జామినేషన్ 2024 తేదీలు:** జూన్ 25, 26, 27
- **వెబ్‌సైట్:** csirnet.nta.nic.in

సంప్రదాయ కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల - సంప్రదాయ కలంకారీ కళకు సంబంధించి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తోంది. డిప్లొమా వ్యవధి నాలుగేళ్లు. సర్టిఫికెట్ కోర్సు వ్యవధి రెండేళ్లు. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు ఒక్కొక్కరి పేరు మీద రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన వారికి ఆ మొత్తాన్ని అందిస్తారు.

- డిప్లొమా ప్రోగ్రామ్‌లో టెంపుల్ ఆర్కిటెక్చర్, స్టోన్ స్కల్ప్చర్, సుధా స్కల్ప్చర్, మెటల్ స్కల్ప్చర్, వుడ్ స్కల్ప్చర్, ట్రెడిషనల్ పెయింటింగ్ విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగంలో 10 సీట్లు ఉన్నాయి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 17
- ఫోన్. నెం. 0877-2264637, మొబైల్ నెం.9866997290
- **వెబ్‌సైట్:** www.tirumala.org

ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది ప్రోగ్రామ్‌లో హ్యూమన్ రిసోర్సెస్ ఆపరేషన్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులు ఉంటాయి. రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో కోర్ కోర్సులు, స్పెషలైజేషన్‌కు సంబంధించిన ఎలక్టివ్ కోర్సులు, ఇండస్ట్రియల్ విజిట్స్, మేజర్ ప్రాజెక్ట్ వర్క్, ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ఇందులో మొత్తం 120 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 41, ఎస్సీ అభ్యర్థులకు 16, ఎస్టీ అభ్యర్థులకు 8, ఓబీసీ అభ్యర్థులకు 28, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 12, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు ప్రత్యేకించారు.

స్పెషలైజేషన్లు: సస్టయినబిలిటీ, డేటా సైన్స్ అండ్ డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ అండ్ క్లౌడ్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. స్పాన్సర్డ్ అభ్యర్థులు మినహా అందరికీ క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి.

అడ్మిషన్ టెస్ట్: పరీక్ష సమయం గంటన్నర. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంట్రప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలకు సంబంధించి మొత్తం 90 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్/అడ్మిషన్ టెస్ట్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రం అకడమిక్ మెరిట్‌కు 60 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 10 శాతం, అనుభవానికి 10 శాతం వెయిటేజీ ఇస్తారు.



ముఖ్య సమాచారం
- దరఖాస్తు ఫీజు: రూ.500
- దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 14
- ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 తేదీ: జూన్ 21
- వెబ్‌సైట్: www.npti.gov.in

తెలంగాణ 'దోస్త్' నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)' 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల అనుబంధ కళాశాలలతోపాటు తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలోనూ అడ్మిషన్స్ ఇస్తారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు, తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిటెక్నిక్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారు, కంపార్ట్‌మెంటల్ ద్వారా పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడు విడతల్లో ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు.



దోస్త్ 2024 షెడ్యూల్

ఫేజ్-1
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **రిజిస్ట్రేషన్:** మే 6 నుంచి 25 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** మే 15 నుంచి 27 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** మే 24, 25
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 3
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 4 నుంచి 10

ఫేజ్-2
- **దరఖాస్తు ఫీజు:** రూ.400
- **రిజిస్ట్రేషన్:** జూన్ 4 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 4 నుంచి 14 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 13
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 18
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 19 నుంచి 24

ఫేజ్-3
- **దరఖాస్తు ఫీజు:** రూ.400
- **రిజిస్ట్రేషన్:** జూన్ 19 నుంచి 25 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూన్ 19 నుంచి 26 వరకు
- **స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్:** జూన్ 25
- **సీట్ అలాట్‌మెంట్:** జూన్ 29
- **ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్:** జూన్ 29 నుంచి జూలై 3 వరకు

అదనపు సమాచారం
- **కళాశాలల్లో అభ్యర్థుల రిపోర్టింగ్:** జూన్ 29 నుంచి జూలై 5 వరకు
- **స్టూడెంట్స్ ఓరియంటేషన్:** జూలై 1 నుంచి 6 వరకు
- **మొదటి సెమిస్టర్ ప్రారంభం:** జూలై 8 నుంచి
- **వెబ్‌సైట్:** dost.cgg.gov.in



ఐఏఆర్ఐలో వివిధ ఖాళీలు

న్యూఢిల్లీలోని ఐకార్ - ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డివిజన్ ఆఫ్ ప్లాంట్ ఫిజియాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 8



పోస్టుల వివరాలు:
1. రీసెర్చ్ అసోసియేట్: 1 పోస్టు
2. సీనియర్ రీసెర్చ్ ఫెలో: 4 పోస్టులు
3. యంగ్ ప్రొఫెషనల్-2: 3 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 12

వెబ్‌సైట్: iari.res.in/bms/announcements/jobs.php

ఐకార్‌లో ఎస్ఆర్ఎఫ్

హైదరాబాద్‌లోని ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్) **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: పురుషులు 35 ఏళ్లు, మహిళలు 40 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.31,000 **ఇంటర్వ్యూ తేదీ:** మే 16

ప్రదేశం: ఐకార్ - అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.

వెబ్‌సైట్: atarihyderabad.icar.gov.in/

టీహెచ్ఎస్‌టీఐలో పోస్టులు

హరియాణా రాష్ట్రం ఫరిదాబాద్‌లోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ) కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్: 1
2. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్: 1

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటెక్, లైఫ్/మెడికల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.

వయసు: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు, మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించరాదు.

జీతం: జూనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.85,000. మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.60,000

దరఖాస్తు ఫీజు: రూ.590. ఎస్సీ/ఎస్టీ/మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు రూ.118.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా అప్లయ్ చేసుకోవాలి.

దరఖాస్తుకు చివరితేదీ: మే 15

వెబ్‌సైట్: https://thsti.res.in/

తపాలా శాఖలో డ్రైవర్లు



బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, కర్ణాటక సర్కిల్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: స్టాఫ్ కార్ డ్రైవర్ **ఖాళీలు: 27**

అర్హత: 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్(హెచ్ఎంవీ)తో పాటు మూడేళ్ల పని అనుభవం, మోటార్ మెకానిజంపై పరిజ్ఞానం కలిగి ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.19,900 - రూ.63,200

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, డ్రైవింగ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను మేనేజర్, మెయిల్ మోటార్ సర్వీస్, బెంగళూరు చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 14

వెబ్‌సైట్: https://www.indiapost.gov.in/

ఇర్కాన్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూఢిల్లీ.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 6**

అర్హత: డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 30 సంవత్సరాలు మించరాదు.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

దరఖాస్తుకు చివరి తేదీ: మే 10

వెబ్‌సైట్: https://www.ircon.org/

చిట్టీలు



మీకు తెలుసా?

- ఎలుకలా ఉండే ఈ జంతువును 'రాక్ హైరాక్స్' అని పిలుస్తారు. ఈ జంతువును స్టోన్ బాడ్జర్, రాక్ రాబిట్ అంటూ పిలుస్తారు కొన్ని చోట్ల. రాళ్లలో ఉంటాయి కాబట్టి రాక్ హైరాక్స్ అని పిలుస్తారు. రాళ్ల తొర్రల్లో నివసిస్తాయి.
- 54 సెం.మీ. పొడవు ఉంటాయి. రెండు కేజీల బరువు నుంచి ఐదు కేజీల వరకు ఉంటాయి. మగ జంతువులు పెద్దగా కనిపిస్తాయి.
- గంటకు 30 కిమీ వేగంతో పరిగెత్తుతాయి.
- ఆఫ్రికా, పశ్చిమ ఆసియాలో ఎక్కువగా ఈ జాతి కనపడుతుంది. ఒకచోట నుంచి మరో ప్రాంతానికి వెళ్లటానికి ఇష్టపడదు.
- ఒకేసారి ఒకటి నుంచి ఆరు పిల్లలను కంటాయి. మూడు నెలల తర్వాత స్వతంత్రంగా జీవిస్తాయి.
- ఆఫ్రికాలోని దక్షిణ దేశాలు, ఈజిప్టు ప్రాంతాల్లోని కొందరు ఈ జంతువును వేటాడి తింటారు. అందుకే ఆ ప్రాంతాల్లో వీటి సంఖ్య తగ్గిపోతోంది.



- ఇవి ఎక్కువగా మధ్యాహ్నం వరకూ ఎండలో ఉండటానికి ఇష్టపడతాయి.
- వీటి కడుపులో మూడు గదులు ఉంటాయి. వాటి పిల్లలు జీర్ణం చేసుకోలేకవని పచ్చికను నమిలి లోపల పెట్టుకుంటాయి. ఆ తిండి వాటి పిల్లలకు తినిపిస్తాయి.
- 12 సంవత్సరాల వరకూ జీవిస్తాయి.



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 298

5							2	
	2	1	9					3
					2	8		1
			3	7		4		
	4	8	1		9	3	5	
		7		8	5			
9		4	8					
8					1	9	4	
	6							8

సుడోకు - 297 సమాధానం

1	2	9	6	3	7	4	5	8
4	3	8	1	2	5	7	9	6
5	7	6	9	8	4	3	2	1
9	5	1	7	6	3	8	4	2
8	6	2	4	5	9	1	3	7
3	4	7	8	1	2	5	6	9
7	1	5	2	4	6	9	8	3
6	8	3	5	9	1	2	7	4
2	9	4	3	7	8	6	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.